SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume: 54, Issue: 8
JANUARY - 2024 Price Rs. 20/-

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

జనవరి 2024
వెల రూ. 20/-
పుటలు-56



వినా వేంకటేశం ననాథో ననాథః, సదా వేంకటేశం స్మరామి స్మరామి।
హరే! వేంకటేశ! ప్రసీద ప్రసీద, ప్రియం వేంకటేశ! ప్రయచ్ఛ ప్రయచ్ఛ॥

## తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారికి
10-11-2023నుండి 18-11-2023వరకు జరిగిన
**కార్తికబ్రహ్మోత్సవాల** దృశ్యాలు. అందులో పాల్గొన్న
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి,
తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.,
జియ్యంగార్లు, అర్చకులు, ఇతర ప్రముఖులు, కళాబృందాలు మరియు భక్తులు.























# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** న త్వేవాహం జాతు నాసం నత్వం నేమే జనాధిపాః ।
న చైవ న భవిష్యామస్సర్వే వయమతః పరమ్ ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-12వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అహమ్= నేను; జాతు= ఒకప్పుడును; నాసం= (ఇతి) లేననునది; నతు ఏవ= లేనేలేదు; త్వమ్= నీవు(న ఆసీః ఇతి); న= లేవనునది లేదు; ఇమే= ఈ; జనాధిపాః= రాజులు; (న ఆసన్ ఇతి) న= లేరనునది లేదు; అతఃపరమ్= ఇకమీదట; నయం సర్వే= మన మందఱమును; న భవిష్యామః (ఇతి) చ= లేకపోవుదు మనునదియు; న ఏవ = లేదు.

**భావం:** అర్జునా! నేనుగాని, నీవుగాని, (యుద్ధభూమియందు గల) రాజులుగాని, ఒకప్పుడును లేనివారము కాము, ముందును లేకపోవువారముకాము.

## ఎవరు నేర్పారలా...??

నేననఁగా నెంతవాఁడ - నెయ్యపు జీవులలోన
ఈనెపాన రక్షించి - నీశ్వరుఁడే కాక.

ఎవ్వరు బుద్ధి చెప్పిరి - యిలపైఁ జీమలకెల్లా
నెవ్వగఁ బుట్టలఁగొల్చు - నించుకొమ్మని,
అవ్వల సంసార భ్రాంతి - అనాదినుండియు లోలోఁ
దవ్వించి తలకెత్తే యంతర్యామే కాక!

చెట్టుల కెవ్వరు బుద్ధి - చెప్పేరు తతికాలానఁ
బుట్టి కాచిపూచి నిండాఁ - బొదలుమని,
గుట్టుతో జైతన్యమై - గుణము లన్నిటికిని
తిట్ట పెట్టి రచించిన - దేవుఁడింతే కాక!

బుద్ధు లెవ్వరు చెప్పిరి - పుట్టినట్టి మెకాలకు
తిద్ది చన్నుదాగి పూరి - దినుమని,
పొద్దు పొద్దు లోననుండి - భోగములు మఱపిన
నిద్దపు శ్రీవేంకటాద్రి - నిలయుఁడే కాక!

(సం.02 - సంకీర్తన 45)



*సృష్టిలో అన్యోన్యస్నేహముగల జీవులనేకములున్నాయి. వానిలో నేను గూడ ఒకడనేగాని నా గొప్పతనమేమున్నది? సృష్టికర్త పరమేశ్వరుడే అందరిని కాపాడినట్లు నన్నీనెపమున కాపాడుతున్నాడు.*



*ఇలపై చీమలు ప్రయత్నంతో తమ పుట్టలను ధాన్యంతో నింపుకొంటున్నాయి. అలా చేయవలెనని వాటికెవ్వరు నేర్పారు? అనాదిగా జీవులకు అంతరంగంలో సంసార భ్రాంతి గల్గించి పెంపొందించుచున్న సర్వాంతర్యామి పరమేశ్వరుడే వాటి కాబుద్ధి నేర్పి బ్రదుకు తెరువు చూపాడు.*

*అదను తప్పక మొలకెత్తి, పూచి కాచి సంపూర్ణంగా వృద్ధినొందుడని చెట్లకెవ్వరు నేర్పినారు? చరాచరములన్నింటిలో నిగూఢంగా ఉన్న చైతన్యమే వాటి వాటి కాయాగుణములను నియమించి ప్రోదిచేసిన దేవుడే చెట్టు చేమలకట్టిస్థితిని గల్పించాడు.*

*అప్పడే పుట్టిన మృగములకన్నిటికి వెంటనే చనుబాలు గ్రోలి, కసవు మేసి బ్రదుకుమని నేర్పిన వారెవరు? ప్రతినిత్యము అంతరంగంలోనుండి ప్రేరకుడై ఆ యా ప్రాణుల కా యా భోగములు మరపిన దయామయుడైన శ్రీవేంకటేశ్వరుడే ఆ పని చేశాడు అంటూ అన్నమయ్య పై సంకీర్తనలో కీర్తించాడు.*

*- కీ.శే. డా॥సముద్రాల లక్ష్మణయ్య.*

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు

## (ఒక్కరోజు విరాళపథకం)

అన్నం పరబ్రహ్మస్వరూపం. ఆకలిగా ఉన్నవాడికి అన్నం పెట్టడంకంటే పుణ్యం మరొకటి లేదు. ఈ సదాశయంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, తిరుచానూరులలో నిత్యం అన్నప్రసాదవితరణ చేస్తోంది. దీనికి ఎంతోమంది దాతలు విరివిగా విరాళాలు ఇవ్వడమూ తెలిసిన విషయమే! అయితే, భూరివిరాళాలు ఇచ్చే సౌకర్యం అందరికీ ఉండకపోవచ్చు. దీన్ని గమనించి తి.తి.దే. ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చునుకూడా భక్తులనుండి విరాళంగా స్వీకరించేందుకు సంసిద్ధమైంది. భక్తులూ స్పందించండి! తోటివారి ఆకలి తీర్చండి!! మాధవుని అనుగ్రహాన్ని పొందండి!!!

### ఒకరోజు ఖర్చు..

| | |
|---|---|
| 1) అల్పాహారం (టిఫిన్) | - 08 లక్షలు |
| 2) మధ్యాహ్నభోజనం | - 15 లక్షలు |
| 3) రాత్రిభోజనం | - 15 లక్షలు |
| | ------------- |
| మొత్తం | - 38 లక్షలు |
| | ------------- |

ఈ మొత్తాన్ని దాతలు
తి.తి.దే. అన్నప్రసాదం ట్రస్టుకు
అందజేయవచ్చు

ఈ విరాళాలను కేవలం వ్యక్తిగతంగానే కాక, కంపెనీలు, సంస్థలు, ట్రస్టులుసంయుక్తంగా కూడా విరాళాలు అందజేయవచ్చు.

దాతలు రోజువారి మొత్తం(రూ.38 లక్షలు) గానీ, అల్పాహారం (రూ.8 లక్షలు) గానీ, మధ్యాహ్నభోజనం (రూ.15 లక్షలు) గానీ, రాత్రిభోజనం - (రూ.15 లక్షలు) గానీ ఎంపిక చేసుకుని వితరణ చేయవచ్చు. దాతలకు తి.తి.దేవస్థానములు కల్పించే సౌకర్యాలు ఒకే విధంగానే ఉంటాయి.

మరిన్ని వివరాలకు - ఉపకార్యనిర్వహణాధికారి, (డోనార్‌సెల్) ఎఫ్.ఏ.సి., తి.తి.దే., తిరుమల. ఫోన్ - 0877-2263001, 2263472. మెయిల్ ఐడి- cdmc.ttd@tirumala.org.

ఇందులో పాల్గొన్న భక్తదాతలకు భక్తులకు స్వయంగా వడ్డించే అవకాశం మరియు వారిపేరును మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదవితరణకేంద్రంలో ప్రదర్శించబడుతుంది.






తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 54 జనవరి, 2024 సంచిక : 08



వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

**గౌరవ సంపాదకులు**
శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఇ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి(ఎఫ్.ఎ.సి.), తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఎ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఎ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకురాలు**
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఎ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఎ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సప్తగిరి మాస పత్రిక
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- www.tirumala.org;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333

## ఈ నెలలో....

**ఆబాలగోపాలం**

| | | |
|---|---|---|
| తెలుగువారి పెద్దపండుగ | శ్రీ భూమన కరుణాకరరెడ్డి, అధ్యక్షులు, తి.తి.దే పాలకమండలి | 07 |
| సందేహాలు-సమాధానాలు | శ్రీమతి యం.గీతాకుమారి | 09 |
| యతిరాజుల శిష్యానుగ్రహం | డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ | 16 |
| నాదబ్రహ్మ త్యాగయ్య | డా॥ కే.ఎస్.ఇందిర | 31 |
| తొండరడిప్పొడి ఆళ్వార్ | డా॥ మైలవరపు లలితకుమారి | 37 |
| నమ్మకం | శ్రీమతి కోడూరు మారుతీరత్నా | 41 |
| ఆముదం (ఆయుర్వేదం) | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 44 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 45 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకటఅప్పలాచార్యులు | 54 |

**మన దేవాలయాలు**

| | | |
|---|---|---|
| 108 దివ్యదేశాలు- 'తిరుశిరుపులియూర్' | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |

**ధారావాహికలు**

| | | |
|---|---|---|
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| తిరుమల సమయాచారములు | కీ.శే.డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే.శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 19 |
| శ్రీకృష్ణామృతం | "అనంత" (కృష్ణసుందరి సత్తిరాజు) | 32 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన- కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>- మహామహోపాధ్యాయ కొంపెల్ల సూర్యనారాయణ | 47 |

**వనితావాణి**

| | | |
|---|---|---|
| పుష్యలక్ష్మి | శ్రీమతి పి.రమాదేవి | 10 |
| సంక్రాంతి | డా॥యస్.పద్మావతి | 14 |
| గోదాదేవికల్యాణం | శ్రీమతి కొల్లి విజయలక్ష్మి | 33 |
| శ్రీవేంకటేశ్వర వ్రతకల్పవైశిష్ట్యం | శ్రీ ఐనవోలు మోహనాచార్యులు | 35 |

**యువవాణి**

| | | |
|---|---|---|
| మంత్రబలం | శ్రీ చాకిచెర్ల నాగసుదర్శన్‌రావు | 18 |
| వేదగణితం- ప్రాముఖ్యత | శ్రీ ఎం.వి.ఎస్.రామశేషు | 22 |
| దానఫలం | డా॥ ఎస్.కృష్ణమూర్తినాయుడు | 24 |
| ఆర్తనాదం | శ్రీ కొలచిన సూర్యప్రకాశరావు | 39 |
| పతంజలి యోగసూత్రములు | డా॥ స్వర్ణ సాంబశివరావు | 40 |
| దిక్సూచి | ప్రొ॥ జి.వి.శేషారెడ్డి | 52 |

**బాలబాలికలవాణి**

| | | |
|---|---|---|
| తిరుమల శ్రీవారి సుప్రభాతసేవ | డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి | 20 |
| ధర్మదేవత | శ్రీ యెలిశెట్టి శంకరరావు | 42 |
| అన్నిచోట్ల ఎగతాళి తగదు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 46 |
| గౌరవం-అగౌరవం (భాస్కరశతకం) | శ్రీ మారవి వెంకయ్య | 46 |
| కొలనిదోపరికి గొబ్బిళ్లో.. (చిత్రకథ) | కథ: శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు: శ్రీ కె.తులసీప్రసాద్ | 48 |
| బాలవినోదం | | 50 |
| క్విజ్ | | 53 |

ముఖచిత్రం : శ్రీదేవి భూదేవిసమేత శ్రీవేంకటేశ్వరస్వామి, తిరుమల
వెనుకచిత్రం : గోదాదేవి అలంకారంలో తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# శాంతిప్రతీక మకరసంక్రాంతి

**'తమసోమా జ్యోతిర్గమయ'** అన్న ఆర్యోక్తికి ఆచరణాత్మకరూపమే సంక్రాంతి. ఇది సూర్యపరిభ్రమణంతో ముడిపడ్డపండుగ. కాంతికి చిహ్నమైన ఈ సంక్రాంతి మూలప్రకృతి నియమాలకు అనుగుణమైనక్రాంతికే సూర్యుడు ఒకప్రతీక. సూర్యచలనంలోని ఒకమార్పు ఒక సమ్యక్కాంతి.

మేషసంక్రమణం మొదలు ప్రతిమాసంలో వచ్చే సంక్రమణంలో మకరసంక్రమణానికి (సంక్రాంతి) హెచ్చు ప్రాధాన్యతుంది. దక్షిణాయనం పూర్తై ఉత్తరాయణప్రవేశం జరిగే ఈ సంధికాలానికి ఎంతగానో ఆధ్యాత్మిక విశిష్టతుంది. సూర్యుడు మకరరాశిలో ప్రవేశించగానే నూతనతేజస్సుతో ప్రకాశిస్తాడు. పాతక్రొత్తల మేలుకలయికగా సమశీతోష్ణకాలాన్ని చవిచూసే సంక్రాంతి అనిర్వచనీయానుభూతిని ప్రతిప్రాణికి కల్గిస్తుంది. జీవితంలో చైతన్యానికి, పరిస్పందనకు, మార్పుకు, మహనీయభవిష్యత్తుకు శాంతిప్రతీకగా వెలుగొందుతుంది.

సూర్యుడు దక్షిణానికి మళ్లినప్పుడు రసజగత్తులో వెలుగు, వేడి తగ్గి జీవశక్తి సంకోచిస్తుంది. ఆయన ఉత్తరానికి తిరిగినపుడు మళ్లీ జీవశక్తి క్రొత్తకమలంలాగా వికసించి పరిమళిస్తుంది. అందువల్లే ఈ సంక్రాంతి పర్వదినమైంది. మానవాళి ఆత్మల్ని జాగృతంచేసే సూర్యకిరణాలు దేదీప్యమానమంత్రాలై భవిష్యత్తుపై ఆశలను ప్రదీప్తంచేసే గొప్ప గుణమౌతుంది. అంతేగాక గొప్పసందేశాన్ని, విప్లవాన్ని, అభ్యున్నతిని, క్రాంతిని కల్గిస్తుంది.

జీవనచక్రప్రదక్షిణంలో సర్వశుభాన్వితము, శోభాన్వితకాంతి అయిన సంక్రాంతి ఎన్నో ఆశలను, ఊహలను పండించి, ప్రతివ్యక్తిముఖంలో ఏదో నూతనోత్సాహం తాండవింపజేస్తుంది. ఐహికాముష్మిక శ్రీవేంకటేశ్వరుని స్మరించాలన్న ఆరాటంతో భక్తులహృదయంలో మకరసంక్రాంతికాంతి దేదీప్యమానంగా వెలుగొందుతుంది.

తెలుగు సంవత్సరాంతమున జరిగే పెద్ద హేమంతసంబరం సంక్రాంతి సంరంభమే. ఆంగ్లసంవత్సరప్రారంభంలో వినూత్నశోభతో ప్రకాశించే ఈ కాంతిపుంజమే సంక్రాంతి. 'సంక్రాంతి' అంటే మంచినడక, శాంతి అనే అర్థాలతో విరాజిల్లుతోంది. మానవాళి తమ తమ మార్గాలను శాంతిపథంవైపుకు మార్చుకోవాలి. హింసాప్రవృత్తికి స్వస్తిచెప్పి శాంతివైపుకు నడిచే నడకే అసలైన సంక్రాంతి అవుతుంది. ఇలా వేదవేదాంగాలకు, పురాణేతిహాసాలకు, లలితకళలకు, సకలపుణ్యతీర్థాలకు, సంస్కృతీసంప్రదాయాలకు, పుణ్యపర్వదినాలకు పుట్టినిల్లైన మన భారతదేశం జగతిలో ఒక విశిష్టస్థానంగా వెలుగొందుతోంది. అందులో మనం భారతీయులుగా ఈ సంస్కృతీసంప్రదాయాలకు పెద్దపీట వేసిన సంక్రాంతిపండుగను మనం ఆహ్వానిద్దాం. ప్రకాశవంతమైన జీవితాల్ని పొందుదాం.

# తెలుగువారి పెద్దపండుగ



– శ్రీ భూమన కరుణాకర రెడ్డి,
అధ్యక్షులు,
తి.తి.దే. పాలకమండలి

పెద్దవాకిలి అంటే గోపురప్రధాన ద్వారం, అలాగే తెలుగువారికి పెద్ద పండుగ అంటే సంక్రాంతి. సంక్రాంతిని బొమ్మలపండుగ, ముగ్గులపండుగ, పంటలపండుగ, పశువులపండుగ, పెద్దలపండుగ అనికూడా అంటారు. సిరులబంతి సంక్రాంతి వచ్చే పుణ్య కాలంలో, సూర్యుడు మకరరాశిలో ప్రవేశిస్తాడు. అందువల్ల దేవమార్గం ప్రారంభ మయ్యే ఈ ఉత్తరాయణపుణ్యకాలంలో స్నాన, దాన, జప, తర్పణాలను ఆచరించాలి. ప్రకృతి పరంగా చూస్తే ప్రతిఇంటిలో పాడిపంటలు సమృద్ధిగా ఉండే సమయం. లక్ష్మీస్వరూపమైన పశుసంపదను విశేషంగా పూజించే పుణ్యకాలం ఇది. చేతికందిన పంటచూసుకొని అప్పటివరకు పడ్డకష్టాన్ని మరచిపోతాడు రైతన్న. భూమిని సస్యశ్యామలంచేసే భగవంతుడికి, పొలాల్ని దున్నే ఎద్దులకు కృతజ్ఞతానివేదనగా రైతన్న చేసేదే ఈ పశువులపండుగ.





పూర్వం మనపల్లెటూళ్ళు కొత్తధాన్యం నిండిన కొట్టాలతో, పాలపొంగళ్లతో, రంగవల్లులతో ముంగిళ్ళు కళకళలాడుతుండేవి. ఇంటి ఆడ పడచులు సంక్రాంతినాడు పుట్టింటికి రావడం సంప్రదాయం. ఆడవారు పచ్చిపసుపునూరి మొగానికి పూసుకొని, ఎండుమిరపరంగులా కనిపించే బొట్టుపెట్టుకొని, మంచుతెరల్లాంటి ముచ్చటైన చీరలు కట్టుకొని పౌష్యలక్ష్మీకళతో విరాజిల్లుతారు.

ఆడపిల్లలంతా రంగురంగులముగ్గులు ఇంటిముందు అలంకరిస్తారు. రంగులమధ్య ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను ఉంచుతారు. వీటి పైన గుమ్మడి, బంతిపూలను అలంకరిస్తారు. వీటి చుట్టూ కన్నెపిల్లలు వలయాకారంలో తిరుగుతూ గొబ్బిపాటలు పాడుతారు. ఇది నేలతల్లిని ఆరాధించడమే. ఇక మగపిల్లలు గాలి పటాలు ఎగురవేసి ఆనందిస్తారు.

తెల్లవారకముందే మంచుతెరల మధ్య భోగిమంటల కోలాహలం మొదలవుతుంది. పాతకు స్వస్తి చెప్పి, కొత్తదనానికి స్వాగతం పలుకుతూ భోగిమంటల్లో– పాతబట్టలు, పాత చేటలు, చీపురులువంటి వస్తువులను వేసి పీడలను, అరిష్టాలను తొలగించు కుంటారు. మనుషుల్లో పేరుకున్న మాలిన్యాన్ని తొలగించుకోవాలన్న సందేశం ఇందులో ఇమిడి ఉంది.

సాయంత్రంవేళ ఐదేళ్లలోపు పిల్లలకు భోగిపళ్లు పోస్తారు. వీటిలో రేగుపళ్లు, మరమరాలు, గుల్లశనగ పప్పు, చిల్లరబిళ్లలు కలిపి– పిల్లలకు దిష్టితీసి వారిశిరస్సుపై బ్రహ్మరంధ్రం నుంచి క్రిందికి జారేలా పోస్తారు. దీనివల్ల పిల్లలకు బుద్ధిబలం,







సంస్కారం ఏర్పడుతాయి. అంతేకాక బాలారిష్టాలు కూడా తొలగుతాయి. ముత్తైదువులకు తాంబూలం ఇవ్వడం గౌరీదేవతను పూజించడమే.

సంక్రాంతిపర్వంలో భాగమైన కనుమ ప్రత్యేకంగా పశువులపండుగ. వ్యవసాయానికి మనతో పాటు శ్రమించిన వృషభాలను, పాడిపరిశ్రమకు ఆధారమైన గోమాతలను పసుపుకుంకుమలతో అలంకరించి పూజించడం నందీశ్వరుని, కామధేనువును పూజించడమే. పొంగళ్లుచేసి పొలాల్లో చల్లుతారు, ఇది భూమాతను శాంతింపజేయడం వంటిది.

మనది వ్యవసాయదేశం కాబట్టి పంటలు వచ్చే తరుణమే పండుగలబుతువు అవుతుంది. కొత్త ధాన్యాలు వస్తాయి. కొత్తబియ్యంతో పొంగళ్లుపెట్టి దేవుళ్లకు నివేదిస్తారు. కొత్తబియ్యం, కొత్తబెల్లం, నువ్వులు వచ్చేకాలం. వాటితో అరిశెలువండి పరమాత్మకు నివేదించడం ప్రకృతిమాతను పూజించడమే. సంక్రాంతి వేళ మిగిలిన దానధర్మాలలో కూష్మాండ (గుమ్మడి) దానం, గారెలు (మినపవడలు) తప్పక నివేదన చెయ్యాలి. ఇందువల్ల పితృదేవతలు తరిస్తారు.

హరిదాసులు హరినామసంకీర్తనలతో సంక్రాంతిపండుగ నెలఅంతా పల్లెల్లో సంచరిస్తారు. అంబపలుకు! జగదంబాపలుకు!! అంటూ డక్కా వాయిస్తూ, శుభం పలుకుతూ బుడబుడక్కలవాళ్లు ప్రతిఇంటి ముంగిళ్లలో సందడి చేస్తారు. గంగిరెద్దులవాళ్లు రకరకాల పట్టెడలతో, చిరుగంటలతో అలంకరించిన గంగిరెద్దులను వెంట తీసుకువస్తారు. “డూడూబసవన్నా” అంటూ ముగ్గులపై గంగిరెద్దులను ఆడిస్తారు. జంగందేవరలు “శంభో మహాదేవ శివశంకరా” అంటూ పెద్దగంట వాయిస్తూ- తలపై కిరీటం, చిక్కనివిబూది, పట్టెలు, మెడలో పెద్దశంఖం ధరించి వస్తారు. విప్ర వినోదులు(విదూషులు) వాకిట్లో తిష్ఠవేసి చిన్నచిన్నతమాషాలు చేస్తారు. కనికట్టు, గారడీవిద్యలు ప్రదర్శించి పల్లీయులను రంజింపచేస్తారు. కానుకలు అందుకుంటారు. మాసాబత్తినివాళ్లు, నూనెగుడ్డలవాళ్లు, కాటికాపర్లు ఈ సంక్రాంతి యాచకులలో కీలకమైనవారు.

ఇక కొమ్మదాసర్లు ఊరుమధ్యలో ఒక ఎత్తైన చెట్టుమీద కూచుని భిక్షకోసం చెట్టుమొదట కొత్తగుడ్డను పరుస్తారు. పగటివేషగాళ్లు రకరకాల దేవుళ్లవేషాలలో భిక్షకు వస్తారు. తత్త్వాలుపాడే బైరాగులు, గోసాయిలు, దీవెనలపకీర్లు ఈ పండుగనెలంతా దర్శనమిస్తారు. లేనిపోని గొప్పలు చెప్పుకుంటూ, హాస్యధోరణిలో మాట్లాడుతూ పిట్టలదొరలు మంచివినోదాన్ని అందిస్తారు. కొత్తధాన్యాలకి, బియ్యాలకి పరటా (వస్తుమార్పిడి) వ్యాపారం చేసేందుకు చేతివృత్తులవారు వస్తారు. పూసలు, గొట్టాలు, ఈతచాపలు, తాటాకుబుట్టలు చెంచులు బేరానికి తెస్తారు.

కాలం యాంత్రికంగా మారింది. సెల్‌ఫోన్లు, లాప్‌టాప్‌లు సమాజాన్ని చాలా ప్రభావితం చేస్తున్నాయి. ప్రజలు వాటిమాయలోపడి ఇలాంటి ఎన్నోవేడుకలకు దూరమవుతున్నారు. మళ్లీ మన పల్లీయప్రకృతిలో పూర్వవైభవం రావాలి. రెండుకళ్లూ చాలని ఆనాటి సదాచారాలు, వేడుకలు వెల్లివిరియాలి.

ఆనాటి కళలు, సందడులు, సంబరాలు కేవలం తీపి జ్ఞాపకాలుగానే మిగిలిపోకూడదని కోరుకుంటున్నాను.



**ప్ర) ద్వాదశాదిత్యులు ఎవరు? వారి పేర్లేమి?**

**జ)** అదితికశ్యపుల సంతానమే ద్వాదశాదిత్యులు. వీరు ఒక్కొక్కరూ ఒక్కొక్క మాసానికి అధిపతులు. వీరు ధాత, ఆర్యముడు, మిత్రుడు, వరుణుడు, ఇంద్రుడు, వివస్వంతుడు, అంశుమంతుడు, త్వష్ట, విష్ణువు, భాగుడు, పూషుడు, క్రతువు అను వారు పన్నెండుగురు ద్వాదశాదిత్యులు. వీరిగురించి మహాభారతం ఆదిపర్వంలో, భాగవతంలో చెప్పబడింది.

**ప్ర) సప్తమోక్షపురి అని వేనిని అంటారు?**

**జ)** అయోధ్య, మధుర, మాయ, కాశీ, కాంచి, అవంతిక (ఉజ్జయిని), ద్వారక అను ఈ సప్తపురములు పవిత్రనగరాలుగా పేర్కొంటారు. వీటిని దర్శించిన మానవునికి మోక్షం కలుగుతుందని చెప్పబడింది.

**ప్ర) పురాణములెన్ని? వాటిని వ్రాసిన వారెవరు?**

**జ)** పురాణములు 18. అవి మత్స్య, మార్కండేయ, భాగవత, భవిష్య, బ్రహ్మ, బ్రహ్మవైవర్త, బ్రహ్మాండ, విష్ణు, వరాహ, వామన, వాయు, అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాందపురాణం అనే ఈ అష్టాదశపురాణాలను వ్యాసమహర్షి రచించాడు.

**ప్ర) తిరుమలలో పూలు ఎందుకు ధరించరు?**

**జ)** తిరుమలకు పుష్పమండపం అని పేరు. తిరుమల ఉద్యానవనంలో పూచిన పువ్వులను స్వామికి వినియోగించాలేకానీ మనం తలలో ధరించరాదు. పూర్వం స్వామివారికి అలంకరించిన నిర్మాల్యాన్ని భక్తులకు ప్రసాదంగా ఇచ్చేవారు. ఒకసారి

# సందేహాలు



# సమాధానాలు

*– శ్రీమతి యం.గీతాకుమారి*

శ్రీశైలపూర్ణుని శిష్యుడు ఒకరు స్వామికి అలంకరించకుండా ఆ పుష్పాలతో తాన లంకరించుకొని ఆనందించాడట. ఆ రాత్రి స్వామి శ్రీశైలపూర్ణుల కలలో కనబడి మీ శిష్యుడు పరిమళద్రోహం చేశాడు అని చెప్పాడట. నాటినుండి స్వామి నిర్మాల్యాన్ని కూడా భక్తులకు ఇవ్వకుండా పూలబావిలో వేయడం ప్రారంభమైంది. ఐనా కొందరు స్వామి నిర్మాల్యాన్ని కూడా ధరించేవారట. అందువల్ల ఆ తరువాత తిరుమలగిరిపై పుష్పాలను ధరించరాదని కట్టడిచేయటం జరిగింది. కొన్ని శతాబ్దాలకాలం ఆ నియమం కఠినంగా అమలుపరచబడింది. కానీ ఈ మధ్యకాలంలో ఈ నియమం ఉల్లంఘించటం మొదలైంది. తిరుమల గిరిపై స్వామికి అలంకరణ చేయకుండా మనం అలంకరణ చేసుకోకపోవడమే ఉత్తమం. అందువల్ల తిరుమలలో పూలను అలంకరించుకోవడం నిషేధం.

**ప్ర) శల్యసారధ్యమనే పేరెలా వచ్చింది?**

**జ)** మహాభారతంలో శల్యునిగురించి ఉంది. పాండురాజుభార్య మాద్రి సోదరుడే ఈ శల్యుడు. ఇతడు నకులసహదేవులకు మేనమామ. కురుక్షేత్రసంగ్రామ ప్రారంభసమయంలో పాండవులకు సహాయం చేయదలచి మద్రదేశంనుంచి బయలుదేరాడు. కానీ మార్గమధ్యంలో ఎదురైన సత్కారాలకు, మర్యాదలకు మురిసి మెచ్చుకొని ఎవరింతటిమర్యాదలు చేశారని అడిగాడు. అప్పుడు సుయోధనుడు రాబోవు కురుక్షేత్రయుద్ధంలో తమకు సహాయం చేయాల్సిందిగా కోరాడు. చేసేది లేక శల్యుడు అంగీకరించాడు. కానీ ఒక సారి పాండవులను చూసొస్తానని వెళ్లాడు. విషయం తెలుసుకున్న పాండవులు తమకు కావలసినప్పుడు సహాయం చేయమని అడిగారు. ఆ తర్వాత జరిగిన యుద్ధంలో వీరులైన వారందరు మరణించగా కర్ణుడు సైన్యాధిపత్యం వహించాడు. **కర్ణుడు** అర్జునునితో పోరుసమయంలో ఆతని రథానికి సారథ్యం చేయాల్సిందిగా కోరాడు సుయోధనుడు. ఉత్తమక్షత్రియుడనైన నేను ఒక సూతుడిరథానికి సారథ్యం చేయనన్నాడు. కానీ, కృష్ణునితో సమానంగా సారథ్యం చెయ్యలేవు కాబట్టే నిన్ను కోరాను అనగా నేను నాకు తోచినట్టుగా మాట్లాడుతూంటానన్నాడు. తర్వాత పాండవులు శల్యునివద్దకేగి కర్ణుణ్ణి బలహీనపడేట్లుగా చెయ్యమని కోరారు. కర్ణుడు రథం అధిరోహించింది మొదలు శల్యుడు అర్జునుని బలాన్ని, పాండవులధర్మాన్ని, కౌరవుల దురాగతాలగురించే చెప్తూ కర్ణుణ్ణి బలహీనపరిచాడు. శల్యునిమాటలతో కర్ణుని అంతరంగం చిన్నబోయింది. అందుకే ఎవరైనా ఒక పనిని చేసేటప్పుడు వారినికాని, ఆ పనినికాని బలహీనపరిచే విధంగా మాట్లాడేవానిని శల్యుడని, వాడు చేసేపనిని శల్యసారథ్యం అనటం పరిపాటి అయింది.

# పౌష్యలక్ష్మి

- శ్రీమతి పి.రమాదేవి

భారతీయసంస్కృతికి, తత్త్వవైజ్ఞానికప్రగతికి ప్రతీకలు మన హిందువుల పండుగలు. అట్టి పండుగలలో ప్రశస్తిగాంచిన పర్వం సంక్రాంతిపర్వం. హేమంతంలో పౌష్యలక్ష్మి అందచందాలలావణ్యంతో విలసిల్లి వినూత్నకాంతులతో ఇంటింటిని అలరింప చేసేదే సంక్రాంతిలక్ష్మిసోయగం. ఈ సంక్రాంతిశోభే పుష్యమాసపువిందని నేటికిని జానపదులలో వ్యవహారికంగా కొనసాగుతూంది. పల్లీయుల సొంతమైన ఈ పండుగను 'పంటలపండగని'; 'రైతులపండగని' ఇప్పటికినీ పిలుస్తారు.

ఆంధ్రజగతికి పెద్దపండుగ సంక్రాంతి. ఇదొక జీవనకాంతి. మన భారతజీవనశైలిలో పండుగ అంటే అదొక సంబరం. మానవత్వం పరిమళింపచేసే ఉత్సవం. అంతేకాక సమాజశ్రేయస్సును కోరేది, మనుష్యుల్ని కలిపేది ఈ సంక్రాంతిపర్వమే!

అందుకేనేమో శ్రీనాథమహాకవి 'పెనుబండువు'గా వర్ణిస్తూ సంక్రాంతివైశిష్ట్యాన్ని చెప్తూ కాశీఖండంలో వివరించాడు. ఋగ్వేదసంహిత ఈ పండుగను 'స్వర్ణసంక్రాంతి'గా వివరిస్తూ 3వభాగం 90సూక్తంలో చెప్పబడింది. జనజీవనంతోనూ, ప్రకృతితోనూ, వ్యవసాయకార్యకలాపాలతోను ముడిపడిఉన్న పండుగే సంక్రాంతి. మూడు రోజులపాటు అత్యంతవేడుకగా ఈ పండుగను జరుపుకోవడానికి పంటలుపూర్తై శ్రమఫలించి ధాన్యం ఇండ్లకు చేరడమే ప్రధానకారణం. విశ్వవ్యాప్తమైన నవ్యకాంతులసంక్రాంతికి మాత్రమే అధికప్రాధాన్యం ఇస్తూ 'సంక్రాంతి' పండుగను జరుపుకోవడం అనాదినుంచి వస్తున్న సంప్రదాయం.

## సంక్రాంతి ఆగమనానికి సంకేతాలు

ఏఏటికాయేడు సంక్రాంతిపర్వదినం అంటే అంతా క్రొత్తదనమే. కాలచక్రభ్రమణంలో మకరసంక్రమణం సుఖశాంతులకు ఆలవాలం. శుభప్రదం. అమృతోపమానం. ద్వారాలకు వేలాడే తోరణాలశోభలు- ప్రతిఇంటిముంగిట రత్నాలముగ్గుల్లో మెరిసే గొబ్బిళ్ళసముదాయాలు, బసవన్నల వినోదవల్లరులు- బుడబుక్కలు, బుడుగేజంగాళ్లు సంక్రాంతికి ఆశీర్వచనాలందించే ఉత్సవమూర్తులసందళ్ళు, ఎడ్ల, బళ్లపందాలు, పశువులఅలంకరణలు, హరిదాసుల సంకీర్తనలు మొదలైనవాటితో పల్లెపట్టులు, ఆకాశంలో గుంపులుగుంపులుగా ఎగిరే గాలిపటాలపందాలతో పట్టణాలు శోభాయమానంగా ఉండి, యువతరంలో ఉత్సాహం, ఆనందపరవళ్ళు త్రొక్కేలా చేస్తాయి. దక్షిణభారతదేశమంతటా ముచ్చటగా మూడురోజుల పాటు జరుపుకునే ఈ పండుగ సంరంభం అంతాఇంతా కాదు. ప్రధానంగా పంటలపండుగ కావడంతో గ్రామసీమలు ఆనందోత్సాహాలతో పండుగవాతావరణంతో కళకళలాడుతుంటాయి. ధాన్యలక్ష్మిని తరలిస్తున్న బండ్లవరుసల గణగణమనే చిరుగంటలతో పరుగులుతీసే గిత్తలఅందాల్ని తనివితీరా చూడాల్సిందే! ఆ మధుర దృశ్యాలతో సంక్రాంతిలక్ష్మికి స్వాగతం పల్కుతాయి పల్లెసీమలు.



నిత్యజీవనవిధానంలో ఎన్నో బాధలు, ఆటుపోట్లు ఉన్నా వాటిని ఎదుర్కొంటూ, జీవనాన్ని ఎంతో సమర్థవంతంగా చేసుకుంటూ కుటుంబ సభ్యులతో జరుపుకునే ఈ పండుగ తెలుగింటి తీపివేడుకలౌతాయి. ఇది తెలుగువారికిమాత్రమే దక్కిన అందాలకానుక. అలాగే వెల్లివిరిసిన ఈ సంక్రాంతి పౌష్యలక్ష్మి ఆగమనానికి సంకేతమై సందీపించుతాయి.

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



## గత సంచిక విశేషార్థం..

మునివర్యులారా! వెంకటాద్రి ద్వాపర యుగంనాటికే ప్రసిద్ధం. కురుక్షేత్ర సంగ్రామం నిశ్చితమైనవేళ బలరాముడు ఏ పక్షం వహించక తీర్థయాత్రకు బయలు దేరాడు. ఎన్నో పుణ్యక్షేత్రాలను దర్శించి తిరుమలలో వేంకటాద్రి శిఖరదర్శనం చేసి సకలతీర్థయాత్రాఫలం దక్కిందని మురిసిపోయాడని నేనూ విన్నాను. అంతే కాదు సుమా! పాండవులు జూదంలో ఓడి అరణ్యవాసానికి సిద్ధమైనప్పుడు శ్రీకృష్ణుడు వారితో–

'పాండురాజపుత్రులారా! మీరు బలం లేనివారు కారు. ప్రబలులు మీరు. కర్మ వశాన మీకు కానకావాసం అయినా అది కూడా మంచిదే. అరణ్య అజ్ఞాతవాసా నంతరం మీకే హస్తినాపురం.. ఇందులో సందేహం ఏమాత్రం లేదు. అరణ్యవాసం చేసే సమయంలో మీరు శ్రీవేంకటాద్రికి వెళ్లండి. అక్కడి పావనతీర్థాలలో స్నానం చేయండి. అక్కడ జపతపాదులు కొన సాగించండి. మీ పాపాలన్నీ నశిస్తాయి. మీరు ఆపై కౌరవులను అలవోకగా గెలవవచ్చు అని హితం చెప్పాడు.

శ్రీకృష్ణుని సలహామేరకు పాండవులు వేంకటాద్రి చేరారు. అక్కడే స్నాన పానాదులు కొనసాగిస్తూ సంవత్సరకాలం గడిపారు. వారి నిష్ఠకు వేంకటేశ్వరుడు సంతృప్తిపడుతూ ధర్మరాజు స్వప్నంలో సాక్షాత్కరించి 'ఓ మహారాజా! మీరు సునా యాసంగా విరోధులను సంహరిస్తారు. అంతేగాదు విస్తారమైన సామ్రాజ్యానికి అధిపుడవవుతావని వరమిచ్చాడు. ఈ స్వప్నవృత్తాంతాన్ని ధర్మరాజు తన సోదరు లకు, ద్రౌపదికి విశదంగా చెప్పి వేంక టాద్రి వదలి ఆపై మిగిలిన అరణ్యవాస కాలాన్ని, ఆపై అజ్ఞాతవాసాన్ని పూర్తిచేసి సమరంలో శత్రువులను హతమార్చి శ్రీకృష్ణ పరమాత్మునిపట్ల మనసును లగ్నంచేస్తూ కాలం గడపసాగాడు.

మునులారా! పాండవులు అరణ్యవాస కాలంలో వెంకటాద్రిలో తీర్థస్నానం చేయడంవల్ల ఆ తీర్థాలకు 'పాండవ తీర్థము' అని పేరొచ్చింది. ఆ తీర్థాలకున్న మాహాత్మ్యం ఆ క్షేత్రపాలకునికి ఎరుక.

వెంకటాద్రిలో పాండవతీర్థాదులే కాదు. మరికొన్ని తీర్థాదులుకూడా ఉన్నాయి. స్వామిపుష్కరిణిలోకి తూర్పున జరాహరం, వలిఘ్నం రసాయనమనే తీర్థాలున్నాయి. ఇవేకాదు అక్కడికి దగ్గర్లోనే వైకుంఠ పర్వతగుహకూడా ఉంది. అష్టలోహఖాత మనే లోయకూడా ఉంది. అయినా, ఇవన్నీ సామాన్యమానవులు దర్శించడానికి దుర్లభం. ఇందుకు ప్రధానకారణం స్వామి పుష్కరిణికి 22 బాణప్రయోగదూరం దాకా 'మాయతిరోహిత' శక్తి ఆవరించి ఉంది. బుధులుకూడా ఆ తీర్థాదుల వద్దకు సునాయాసంగా వెళ్లలేరు. అలాంటి వేంకటాచలంలో గ్రుడ్డివారు, మూగవారు, చెవిటివారు, సంతానప్రాప్తికి నోచుకోలేని వారు, ధనహీనులైనవారు శ్రద్ధతో 'హరి' ఒక్కడే సర్వస్వమని మనసారా నిశ్చయిం చిన విశ్వాసపాత్రులైనవారికి దైవగతమైన అన్ని ఇబ్బందులు తొలగిపోతాయి. అంతే కాదు వారికి సుఖప్రాప్తి. ఈ పర్వతానికి శాశ్వతమైనపేరంటూ ఏదీ లేదు. యుద్ధ భేదాలతో ఈ గిరిశిఖరాలకు ఎన్నో పేర్లు.

ఈ తిరుమలకొండ సామాన్యమైన ఒక శైలపర్వతం కాదు సుమా! తరిచిచూస్తే ఒకసారి శ్రీనివాసస్వరూపం. మరోసారి కనకాద్రి. ఇంకొకసారి జ్ఞానాద్రి. కొందరి కేమో సర్పరూపం. మరికొందరికి అలం కారశోభితం. కలియుగంవారికేమో కేవలం శైలాకృతి. ఈ కొండమహిమను వర్ణించడానికి నేను అశక్తుణ్ణి. ఆదిశేష డొక్కడే సమర్థుడని సూతుడు చెప్పగా శౌనకాదిమునులు....

'మహాత్మ! శ్రీవేంకటగిరి మహావిచిత్ర మహిమలను వినాలని ఉంది. చెప్ప మంటూ విన్నపం చేశారు.

అపుడా సూతుడు 'మీ జిజ్ఞాసను గుర్తించాను. జైమిని ఒకసారి నాతో ముచ్చటించిన రామచరితని చెబుతాను. వినండి.

శ్రీహరి త్రేతాయుగంలో దశరథునికుమారుడుగా జన్మించాడు. విశ్వామిత్రుని యాగసంరక్షణ చేశాడు. శివధను ర్భంగం చేశాడు. జానకిని చేబట్టాడు. జమదగ్నికుమారుని గర్వమణచినాడు. సాకేతపురం చేరాడు. ఆపై తండ్రిఆనతో అరణ్యవాసానికి కదిలాడు. ఆ అరణ్యవాససమయంలోనే జానకిని రావణుడు అపహరించాడు. ఆ కారణాన శ్రీరాముడు రావణసంహారానికి సంసిద్ధుడయ్యాడు. సుగ్రీవ, ఆంజనేయా దులతో కదలివెళుతూ వెంకటాద్రిపథంలో నడవసాగాడు.

ఈ దృశ్యాన్నంతా అంజనాదేవి చూచింది. బంగారు కొండనుండి దిగి శ్రీరాములవారికి ఎదురేగి నమస్కరించింది. ఆవిడకు శ్రీరాముడు సామాన్యమానవుడు కాదని, స్థితికారకుడైన విష్ణువే రాముడై అవతరించాడని తెలుసు. ఆ కారణాన అంజనాద్రిని

'రామ! సుకీర్తికామ! బహురాక్షసయూధవిరామ' సద్గుణ స్తోమ! దినేంద్రవంశ ఘనతోయధి సోమః దశాస్య భీమ జగదీశ్వర'

అని స్తుతించింది. ఆపై..

స్వామి నేను ఈ వేంకటాద్రిలోనే వసిస్తున్నా. నాపట్ల కరుణతో వేంకటాద్రికి విచ్చేయండి అని చేతులు జోడించింది. అప్పుడు శ్రీరాముడు–

'అమ్మా' నా ప్రయాణం ఇక్కడితో ముగిసేది కాదు. చాల దూరప్రదేశానికి వెళ్ళాలి. నా పని పూర్తి అయ్యాక తప్పక వస్తానని నమ్మబలికాడు. అయినా అంజనాదేవి పుత్రుడు స్వామి! నా తల్లి కోరికను తీర్చవలసిందిగా నేను కోరుతున్నా. అంతేగాక మిమ్మల్ని అనుసరించి వస్తున్న కపివీరులు నిరంతర ప్రయాణంతో బాగా అలసిపోయారు. ఆ కారణంగా నా విన్నపమాలించి శ్రీవేంకటాద్రికి వెళ్లడం సబబు అన్నాడు. ఆపై 'స్వామీ! మా తల్లి ఆశ్రమం రమణీయం. కమనీయం కూడా. అక్కడ రకరకాల పళ్ళతోడి చెట్లున్నాయి. కందమూలఫలాలు న్నాయి. అంతేకాదు స్నానప్రసాదాలకు అనువైన తీర్థాలున్నాయి. అంజనాద్రి మనమున్న ప్రదేశానికి మరీ దూరం కాదు. స్వామీ! మనం చేరుకోవలసిన ప్రదేశానికి వచ్చే దారికూడా ఇదే. నా తల్లికోరికను తీర్చండి' అని అంజలిబద్ధుడై నిలిచాడు.

శ్రీరాముడు అంజనను, అంజనాతనయుని, దస్సిన కపివీరులను కలయచూచాడు. అయినా, తన సోదరుడైన లక్ష్మణునితో సౌమిత్రీ! హనుమంతుని విన్నపం నీవు విన్నావు కదా! నీ అభిప్రాయమేమిటి అని కడగంటి చూస్తే లక్ష్మణుడు వెనువెంటనే దేవ! మనం వేంకటాద్రికి వెళ్లవచ్చని అన్నాడు. ఆపై శ్రీరాముడు హనుమను చూచి–

'మారుతీ' నీ మనవి విన్నాను. నీ కోరిక సమంజసమే. నాకూ ఇష్టమే. అయినా అంజనాద్రిమార్గం నీకే తెలుసుగా. ఆ దారిలోనే మమ్ములను నడిపించుమన్నాడు.

అలాగే కపివీరులు, సీతాలక్ష్మణులు అంజనాద్రిమార్గం పట్టారు. వానరసైన్యం ఉత్సాహంతో కదులుతుండగా దూరాన మునిగణాన్ని చూచారు.

వేంకటాద్రిమార్గానఉన్న మునులు తమకేసి వస్తున్న శ్రీరాముని దూరాన చూచి స్వామికి ఎదురేగి...

రామనృపాల! ఘోరతర రావణ శౌర్య విఫాల! భవ్య సు త్రామ! సురార్య యోగి జన తామస పాల! కృపాలతాల! శ్రీ భూమిసుతాత్మలోల! పరిపూర్ణ సుకీర్తి శీల!

అంటూ స్తుతించారు.

'స్వామీ! మా జన్మ చరితార్థమైంది. మేము ఈ వేంక టాద్రిలోనే తపస్సు కొనసాగించే తాపసులం. మా తపోనిష్ఠకు

## వైకుంఠపాళి

### :: 96 – సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ఉ | త్త | 2 రా | య | ణ | 3 పు | ణ్య | 4 కా | ల | 5 ము | |
| | | మా | | | త్ర | | ల | | క్క | |
| 6 వి | ష | య | | 7 మ | ద | 8 ని | | 9 క | ను | ము |
| శ్వా | | ణ | | క | | ధి | | | ము | |
| 10 వ | న | ము | | ర | | | | | | 11 భో |
| సు | | | | 12 సం | క్ర | 13 మ | ణం | | 14 ఆం | గి |
| వు | | 15 రొ | | క్రాం | | తి | | 16 పొం | | |
| | 17 మ | ద | యం | తి | | | | గ | | 18 గం |
| 19 బం | | | | | 20 భో | గి | 21 ప | ళ్ళు | | గె |
| 22 తు | ల | 23 సి | | 24 వా | | | డ | | | ద్దు |
| లు | | 25 రి | పు | డు | | 26 రం | గ | వ | ల్లు | లు |

బ్రహ్మమెచ్చాడు. అంతేకాదు. శ్రీరాములవారు ఈ గిరికి రాగలడు. ఆ స్వామిని దర్శించాక మీరు సత్యలోకానికి చేరగలరన్నాడు. ఆ వాగ్దానంతో ఇక్కడే మేమున్నాం. మా నిరీక్షణ ఫలించింది. తమరు సెలవిస్తే సత్యలోకానికి వెళ్తామన్నారు.

శ్రీరాముడు తాపసులతో "మునులారా! నా కోసం మీరెంతోకాలంనుండి నిరీక్షిస్తున్నారు. అంతేకాదు నేనుకూడా మీలాంటి తాపసులదర్శనంతో సంతృప్తుణ్ణి అయ్యాను. మీరు సముత్సాహంతో సత్యలోకానికి వెళ్లండి" అని వారికి అనుమతి ప్రసాదించాడు. వారు సత్యలోకానికి వెళ్లారని సూతుడు చెప్పగా మునులు, పురాణకోవిదా! ఆ తర్వాత కపివీరులతో శ్రీరాములవారు ఆ కొండమీద ఎలా గడిపాడో తెలియచేయండి అని కుతూహలంతో అడిగారు.

శ్రీరాములవారు పర్వతం ఉత్తరభాగాన నడుస్తూ అంజనాశ్రమం చేరుకొన్నారు. అక్కడి ఆకాశగంగలో తీర్థస్నానం చేశారు. సంధ్యాదివిధులను పూర్తిచేశారు.

అప్పటికే అందిన ఫలపుష్పాదులతో శ్రీరామునిసన్నిధి చేరి ఆతిథ్యం సమకూర్చింది. ఆపై శ్రీరాముడు అంజనాదేవి నుండి శెలవు తీసుకొని స్వామిపుష్కరిణిప్రాంతం చేరుకొన్నారు. పవిత్రపుష్కరిణిలో స్నానం చేశాడు. అక్కడ మునులకు శ్రీరాముడు ఫలదానం చేశాడు. ఆ పై పుష్కరిణికి నైరృతిభాగంలో కపులు అప్పటికప్పుడు నిర్మించిన పర్ణశాలలో విశ్రాంతి తీసుకొంటుండగా ఆంజనేయస్వామి మధురఫల కందమూలాదులను సమర్పిస్తే శ్రీరామచంద్రులవారు తాము అయోధ్యపురంలో ఉన్నట్టే భావించారు.

ఆ పై హనుమంతుడు కపివరులను చూచి 'సహచరులారా! ఈ పర్వతంలో లేని పళ్ళు లేవు. పనస, మామిడి, ద్రాక్ష, బదలిక, అరటిపండ్లు అన్నీ ఉన్నాయి. మీకు ఎదురుచెప్పేవారు ఎవరూ లేరు. ఆకలితీర, రుచితీరా యధేచ్ఛగా తిరుగుతూ ఆరగించండి' అనడంతో కపివరులు వాటికోసం ఎగబడ్డారు. వారి ఆటలకు, కేరింతలకు, ఉత్సాహానికి హద్దులేకపోయింది.

కపివీరులు ముందుగా తేనెపెరలను చించారు. ప్రోవులు కట్టారు. మాకింత మాకింతని పంచుకొన్నారు. తేనెను చప్పరిస్తూ పక్కనవారిని తోస్తూ, ముక్కులు చిట్లిస్తూ, తలలు గోక్కుంటూ ఒకరితోకను మరొకరు కరుస్తూ, ఒకరిచెవులను మరొకరు చప్పరిస్తూ, పండ్లుగీటుతూ, కనులెర్రచేస్తూ, కికురింతలతో ఒక కొండనుండి మరొకకొండకు ఎగురుతూ పర్వతాకారులైన కపులు నిజజాతికులచేష్టలు చేయసాగారు.

తదనంతరం తేనె తాగిన మత్తులో కపులు ఎన్నో కొండల్ని చూచాం. ఈ కొండ అత్యద్భుతం. ఈ కొండమహిమ అనంతం. శ్రీరాములవారికృపతో ఇక్కడికి రాగలిగాం. మనం తప్పక రాములవారిఋణం తీర్చుకోవాలి అని చెబుతుంటే ఒక కపివరుడు – అవును నిజమే. నేను శ్రీరాములవారికి అపకారం చేసిన రావణుని నా వాలంతో చుట్టి పడేసి విడిపించుకోవాలని ప్రయత్నించినా అణగదొక్కి రామునిముందు పడవేస్తానన్నాడు.

'నేనేం తక్కువవాణ్ణా' సముద్రతీరంలోని లంకాపురాన్నే తెస్తానన్నాడు. సాటి కపులు సై సై అన్నారు.

'పదితలలవాడు పాతాళంలో దాగినా వెదకి కట్టి పడవేసి ఈడ్చి తెస్తామన్నారు' ఇంకా కొందరు.

'ఆకాశంలోని సూర్యచంద్రులను పట్టి తేగల సమర్థులమని వీరోచితంగా ప్రగల్భాలు పలికారు కొందరు. ఇలా పరస్పరం మాటలాడుకొంటూ స్వామిపుష్కరిణికి ఈశాన్యభాగంలోని ఒక గుహను చూచి ఆ గుహలో చొరబడ్డారని' సూతుడు ముగించాడు.

*(ఇంకా ఉంది)*

**51వ పేజీలోని.. 'తేడాలు గుర్తించండి' కి జవాబులు**





# సంక్రాంతి

- డా॥ యస్.పద్మావతి, 96762 69300

సంక్రాంతి అంటే చెందడం, చేరడం, ప్రవేశించడం అని అర్థాలున్నాయి. ఇక్కడ సంక్రాంతి అనేది సూర్యగమనానికి సూర్యుడు రాశులలో ప్రవేశించడానికి సంబంధించిన విషయం. సూర్యమండలంలో నవగ్రహాలు, నక్షత్రమండలాలు ఉన్నట్లే పన్నెండు రాశులుకూడా ఉన్నాయి. ఇవే మేషం మొదలు మీనంవరకు ఉన్న రాశులు. కాలమానంలో మనకు పన్నెండుమాసాలున్నాయి. గ్రహాలకు, రాశులకు, నక్షత్రాలకు, ఋతువులకు అధిదేవతయైన సూర్యుడు ఒక్కొక్కమాసంలో ఒక్కొక్కరాశిలో ప్రవేశించి ఉంటాడు. ఇలా సూర్యుడు ఏ రాశిలోకి సంక్రమిస్తే (ప్రవేశిస్తే) ఆ రాశిపేరుతో సంక్రమణం/ సంక్రాంతి అంటారు. ఇలా సంవత్సరంలో పన్నెండుసంక్రాంతులు ఉంటాయన్నమాట. ఈ క్రమంలో సూర్యుడు మకరరాశిలో ప్రవేశించడాన్ని మకరసంక్రమణం/ మకరసంక్రాంతి అంటాం. అదే మకరసంక్రాంతి పండుగ.

**15-01-2024న**
**మకరసంక్రాంతి పండుగ**
**సందర్భంగా..**

సూర్యునియొక్క ఈ రాశులగమనాల వల్ల సంవత్సరంలో రెండుఅయనాలు ఏర్పడ్డాయి. అవే ఉత్తరాయణం, దక్షిణాయనం. సూర్యుడు ఉదయించేది తూర్పుదిక్కునే. అయినా సంవత్సరంపొడుగునా ప్రతిరోజూ ముక్కుసూటి తూర్పునే కనిపించడు. కొన్నాళ్లు (ఆరునెలలు) నేరుతూర్పునుండి కొంచెం కొంచెం ఉత్తరంవైపుగా జరిగినట్లు కనిపిస్తాడు. సూర్యుడలా ఉత్తరంవైపుగా జరిగినట్లు కనిపించే కాలం ఉత్తరాయణం. అలాగే సూర్యుడు నేరుతూర్పు నుంచి కొంచెం కొంచెం దక్షిణం వైపుగా జరిగినట్లు కనిపించే కాలం దక్షిణాయనం.

ఈ రెండుఅయనాల పూర్తికాలం (ఒకసంవత్సరం) దేవతలకు ఒకరోజు. ఇందులో దక్షిణాయనం దేవతలకు ఒకరాత్రి, ఉత్తరాయణం దేవతలు నిదురించేసమయం, ఉత్తరాయణం దేవతలు మేల్కొనే సమయమన్నమాట. అందువల్ల ఉత్తరాయణకాలం మనం చేసే పూజలు, ప్రార్థనలు, యజ్ఞయాగాదులు, విన్నపాలు దేవతలు ఆలకించి అనుగ్రహించడానికి అనువైన కాలమన్నమాట. అందుకే ఉత్తరాయణం పుణ్యకాలంగా చెప్పబడింది. అట్లని దక్షిణాయనకాలంలో దేవతలు మన పూజలు, ప్రార్థనలు ఆలకించరని కాదు. వారు ఎప్పుడూ మన ప్రార్థనలు ఆలకిస్తూనే ఉంటారు. అనుగ్రహిస్తూనే ఉంటారు. ఉత్తరాయణకాలం మరి కాస్త విశేషమైనదన్నమాట. శారీరకపరిశ్రమకు, పూజలకు, సాధనలకు అనువైనది ఉత్తరాయణ పుణ్యకాలం. అట్టి పుణ్య ప్రదమైన ఉత్తరాయణం మకరసంక్రమణంతో మొదలవుతుంది కాబట్టి మకరసంక్రమణానికి/ మకరసంక్రాంతికి అంత గొప్ప ప్రాధాన్యత కలిగింది. ఈ మకరసంక్రమణాన్ని అంత విశేషపర్వంగా జరుపుకోవడం ఆనవాయితీ అయ్యింది. మిగతాపండుగలన్నీ చాంద్రమానానుసారం తిథులననుసరించి వస్తాయి. సంక్రాంతి మాత్రం ఇలా సూర్యగమనానుసారం వస్తుంది.

ఇంతటి ప్రాముఖ్యతగల ఈ సంక్రాంతిపండుగ భోగి, మకరసంక్రాంతి, కనుమ అను మూడుపేర్లతో మూడురోజుల పాటు ఆచరించబడుతుంది. ఈ మూడుపండుగలూ కలిపి ఒకటేగా చెప్పబడినా వీటిలో ఒక్కొక్కటి ఒక్కొక్క ప్రత్యేక విశిష్టతను కలిగి ఉన్నాయి.

## భోగి

సంక్రాంతిపండుగపేరుతో మూడు రోజుల పాటు ఆచరించేవాటిలో మొదటిది భోగి పండుగ. భోగాలను, చెడును, పాపాలను

దగ్ధంచేసి, తర్వాత మకరసంక్రాంతిరోజు చేయబోయే దైవా రాధనలకు, పితృదేవతలారాధనకు త్రికరణశుద్ధిగా మనల్ని పవిత్రులుగా చేసేదే భోగిపండుగ. భోగిరోజున భోగిమంటలు వేయడంలోనూ, పాతబడి వ్యర్థంగా ఉన్న చెక్కవస్తువులు, పాత చీపుర్లు మొదలైనవాటిని ఆ భోగిమంటల్లో వేసి కాల్చేయడంలో ఉద్దేశం అదే!

సూర్యునియొక్క దక్షిణాయనగమనం భోగిరోజుతో పూర్తవుతుంది. కాబట్టి దక్షిణాయనానికి వీడ్కోలు చెబుతూ చెడును, చెడుఆలోచనలను దగ్ధం చేయడమే భోగిమంటల్లోని అంతరార్థం.

## మకరసంక్రాంతి

మూడురోజులసంక్రాంతివేడుకల్లో రెండవది, ప్రముఖ మైనది సంక్రాంతి. సంక్రాంతి అంటే నూతనక్రాంతి అని అర్థం. మకరసంక్రాంతి ప్రధానంగా సూర్యారాధనకై ఉద్దేశించబడింది. ఈ రోజు అందరూ పాలు పొంగించి దానితో తీపినైవేద్యాలు చేస్తారు. వివిధరకాల పిండివంటలు చేస్తారు. మకరసంక్రాంతి రోజు పితృదేవతలకు తర్పణాలు ఇస్తారు. నిజానికి ప్రతినెల లోనూ ఒక సంక్రాంతి ఉంటుంది. కాబట్టి ప్రతిసంక్రాంతిరోజు ఈ తర్పణాలు ఇవ్వాలి. మిగతా పదకొండుసంక్రాంతుల్లో ఇవ్వకున్నా మకరసంక్రాంతిరోజు తప్పకుండా ఇస్తారు.

## కనుమ

సంక్రాంతివేడుకల్లో మూడవరోజున జరుపుకునేది కనుమపండుగ. ఇది ప్రత్యేకించి పశువులకోసమై నిర్దేశించ



బడింది. మనది ప్రధానంగా వ్యవసాయకదేశం. వ్యవసా యానికి ఆధారం పశువులు. సంవత్సరంపొడవునా వ్యవ సాయంలో తమకు తోడుండి సహకరించిన పశువులకు ఇష్టమైన మేతలు పెట్టి, వాటిని అందంగా అలంకరించి ఉత్సాహపరు స్తారు. పాలిచ్చే గోమాతలనుకూడా అలాగే అలంకరించి హారతు లిచ్చి పూజిస్తారు. ఎద్దులపందేలు, ఎద్దులబండ్లపందేలు జరిపి ఎద్దులను ఉత్సాహపరుస్తూ జనులు ఆనందిస్తారు. ఇలా కనుమ పండుగ ముగుస్తుంది.

## సంక్రాంతివేడుకలు

సంక్రాంతివేడుకల్లో ముగ్గులు, గొబ్బెమ్మలకొలువు, గొబ్బికోలాటం, ఎద్దులపందేలు, గంగిరెద్దులాట మొదలైనవి ప్రధానంగా చెప్పుకోవచ్చు.

సంక్రాంతినెల ప్రారంభమైనరోజునుంచి ఆ నెలంతా ఇంటిముంగిళ్లలో అందమైనముగ్గులు చిత్రించి ముగ్గులమధ్య గోమయంతో చేసిన గొబ్బెమ్మలను కొలువుదీర్చి పువ్వులతో అందంగా అలంకరిస్తారు.

సంక్రాంతివేడుకల్లో గొబ్బికూడా చాలా ప్రధానమైనది. మహిళలు, బాలికలు బృందంగా ఏర్పడి ఒకపళ్ళెంలో పసుపు గొబ్బెమ్మను కొలువుదీర్చి దాని చుట్టూ తిరుగుతూ గొబ్బిపాటలు పాడుతూ పాటలకనుగుణంగా చేతులుతడుతూ అడుగులు వేస్తారు. ఆ గొబ్బెమ్మను మంగళగౌరీదేవిగా భావించి పూజి స్తారు.

కొంతమంది కలసి బృందంగా ఏర్పడి కోలలు పట్టు కొని వర్తులాకారంగా నిలబడి కోలలు తడుతూ, పాటలు పాడుతూ పాటలకనుగుణంగా లయబద్ధంగా అడుగులు వేస్తూ అందులోనే ఎన్నోవిన్యాసాలు చేస్తారు.

గంగిరెద్దులవాళ్లు గంగిరెద్దులను అందంగా అలం కరించి వాటిని ఇంటింటికీ తిప్పుతూ వాటితో రకరకాల విన్యాసాలు చేయిస్తూ ఉంటారు.

ఈ విధమైన విశేషాలతో, నియమబద్ధమైన ఆచారా లతో, వేడుకతో, ఆనందోత్సాహాలతో ఆచరించబడుతుంది సంక్రాంతిపండుగ. అందరూ బంధుమిత్రులతో కలసి ప్రేమాభి మానాలతో ఆనందించడమే పండుగలలోని పరమార్థం.

*"సంతోషమే సగం బలం"*

# యతిరాజుల శిష్యానుగ్రహం

- డా॥ ఆకెళ్ళ విభీషణశర్మ,
98662 34482

లోకంలో శిష్యులకు ఉత్తమగురువులు దొరకడమో లేదా గురువులకు ఉత్తమశిష్యులు దొరకడమో జన్మజన్మాంతర పుణ్యఫలమనక తప్పదు. ఈ రెండింటికి నోచుకొన్నవాడు రామానుజులు.

యతిరాజులశిష్యులలో కూరేశులు, దాశరథి ఇరువురు సహచరశిష్యులు. గురువును సర్వదా వెన్నంటి గురువుమీద ఈగవాలకుండా చూచే స్వభావం కలవారు.

కంచికి సమీపంలోని గ్రామం కూరం. ఆ గ్రామాధి కారి కూరత్తాళ్వాన్. శ్రీవైష్ణవకోటికి నిరతాన్నదానం చేసే స్వభావం కలవాడు. కంచిలోని వరదరాజస్వామి కారుణ్య పాత్రుడు. సంస్కృతద్రవిడభాషాపారంగ తుడు. అనుకూలవతి అయిన భార్యతో ఆచార్యసేవకు అంకితమయినవాడు. రామానుజులకు కూరత్తాళ్వాన్ను అనుగ్ర హించాలని ఆకాంక్ష. సమయంకోసం ఆ సాధువు వేచి ఉన్నాడు.



31-01-2024న
కూరత్తాళ్వార్ వర్షతిరునక్షత్రం
సందర్భంగా...

రామానుజులకేమో 'రహస్యా ర్థాలు' తెలుసుకోవాలని ఆకాంక్ష. ఆ రహస్యార్థాలు చెప్పగలవారు తిరుక్కోట్టి యూర్‌నంబి అని తెలిసి రామానుజులు ఆ నంబిదగ్గరికి వెళ్ళారు.

'స్వామీ! నేను రామానుజదాసుడను. మహాపూర్ణుల శిష్యుణ్ణి. ఆ స్వామి పంపగా తమరిని ఆశ్రయించాలని వచ్చాను. దయతో మహామంత్రార్థాలను, ఇతర దుర్లభపరమార్థాలను నాకు అనుగ్రహించండి' అని వేడుకొన్నారు.

గోష్ఠీపూర్ణులు రామానుజులను చూడగనే సంతోషిం చారు. రామానుజులకున్న శ్రద్ధాసక్తులను పరీక్షించాలను కొన్నారు. పదునెనిమిదిమార్లు త్రిప్పించారు. చివరకు నంబి సమ్మతించి రేపు రమ్మంటే రామానుజులు కూరేశ దశరథులతో నంబిని అలాగే సేవించారు. నంబి ఆ ఇద్దరిని చూడగనే అసహనం ప్రకటించారు.

'రామానుజా! ఇదేమిటి? నిన్ను ఒంటరిగా రమ్మన్నాను కదా! ఈ ఇద్దరెవరు? వీరు నీ ప్రక్కన ఉంటే నేను నీకు మంత్రం ఎలా చెప్పను? అని కసురుకొన్నారు.

ఆచార్యా! అడియేన్ విన్నపం. మంత్రస్వీకారానికి త్రిదండోపవీతాలతో రమ్మని కదా మీ ఆన. నేను మీ ఆననే పాటించాను అన్నారు.

నంబి ఇరకాటంలో పడ్డారు.

'అలాగా! అయితే ఈ ఇద్దరిలో త్రిదండం ఎవరు? యజ్ఞోపవీతం ఎవరు?" అని ప్రశ్నించారు.

"స్వామీ! ఇతడే కూరేశుడు. నా జన్నిదం. ఇతడే దాశరథి. నా దండం' అని సమాధానమిచ్చాడు.

ఓహో! అలాగా! నేను నీకు మంత్రో పదేశం చేస్తాను. ఈ ఇద్దరికి తప్ప మరె వరికి చెప్పరాదు. చెబితే నరకవాసం తప్పదంటూ నారాయణ అష్టాక్షరీ మంత్రాన్ని అర్థసహితంగా ఉపదేశించారు.

యతిరాజు మంత్రరాజలాభంతో ఆనందపరవశులై ప్రదక్షిణనమస్కారాలు చేశారు.

కూరత్తాళ్వాన్ రామానుజుల అను గ్రహాన్ని మరువలేదు. శ్రీరంగంలోనే రామానుజులతోనే గడిపేవారు.

అయితే ఈలోగా ఒక విపత్కరపరిస్థితి ఎదురయింది. ఆ ప్రాంతభూపతి చోళరాజు శైవమతోన్మాది. తన పాలనలో సర్వం శివమయంగా ఉండాలని ఆకాంక్షించాడు. దుష్టుల ప్రేరణతో 'శివాత్పరతరం నాస్తి' అని వ్రాసిన తాటాకుప్రతుల


మనం ఎంత ఎక్కువగా అధ్యయనం చేస్తే మన అజ్ఞానం అంత తెలుస్తుంది

క్రింద సంతకాలు చేయించుకొని విజయగర్వంతో మిడిసిపడే వాడు. రామానుజులు సంతకం చేస్తే ఈ ప్రయత్నం పరిపూర్ణం అవుతుంది. కాకుంటే నిష్ఫలమన్నారు ఆంతరంగికులు. రాజు రామానుజులను సభకు రావలసిందిగా కట్టడిచేశారు. భటులు శ్రీరంగం చేరుకొన్నారు. మఠందగ్గరికి వచ్చి రాజాజ్ఞ తెలియ జేశారు. రాజాజ్ఞ కదా! అని రామానుజులేమో తాను వెళ్ళడానికి సన్నద్ధులయ్యారు.

ఉత్తమశిష్యుడు, కార్యార్థి సహనం పాటించాలి. అంచేత కూరేశులు వారించారు.

'స్వామి! అడియేన్ విన్నపం వినండి. ఆలకించండి. చోళరాజు దుష్టుడు. విష్ణుద్వేషి. అన్నిటికి సిద్ధమయినవాడు. మీరు వెళ్ళడం బాగుకాదు. నేను వెళతాను. అనుగ్రహించండి. శిష్యుడిగా నా కోరిక మన్నించండి' అన్నాడు.

రామానుజులు ఆలోచించారు. శిష్య సంప్రార్థనం సరి అనిపించింది.

కూరేశులు రామానుజుల కాషాయాదులు ధరించి చోళసభ చేరుకొన్నారు. చోళరాజు తెగ సంతోషపడ్డాడు.

'రామానుజా! 'శివాత్పరతరం నాస్తి' అందరికీ సమ్మతమే. చూశారా! ఎన్ని సంతకాలో! మీరూ చేస్తే ఇంక తిరుగుండదు' అన్నారు.

'అలాగే! పట్రండి...' అన్నారు కూరేశులు.

సేవకులు తాళపత్రం తెచ్చారు.

కూరేశులు తడుముకోకుండా 'ద్రోణమస్తి తతః పరమ్' అని వ్రాశారు. శివం ద్రోణం కొలతల పాత్రలు. శివం అనే పాత్రకంటె ద్రోణం అనే పాత్ర పెద్ద దని కూరేశుల అభిప్రాయం. అయినా ఈ వాక్యం చదివి చోళరాజు అగ్గిమీద గుగ్గిల మయ్యాడు. వచ్చినవాడు రామానుజులు కారని అర్థమయింది. కళ్ళు పీకించండి అన్నాడు క్రోధంగా.

"విష్ణుద్వేషిని చూచిన కళ్ళు ఉంటే ఏం? పోతే ఏం?" అంటూ తన గోళ్ళతోనే కంటిపాపను చిదిమేసుకున్నారు కూరేశులు. రామానుజులను రక్షించాలని సభలో అడుగుపెట్టిన కూరేశులు అంధులయ్యారు.

ఈ వార్త తెలిసిన రామానుజులు దిగ్భ్రాంతులయ్యారు. తనకోసం శిష్యులు చేసిన త్యాగం వారిని కదిలించింది.

చోళరాజు మరణానంతరం రామానుజులు శ్రీరంగం చేరారు.

కూరేశులను చూచి రామానుజులు కన్నీళ్ళు కార్చారు.

'కూరేశా! నీవు కంచివరదరాజును సేవించినవాడివి. నీ కవితావిభావంతో ఆ స్వామిని కీర్తించు' అన్నారు.

కూరేశులు గుర్వాజ్ఞ పాటించారు.

రామానుజులతో కంచికి కదిలారు. వరదరాజస్తవం చేశారు.

స్వామి కూరేశులకు 'నేత్రవీక్షణం' అనుగ్రహించాడు.

అప్పటికిగాని రామానుజులు సంతోషపడలేదు. కుదుట పడలేదు. రామానుజుల శిష్యానుగ్రహానికి ఇదొక మణిపూస.






ఓం శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం,
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే.

మన వైదిక సనాతన హిందూసంప్రదాయంలో ఏ శుభకార్యమైనా, ఏ దేవతార్చనైనా ముందుగా తొలిపూజలందు కునే దేవతామూర్తి, మన ఇలవేల్పు అయిన శ్రీవిఘ్నేశ్వర స్వామియే.

ఈ మానవజీవితంలో చిన్నవారైనా, ఎంత పెద్దవారైనా ఎన్నోవిఘ్నాలని ఎదుర్కొంటూ ముందుకు ప్రయాణిస్తూంటారు. ఎందుచేత విఘ్నాలు వస్తాయంటే చాలా సులభంగా చెప్పగలిగే కారణం "దైవబలం చాలకపోవటమే". దైవబలం ఎందుకు చాలదంటే, దానికి కారణం దైవాన్ని మనము కడు శ్రద్ధగా కొలవకపోవటమే. కాబట్టి, ఇక్కడ మనకు ఒక విషయం ద్యోతకమవుతుంది. దైవాన్ని చాలా శ్రద్ధగా ఆరాధిస్తే దైవం మనకు చేరువవుతుంది అని. ఇప్పుడు ప్రతిఒక్కరూ తాపత్రయ పడేది ఒకేఒక్కవిషయంమీదనే. అదే తొందరగా దైవబలం పొందాలంటే ఎలా? దీనికి సమాధానమే ఇప్పుడు మనం తెలుసుకోబోతున్న మంత్రబలరహస్యం.

మంత్రబలంతో దైవబలాన్ని తొందరగా పొందవచ్చునని మనశాస్త్రాలు చెబుతున్నాయి. మన వైదికవిజ్ఞానం ఎన్నో మంత్రరహస్యాలను తెలిపింది. అధర్వణవేదంలో అత్యంత ప్రభావవంతమైనవి గణపతి మూలమంత్రాలు. వీటిలో ప్రతి ఒక్కరూ సులభంగా పఠించగల మంత్రం "ఏకాక్షర గణపతి మూలమంత్రం." ఆ మంత్రాన్ని ఇక్కడ తెలుపటమైంది.

"ఓం గం గణపతయే నమః"

మన జీవితంలో ఎదురయ్యే అన్ని విఘ్నాలను తొలగించి మనల్ని విజయపథంలో నడిపించే భగవంతుడు విఘ్నేశ్వరుడు! పరమాత్మ అనుగ్రహించిన సృష్టిక్రమాన్ని గమనిస్తే మొదట ఆకాశం, వాయువు, అగ్ని, నీరు, తరువాత భూమి సృష్టించబడ్డాయి, అంటే ఈ భూమిమీద నివసించే ప్రతిప్రాణి పృథ్వీతత్త్వంతో సన్నిహితుడై ఉంటాడన్నమాట. యోగపరంగా చూస్తే మూలాధారానికి అధిపతి గణపతిస్వామియే. అందుచేతనే మనజీవితకథకూడా గణపతి ఆరాధనతోనే మొదలవుతుంది.

కాబట్టి మనం తలపెట్టిన ఏ మంచికార్యమైనా సాను కూలంగా సిద్ధించాలంటే పైన తెలిపిన మంత్రాన్ని ప్రతిరోజు 108సార్లు పఠించాల్సి ఉంటుంది. ఆ మంత్రబలంతో శ్రీవినాయకస్వామియొక్క దైవబలం మనల్ని అనుగ్రహించి మనం పిల్లలకోసం చేపట్టిన చదువులలో, వివాహాలలో, ఉద్యోగాభి వృద్ధిలో ఎటువంటి ఆటంకాలు రాకుండా కాపాడుతాడు.

పైన తెలిపిన మూలమంత్రం అయిన తర్వాత సాక్షాత్ బ్రహ్మదేవుడు మనకోసం వ్యాసమహర్షిద్వారా తెలిపిన గణేశషోడశనామస్తోత్రం చేసినయెడల అన్నివిఘ్నాలు తొలగి మనం చేసే అన్ని మంచిపనులు సఫలీకృతమవుతాయి.

సుముఖశ్చైకదంతశ్చ కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః॥ 1

ధూమ్ర కేతుః గణాధ్యక్షో ఫాలచంద్రో గజాననః
వక్రతుండ శ్శూర్పకర్ణో హేరంబః స్కందపూర్వజః॥ 2

షోడశైతాని నామాని యః పఠేత్ శృణు యాదపి।
విద్యారంభే వివాహే చ ప్రవేశే నిర్గమే తథా।
సంగ్రామే సర్వ కార్యేషు విఘ్నస్తస్య న జాయతే॥ 3

మనం తలపెట్టిన అన్ని మంచిపనులలో ఎటువంటి విఘ్నాలు లేకుండా అనుగ్రహించి సుసంపన్నం చేయమని పైన తెలిపిన శ్రీవినాయకుని భీజాక్షరీమూలమంత్రంతో ఆ స్వామిని ప్రార్థిస్తూ, తదనుగుణంగా మన ప్రవర్తనుకూడా ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ సుఖమయమైన జీవితాలతో పయనిద్దాం.

గణ గణమునకు పతియైన
గణపతిదొరకు జయం జయం

*గత సంచిక తరువాయి భాగం....*

అని యెల్లవారు తిరుమలనంబి పాదారవిందములపైని ప్రేమాతిశయముచేత ఇట్లు శ్లోకములను అనుసంధింతురు.

ఈ శ్రీశైలపూర్ణుల (తిరుమలనంబి) కుమారులగు చిన్న శ్రీశైలపూర్ణులకు 'తోళప్పర్' (మిత్రతాత) అను పేరు కలుగుటకు కారణము :

"శ్రీమద్భాష్యకృతో హ్యభే కథకై ర్వాదే పణే ప్రస్తుతే
సామైక్య శ్రుతిభేదవాక్య హృదయాన్యుక్త్వా నిశీథే హరిః,

మిత్రం భాష్యకృతె ..గా.. సచ యం సర్వస్య మిత్రం జగౌ
తం శ్రీభూధరపూర్ణపుత్త్రమవరం శ్రీశైలపూర్ణం భజే.

భారద్వాజకులాబ్ధీందుం ప్రజ్ఞాభక్త్యమృతార్ణవమ్,
శ్రీశైలపూర్ణతనయం మిత్రతాతగురుం భజే.

శ్రీమద్వేంకటనాయకేన జగతాం తాతేన వాక్యాత్పరం
తాతేత్యాదరతో హి యస్య మహిమా లోకే ప్రసిద్ధిం గతః,

తం తాతస్య చ తాత మార్యశరణం శ్రీశైలపూర్ణం గురుం
భారద్వాజకులీన మాశ్రితనిధిం ప్రజ్ఞానిధిం సంశ్రయే."

(శ్రీభాష్యకారులకు అభేదవాదులతోడ (అద్వైతులతో) వాదరూపమగు పందెమేర్పడగా శ్రీహరి అర్ధరాత్రి సామ్య శ్రుతుల, ఐక్యశ్రుతుల భేదవాక్యముల మార్మికార్థమును చెప్పి, భాష్యకారులకు ఈతడు (చిన్న శ్రీశైలపూర్ణుడు) మిత్రుడని చెప్పెను. ఆ భాష్యకారుడు ఈయనను ఎల్లరకు మిత్రుడని చాటి చెప్పెను. అట్టి శ్రీశైలపూర్ణుల కుమారుడగు చిన్న శ్రీశైలపూర్ణుని సేవింతును. భారద్వాజకుల జలధిసోముడును ప్రజ్ఞాభక్త్యమృతములకు సాగరమైనవాడును అగు శ్రీశైలపూర్ణతనయుని, మిత్రతాతగురువును సేవింతును. సకలలోకములకు తండ్రి యగు శ్రీవేంకటనాయకుడు ఎవ్వని తాత! (తండ్రీ!) యని ఆదరమున పిలువగా, అంతట యెవ్వని మహిమ ప్రసిద్ధిగనెనో అట్టి తాతకు తాత (జగత్పితయగు వేంకటేశ్వరునకు తాతయని సంబోధింప నర్హుడగుటచేత) ఐనవాడు, ఆర్యులకు శరణైనవాడు భారద్వాజవంశజుడు, ఆశ్రితులకు నిధియైనవాడు ప్రతిభా ఖనియునగు శ్రీశైలపూర్ణగురువు నాశ్రయింతును.)

తిరుమల తిరుపతి నిత్యవాసులగు పెద్దలు శ్రీభగవద్రామానుజాచార్యుల యానతి చొప్పున శ్రీవేంకటాచలపతికి జరుపు



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యామాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

నట్లే గోవిందరాజస్వామికికూడ అటులనే ఐతిహ్యోత్సవములు, అధ్యయనోత్సవము మొదలగు శ్రీభగవద్రామానుజ దర్శన ధర్మములన్నియు జరిపింపవలెనని కట్టడచేసి పెద్ద అధ్యయనోత్సవము (రాపత్తు) తిరునాళ్లసమాప్తిదినమున సాయంకాలమున శ్రీనమ్మాళ్వారులు పల్లకీయందు విజయముచేసి వేంకటాచలపతికి శ్రీగోవిందరాజులును ఐక్యము(అభేదము) తెలుపుటకై మొదట దివ్యతిరుమలకు(కొండకు), శ్రీవేంకటాచలపతికిని మంగళాశాసనముచేసి శ్రీపాదార్చనకై నృత్తగీతవాద్యములతోడ జియ్యరులును, శ్రీవైష్ణవులును స్తోత్రగద్యానుసంధానముతోడ గోవిందరాజదేవాలయమును ప్రదక్షిణముచేస్తూ బయలువెడలుతారు.

(ఇంకా ఉంది)

# తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ


- డా॥ ఎన్.సి.హెచ్.సుధామైథిలి,
82475 78748


**తిరుమల శ్రీవారిఆలయంలో స్వామి వారికి ప్రతిరోజూ సుప్రభాతసేవ ఎంతో మధురంగా జరుగుతుంది.**

**ఆ సేవావిశేషాన్ని ఒక తాత తనను వివరించి చెప్పమన్న మనుమడికి చెప్పిన సంభాషణే ఇది.**





**తాతయ్య:** (ఉదయం నిద్రలేచి స్నానాది కార్యక్రమాలు పూర్తిచేసుకుని నిత్య పూజలో భాగంగా.. వేంకటేశ్వరుని పూజిస్తూ) స్వామీ! ఏడుకొండలవాడా! తిరుమల వచ్చి నిన్ను ఎన్నోమార్లు దర్శించుకుని ఎన్నోసేవలు చేసుకుని పులకించాను. కానీ సుప్రభాతసేవను మాత్రం చూసే భాగ్యాన్ని పొందలేక పోయాను. మనోహరమైన నీ సుప్రభాతసేవను చేసుకునేభాగ్యాన్ని నాకు ప్రసాదించు స్వామి! (అంటూ వచ్చి సోఫాలో కూర్చున్నాడు.)

**మనుమడు:** తాతయ్య! సుప్రభాతసేవ అంటే ఏమిటి? ఆ సుప్రభాతసేవలో ఏమేమి చేస్తారు? (అంటూ తాతయ్య ప్రక్కనే సోఫాలో కూర్చున్నాడు.)

**తాతయ్య:** మంచిప్రశ్న వేశావు మనుమడా! సుప్రభాతసేవ అంటే స్వామిని 'మేలుకొలుపు' సేవ. రోజువారీ స్వామికి నిర్వహించే పూజా కార్యక్రమాలు ఈ సేవతోనే ప్రారంభమవుతాయి. మొదట బంగారు వాకిలి తలుపులు తెరుస్తారు. "సు-ప్రభాతము" అనగా "మంచిఉదయం" అని అర్థం. హిందూపూజావిధానాలలోనూ, ప్రత్యేకించి శ్రీవైష్ణవాచారపరంపరలోనూ భగవంతునికి అనేకమైన సేవలు (షోడశోపచారాలు) నిర్వహించే సంప్రదాయం ఉంది. ఇలాంటి సేవలలోనిదే సుప్రభాత సేవ. ఆ ప్రభాతసేవాసమయంలో చేసే కీర్తననే "సుప్రభాతం" అని అంటారు.

**మనుమడు:** ఈ సుప్రభాతసేవ ఏ సమయంలో జరుగుతుంది తాతయ్య!

**తాతయ్య:** ప్రతీరోజూ బ్రాహ్మీముహూర్తంలో 2.30నుండి 3.00గంటలమధ్యలో జరుగుతుంది.

**మనుమడు:** ఆలయం తలుపులు ఎవరు తెరుస్తారు తాతయ్య!?

**తాతయ్య:** సుప్రభాతసేవ జరిగేముందు 'సన్నిధిగొల్ల' దివిటీ పట్టుకుని ఉత్తర మాడవీధిలో ఉంటున్న వైఖానస అర్చక స్వామి ఇంటికి, బేడిఆంజనేయస్వామి గుడివద్దనున్న పెద్దజియ్యంగార్ మఠానికివెళ్లి వారిని మర్యాద పూర్వకంగా ఆలయానికి తీసుకు వస్తారు. అర్చకులు శ్రీవారి బంగారు వాకిలి తెరవడానికి ఉపయోగపడే 'కుంచెకోల' అనే సాధనం, తాళంచెవులను ధ్వజస్తంభందగ్గరున్న క్షేత్రపాలక శిలకు తాకిస్తారు. వారు క్షేత్రపాలకునికి, ధ్వజస్తంభానికి నమస్కరించి, ప్రదక్షిణం చేసి వెండివాకిలి దాటి, బంగారువాకిలిముందు శ్రీవారిని స్మరిస్తూ నిలుచుంటారు. ఆ సమయానికి ఆలయాధికారులు, పేష్కారు, శ్రీవారి సుప్రభాతాన్ని పఠించే వేద పండితులు, తాళ్లపాక అన్నమయ్యవంశస్థుడు ఒకరు తంబూరాతో స్వామివారికి మేలుకొలుపుసంకీర్తన పాడడానికి సిద్ధంగా ఉంటారు. తాళాలు తీసిన తర్వాత సన్నిధిగొల్ల బంగారువాకిలి తెరచి దివిటీతో లోనికి ప్రవేశిస్తారు.

ఆ తర్వాతే అర్చకులు మధురస్వరంతో "కౌసల్యా సుప్రజా రామా..." అంటూ సుప్రభాతం అందుకొంటూ లోనికి ప్రవేశిస్తారు.

**మనుమడు:** తిరుమలలో లడ్డు ఎంతో రుచికరంగా ఉంటుంది. ఆ లడ్డూనే సుప్రభాతసేవలో స్వామికి నైవేద్యంగా పెడతారా తాతయ్య!

**తాతయ్య:** లేదు నాన్న! మహంతుమఠం వారు తెచ్చిన పాలు, చక్కెర, వెన్న, తాంబూలమును నైవేద్యంగా స్వామికి పెడతారు.

**మనుమడు:** తాతయ్యా! మన ఇంటిదగ్గర గుళ్ళో మైకులో పొద్దున్నే వేంకటేశ్వర స్వామిపాటలు పెడతారు కదా.. అలాంటి పాటలే అక్కడ దేవుడికి పాడతారా?

**తాతయ్య:** నీకు చాలావిషయాలు తెలుసే.. సుప్రభాతంలో స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనం పూర్తయిన తరువాత అన్నమయ్యవంశీయులు భూపాల రాగంలో ఒక మేలుకొలుపుకీర్తన గానం చేస్తారు.

**మనుమడు:** తాతయ్య! మరి సుప్రభాత సేవలో వేంకటేశ్వరస్వామిని మొదటి సారి ఎవరు దర్శించుకుంటారు?

**తాతయ్య:** దివిటీతో ముందుగా లోపలికి వెళ్ళిన సన్నిధిగొల్ల 'కులశేఖరపడి' వద్ద నిలిచి ఆ వెలుగులో శ్రీవారి దివ్య మంగళమూర్తిని తొలిదర్శనం చేసుకుంటారు. ఆ తరువాత అర్చకులు, ఏకాంగి 'కులశేఖరపడి' దాటి లోపలికి ప్రవేశిస్తారు.

**మనుమడు:** తాతయ్యా! మా అమ్మ నన్ను నిద్ర లేపుతుందే.. స్వామినికూడా అలాగే నిద్ర లేపుతారా..

**తాతయ్య:** (నవ్వుతూ) అవును నాన్న.. నిన్ను మీ అమ్మ ప్రేమగా నిద్రలేపి బ్రష్, స్నానం చేయిస్తుంది కదా.. అలానే స్వామివారినికూడా అర్చక స్వాములు భక్తిశ్రద్ధలతో నిద్రలేపుతారు.. శయనమండపంలో బంగారు పట్టుపరుపుపై పవళించిఉన్న భోగ శ్రీనివాసమూర్తిని సమీపించి నమస్కరించి చప్పట్లు చరుస్తారు. ఆ విధంగా ఆయన్ని మేల్కొనవలసిందిగా ప్రార్థిస్తారు. ఆ పైన భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని జీవస్థానంలో... మూలమూర్తిసన్నిధిలో వేంచేపు చేస్తారు. ఆనందనిలయంలో కులశేఖరపడివద్ద ఉన్న తెరవేసి అర్చకులు శ్రీవారికి ఆచమనాదిక్రియలను సమర్పిస్తారు. మహంతుమఠంవారు తెచ్చిన నవనీతం, పాలు, చక్కెరలను నివేదనచేసి, స్వామివారికి సుగంధతాంబూలాన్ని సమర్పిస్తారు. బంగారువాకిలిముంగిట్లో వేదపండితులు సుప్రభాతం ముగిస్తూ ఉండగా, లోపల అర్చకులు శ్రీవారికి నవనీతహారతి ఇస్తారు.

**మనుమడు:** తాతయ్య! నవనీతహారతి అంటే ఏమిటి?

**తాతయ్య:** 'నవనీతహారతి' అంటే నివేదనానంతరం ఇచ్చే మొదటి కర్పూర హారతిని నవనీతహారతి అని పిలుస్తారు. ఆ సమయంలోనే బంగారు వాకిళ్ళు తెరుస్తారు. అపుడు శ్రీవారి పాదాలపై తులసీదళాలు, పుష్పాలు కూడా ఉండవు. భక్తులకు ఆపాద మస్తకం స్వామి దివ్యమంగళవిగ్రహ దర్శనం లభిస్తుంది. అందుకే ఈ దర్శనాన్ని 'విశ్వరూపసందర్శనం' అని భక్తితో పిలుస్తారు. ఈ హారతి తర్వాత అర్చకులు గత రాత్రి బ్రహ్మాదిదేవతలు శ్రీవారిని అర్చించడంకోసం మూల సన్నిధిలో ఉంచిన బ్రహ్మతీర్థాన్ని, చందనాన్ని, శఠారిని తాము ముందుగా స్వీకరించి ఆ తరువాత జియ్యంగారికి, ఎకాంగికి ఇస్తారు. సన్నిధిగొల్లకుకూడా తీర్థం, శఠారితో పాటు నివేదన పళ్ళెంలోని తాంబూలాన్ని అర్చకులు అందజేస్తారు. స్వామివారి సుప్రభాతసేవకోసం భక్తులు వరుసగా స్వామివారిసన్నిధికి వెళ్ళి ఆ దివ్యమంగళమూర్తిని దర్శించి తీర్థం, శఠారులను స్వీకరిస్తారు.

**మనుమడు:** అబ్బ! ఎంత బాగుందో ఈ సుప్రభాతసేవ. ఈ సేవ ప్రతీరోజూ చేస్తారా తాతయ్య!

**తాతయ్య:** లేదు మనుమడా! ఒక్క ధనుర్మాసంలో మాత్రం సుప్రభాతగానం ఉండదు. ఆళ్వారులలో ఒకరైన అండాళ్ తిరుప్పావైపాశురాల్ని గానం చేస్తారు.

**మనుమడు:** భలేగా ఉంది తాతయ్య. ఇన్ని గొప్పవిషయాలు ఉన్న సుప్రభాతసేవకు మనమందరం కలిసి తప్పకుండా వెళదామా..

**తాతయ్య:** ఆ వేంకటేశ్వరుడు దయ తలిస్తే తప్పకుండా వెళ్ళి కనులారా చూసి ధన్యులమవుదాం..

శుభం భూయాత్

# వేదగణితం- ప్రాముఖ్యిత

- శ్రీ ఎం.వి.ఎస్.రామశేషు




వేదం అంటే వెలుగు. వెలుగు అంటే జ్ఞానం. అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని పంచేది వేదం. మానవజీవన గమనంలో మనకు తెలీకుండానే వేదంద్వారా ఎన్నో ప్రామాణిక మైనకార్యాలను చేస్తున్నాం. వేదాలు హిందువులకు పవిత్ర గ్రంథాలు. ఈ వేదాలనుంచి 1911సం॥ర కాలంలో శ్రీభారతీ కృష్ణతీర్థస్వామి పరిశోధనలుచేసి 16 ముఖ్యగణితసూత్రాలను పేర్కొన్నారు. అవేకాక 13ఉపసూత్రాలనుకూడా చెప్పారు. ఇవి సంఖ్యాగణనం సులభంగా చేయడానికి ఉపయోగపడతాయి. ఈ సూత్రాలను కనుగొన్నది వెంకట్రామన్‌శాస్త్రిగారు. ఆయన తిరునల్వేలికి చెందినవారు. ఏడు ఎం.ఏ.పరీక్షలు ఒకేసారి వ్రాయటానికి ప్రభుత్వంనుంచి అనుమతిని పొంది, అన్నింటిలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన ప్రతిభాశాలి. ఆనాటి ప్రభుత్వం ఆయనను షిమోగాజిల్లాకు డిప్యూటీకలెక్టర్‌గా నియమించారు. శృంగేరి షిమోగాజిల్లాలో ఉంది. ఆధ్యాత్మికతపట్ల ఆసక్తి కలిగిన వెంకట్రామన్‌గారు శృంగేరివెళ్లి పెద్దస్వామిగారిదగ్గర వేద, వేదాంతవిషయాలనుగురించి చర్చించేవారు. స్వామివారు వారి కున్న ఆసక్తిని గమనించి, వారిని పరిపాలనావ్యవహారాలకు అంతరాయం కలగకుండా ఆధునికవిషయాలైన గణితం, భౌతిక శాస్త్రం మొదలగు అంశాలగురించి పరిశోధన చేయాల్సిందిగా చెప్పారు. స్వామివారిఆజ్ఞను అనుసరించి వెంకట్రామన్‌గారు గణితాన్ని ప్రధానంగా తీసుకొని వేదాలనుండి విషయం గ్రహించి 16భాగాలను రచించారు.

ఆ తరువాత పూరీపీఠాధిపతిగా నియమితులయ్యారు. అయినా పీఠకార్యక్రమాలకు భంగం కలగకుండా వేదాలను అధ్యయనం చేశారు. ఒకసారి ఉజ్జయినిలోని ఉజ్జయిని విశ్వ విద్యాలయంలోని విద్యార్థులకు వేదాంతశాస్త్రంగురించి తెలియ చేయాల్సిందిగా ఆహ్వానించారు. అప్పుడు స్వామీజీ వేదాంతం గురించి ఉపన్యసిస్తూ వేదాంతానికి, వేదగణితానికి భేదంలేదని పేర్కొన్నారు. ఆనాడు అక్కడున్న పిల్లలచేత వారు చిన్న చిన్న గుణకారాలతో ఎంతో పెద్దలెక్కలను చేయించారు. అక్కడ కొందరు వారు ఉపన్యసించిన విషయాలను గ్రంథస్తం చేయా ల్సిందిగా కోరారు. కానీ అప్పుడు ఆయన 16(వాల్యూముల) భాగములుగా విషయం గ్రంథస్తం చేశానని, ఆ పుస్తకాలు శృంగేరిలోని ఒకరిఇంట్లో ఉన్నాయని చెప్పారు. అప్పుడు వారు శృంగేరివెళ్లి అన్వేషించారు. కానీ ఆ ఇంటివారు ఎన్ని సంవత్సరాలు గడిచినా పుస్తకాలను ఎవరూ తీసుకొని వెళ్లలేదని, తమకు అందులోని విషయాలు అర్థం కాలేదు కాబట్టి చిత్తుకాగితాలకు అమ్మివేశామని చెప్పారు. ఆ మాటలను విన్న వారు బాధతో తిరిగివచ్చి స్వామీజీకి వివరించారు. అప్పుడు స్వామీజీ మరల వ్రాయటం ప్రారంభించారు. కాని అందులో ఒక్కపుస్తకంమాత్రమే అందుబాటులోకి వచ్చింది. అదే వైదిక గణితం లేదా వేదగణితం అనుపేరుతో ప్రసిద్ధిపొందింది. "వేద గణితపితామహుడు" అని భారతీకృష్ణతీర్థస్వామీజీని పేర్కొం టారు. వేదగణితం మనకు అందుబాటులోకి తెచ్చినవారిలో ఆద్యుడు స్వామీజీ. ఈ పుస్తకం మొదటిసారి 1965లో ప్రచు రింపబడింది. స్వామీజీవి అన్ని గ్రంథాలు ఉండిఉంటే వేద గణితప్రభావం ఇంకా ఎంతో ఉన్నతంగా ఉండేది.

వేదాలలో ఉన్న గణితాన్ని ఉదహరిస్తూ బోధాయన మహర్షి, గర్గమహర్షి, పరాశరుడు, కశ్యపుడు, మయుడు, బృహస్పతి తర్వాతికాలంలో ఆర్యభట్ట, వరాహమిహిరుడు, భాస్కరుడుకూడా గ్రంథాలరచన చేయటం జరిగింది. కానీ ఎక్కడా గణితశాస్త్రంగురించి చెప్పినట్లుగా మనకు కనపడదు. వేదగణితంవల్ల వ్యవకలనం, చతురస్రం, వర్గం, వర్గమూలాలు, క్యూబ్, హెచ్.సి.యల్., యల్.సి.యం. వంటి విషయాలపట్ల



మనం ఇతరులకోసం ఏ బాధల్ని అనుభవిస్తామో అది మన ప్రేమకు నిదర్శనం

పిల్లలలో అవగాహన పెంపొందుతుంది. ఈ సూత్రాల వల్ల సంఖ్యాగణనాలను త్వరగా పరిష్కరించవచ్చు. విద్యార్థులు తప్పులులేకుండా గుణకారం, కూడిక, భాగహారాలను సులభంగా చేయవచ్చు. వేదగణితం కనుక అభ్యసనం చేసినట్ల యితే విద్యార్థులకు గణితంవల్ల కలిగే మానసికఒత్తిడులను దూరంచేయవచ్చు.

ఇందులో ఆధ్యాత్మికజ్ఞానం, ప్రాపంచికజ్ఞానం కలబోసి ఉన్నాయి. సనాతనధర్మాన్ని ఆచరించే సంప్రదాయవాదులు దీనిని గౌరవిస్తారు.

అంతేకాక ఋషులు యజ్ఞయాగాదులు చేయ తలపెట్టి నప్పుడు యజ్ఞవాటిక, హోమకుండాలను నిర్మించునప్పుడు వేసే లెక్కలలో వేదగణితం అంతర్లీనంగా ఉండి ఉండవచ్చు. యజ్ఞ వేదిక నిర్మాణాలలో రేఖాగణితసూత్రాలుకూడా ఉపయోగ పడతాయి. వీటిలో బోధాయన, ఆపస్తంబ, కాత్యాయన మొదలైనపేర్లు ఈ సూత్రాలకు ఉన్నాయి. ఆగమశాస్త్రంప్రకారం ఆలయాలను నిర్మించునప్పుడు ఆలయగోపురం, గర్భాలయ ముఖద్వారమేకాక మిగిలిన ఉపాలయాల కొలతల లెక్క లన్నింటిలో వేదగణితమే ప్రాధాన్యత వహిస్తుంది. మన ఖగోళ శాస్త్రంలో, జ్యోతిష్య, సిద్ధాంత, వాస్తు, వ్యాకరణ, అలంకార, ఛందోశాస్త్రాలలోకూడా వేదగణితం ఉందనవచ్చు. మన సాంకేతికజ్ఞానమంతా వేదముఖమయినదే కదా! ఈ శాస్త్రంలో ఆర్యభట్ట, భాస్కరాచార్య, బ్రహ్మగుప్త, పావులూరిమల్లనవంటి ప్రముఖశాస్త్రజ్ఞులు ఎందరో ఉన్నారు. జ్యోతిష్యశాస్త్రవేత్తలు జాతకాలను గణన చేసేటప్పుడు ఇవే లెక్కలను ఉపయోగిస్తారు. అక్షసూక్తం అనేపేరుతో చెప్పే పాచికలఆట, చదరంగం, అష్టా చమ్మా ఆటలలోనేకాక, నేడు ఆడే కబడ్డీ, కర్రబిళ్ళ, క్రికెట్, బ్యాడ్మింటన్ మొదలగు ఆధునికక్రీడలకు సైతం మైదానంలో గీసే గడుల లెక్కలన్నింటికి వేదగణితమే ఆధారమై ఉండవచ్చు. అంతేకాక పూర్వం పండితులు సూర్యోదయ, సూర్యాస్తమయ, చంద్రోదయకాలాలను, బ్రాహ్మీముహూర్తం, అపరాహ్ణం, సంధ్యా సమయమని, రాత్రిసమయాన్ని మొదటి, రెండవ, మూడవ యామములని, జాము అని లెక్కలు వేసి చెప్పేవారంటే అది వేదాలను అనుసరించేకదా! పూర్వం గడియారాలు లేనికాలంలో పగటిసమయంలో నీడనుబట్టి కాలాన్ని గణన చేసేవారు. గృహశంకుస్థాపన, వివాహాది సమస్తముహుర్తాలన్నీ వేదాలలోని లెక్కలే. అలాగే

**“ప్రాతర్ ద్వాదశనాడ్య స్తు, సాయం తు నవనాడికాః!**
**ఔపాసనస్య కాలో కేయం నిశ్చి త్యోక్తో మనీషిభిః!!”**

ప్రాతరౌపాసన–సూర్యోదయంతర్వాత 12 ఘడియలు, (ఉదయం 11గంటలవరకు) సాయంకాలౌపాసన–సూర్యా స్తమయంతరువాత 9ఘడియలు (రాత్రి 10గంటలవరకు)అని ధర్మసిందువులో చెప్పబడింది. ఇది ఒకవిధంగా వేదాల్లో చెప్పబడి ఉండవచ్చు.

భూగోళంలో మనకు చెప్పే అక్షాంశ, రేఖాంశాల వివరణకూడ వేదగణితజనితమే అనుకోవచ్చు.

రామాయణ, మహాభారతాలలో యుద్ధసమయాలలో సైన్యాన్నిగురించి చెప్పిన లెక్క శంఖము, పద్మము, అర్బుదము, ఖర్వము, మహాఖర్వము మొదలుగా గణనచేసి చెప్పేవారు. వాల్మీకిరామాయణం యుద్ధకాండలోగల శ్లోకం మానవ మేధస్సుకు చెందినటువంటిది. చదరంగం, పాచికలు, అష్టా చమ్మా మొదలైనఆటలలో మనకు తెలియకుండానే ఈ గణితం ఉపయోగపడుతుంది. వేదగణితం అభ్యసనం, అధ్యయనం చేసినట్లయితే గణితశాస్త్రాన్ని నేర్చుకోవడం సులభతరం అవుతుంది. విద్యార్థులు మానసికవ్యాకులతలకి గురికాకుండా చేయవచ్చు. ఏ వయస్సువారైనా దీనిని నేర్చుకోవచ్చు. విద్య నేర్చుకోవటానికి మనస్సు, శ్రద్ధ ప్రధానమేకాని వయస్సుకాదు అన్న విషయాన్ని గ్రహించగలిగితే వేదగణితం మరింత అభివృద్ధి లోకి వస్తుంది. పిల్లలకు దీనిపట్ల అవగాహన కలిగించాలి. ఇవ్వాళ నేర్పించే అబాకస్, బైజూగణితాలు ఈ కోవలోనివే అనుకోవచ్చు.

ఈ శాస్త్రాలే బ్రిటీషువారిపాలనాకాలంలో వారిదేశా నికి చేరి One, Two, Threeలుగా మారి మనల్ని చేరింది. అవే లెక్కలని , గొప్పవని మనం భావిస్తున్నాం. అందుకే ఎప్పుడూ మనం మనమూలాలను మరచిపోరాదు.

అమ్మే మనజన్మకి కారణమయితే
వేదమ్మే మన జాతి జీవనానికి మూలం.

యువత

# దానఫలం

- డా॥ ఎస్. కృష్ణమూర్తినాయుడు, 98663 62674

హైందవసంస్కృతిలో మనపెద్దలు దానాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. తపస్సు, విద్య, దానం ఈ మూడింటిలో ఏది గొప్పది? అన్న ధర్మరాజు ప్రశ్నకు భీష్ముడి సమాధానం ఈ మూడింటిలో గొప్పది దానం. కేవలం దానం చెయ్యడం వల్ల మాత్రమే విద్య, తపస్సుకూడా వృద్ధినొందుతాయి. ఈ దానాలు పలురకాలు.

భూదానం, గోదానం, అన్నదానం... ఇలా అన్నీ శ్రేష్ఠమైన దానాలే! వీటిలో ఈ దానమే గొప్పదని చెప్పలేం. దానంచేసే పద్ధతి సమయంబట్టి ఫలితం మారుతుంది. ఏది కోరి యాచకుడు తనదగ్గరకు వస్తాడో దాన్ని ప్రేమతో ఇవ్వటం అన్నిదానాల్లో శ్రేష్ఠం. దానికంటెకూడా సర్వజీవులకూ అభయం ఇవ్వడం చాలా గొప్పది. కాబట్టి కేవలం దానం చెయ్యడమే కాకుండా అనుసరించాల్సినపద్ధతులు శాస్త్రీయంగా తెలుసుకొని దానం చెయ్యడం ఉత్తమం.

## భూదానం

ధాన్యాలన్నిటికీ నేలయే ప్రధానం మరియు ఆధారం. అంతేకాదు బట్టకు ప్రత్తి అక్కడే పండుతుంది. రత్నాలు భూమిలోనే దొరుకుతాయి. కనుక, అతిశయంగా డబ్బిచ్చేది నేలయే. బంగారం, వెండి, వస్త్రం, ధాన్యం, వివిధరత్నాలు ఇచ్చిన ఫలాలన్నిటినీ భూదానం చేసినవాడు పొందుతాడు. భూమి ఎంతకాలం ఉంటుందో భూదానం చేసినవాడు సైతం స్వర్గలోకంలో అంతకాలం ఉంటాడు. కొంచెం నేలను దానం చేసినా ఎంతో నేలను పొందగలడు. రాజు రణమరణమైనా పొందాలి లేదా భూదానమైనా చెయ్యాలి. భూదానం అశ్వ మేధంతో సమానమని మహర్షులంటారు.

## అన్నదానం

లోకయాత్రలో యజ్ఞయాగాదులు మిగిలినవన్నీ అన్నంతోనే ప్రవర్తిస్తున్నాయి. కనుక, అన్నం శ్రేష్ఠమైనది. అన్న దానం పవిత్రంగా చేస్తే ఎక్కువ ఫలితాన్ని ఇస్తుంది.

సృష్టి ప్రారంభంలో బ్రహ్మ అన్నం అమృతమని చెప్పాడు. ఎందుకంటే అన్నం సప్తధాతువులను పోషిస్తుంది. అన్నదానంవలన స్వర్గసుఖాలు లభిస్తాయి.

తనకున్న అన్నంతోనే దేవతల, పితృదేవతలపూజలు చెల్లించాలి. అతిథులను దానితోనే తృప్తి పొందించాలి.

## గోదానం

గోదానం చేసినవాడు ముక్తిని పొందుతాడు. ఆవులను బ్రాహ్మణులకు దానం చేస్తే ఎలాంటి పాపమార్గాలు పొందక పుణ్యలోకాలలో సుఖంగా ఉండగలడు. గోదానం బాగా పరీక్షించి చెయ్యాలి. క్రూరుడికీ, నాస్తికుడికీ, చెడ్డపనులు చేసే వాడికి ఇస్తే గోవు శోకిస్తుంది. ఆ శోకం దాతను నరకంలో



పడేస్తుంది. తాను తినేముందు ఆవుకు పిడికెడుగడ్డి సంవత్సరం పొడుగునా ప్రతిదినమూ ఎవడిస్తాడో వాడు బ్రాహ్మణుల కోర్కెలన్నీ తీర్చినంత ఫలం పొందుతాడు.

గోదానం చేస్తే వచ్చే ఫలితంకంటె గోసంరక్షణ చేయడంవలన అధికఫలితం వస్తుందని శాస్త్రాలు చెప్తున్నాయి. ఇంకా, తిలదానం, వస్త్రాలు, దీపాలు దానం చెయ్యడం, అలాగే జలదానంవలన స్వర్గంలోని సర్వసుఖాలూ అనుభవిస్తారు.

ఈ విధంగా దానధర్మాలు మన సనాతనసంప్ర దాయంలో ప్రధానభూమికను పోషిస్తున్నాయి. ఆధ్యాత్మిక సాధనలో ఉన్నవారు, ఇహ, పరసుఖాలను కోరుకొనేవారు తప్పకుండా దానాలు చేసి ఆ ఫలితాలను పొందగలరు.



మనం ఉన్నతలక్షణాలు కల్గిఉంటే సరిపోదు. వాటిని నిలబెట్టుకునే సామర్థ్యముండాలి.

# తిరుశిరుపులియూర్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

భగవంతుడు వేంచేసిఉన్న దివ్యదేశాల్లో శిరుపులియూర్ అనే దివ్యదేశం ఒకటి. ఈ దివ్యదేశం తమిళనాడులో మయిలాడుదురై మరియు తిరువారూర్ వెళ్ళేమార్గంలో దక్షిణ దిక్కులో సుమారు 16 కి.మీలదూరంలో వెలసి ఉంది. రెండు ఎకరాలవిస్తీర్ణంలో, 75అడుగులఎత్తులో, మూడుఅంతస్థుల గోపురంలో మరియు ఐదుఅంతస్థులుకల రాజగోపురంలో రెండు ప్రాకారాలతో ఒకపెద్ద మహామండపంలో ఈ దివ్యదేశం ప్రకృతి రామణీయకతతో అత్యంత శోభాయమానంగా విరాజిల్లుతోంది. అనేక గుణగణసంపన్నుడైన భగవంతుడికి దయ అనేది విశిష్ట గుణంగా కీర్తింపబడుతోంది. ఇక్కడ వేంచేసిఉన్న అర్చామూర్తి, మూలమూర్తి జలశయనపెరుమాళ్. అలాగే అరుమాకడల్. అముదన్ అని బాలశయనమూర్తిగా చిన్నస్వరూపంతో ఆది శేషునిమీద పవళించి దర్శనాన్ని కల్గిస్తున్నాడు.

## స్థలపురాణం

శ్రియఃపతి శ్రీమన్నారాయణునికి శ్రీవైకుంఠంలో కైంకర్యభాగ్యాన్ని పొందిన ముప్వురిలో అనంతుడు మరియు గరుత్మంతుడు ఇరువురూ ఉంటారు. వీళ్ళిద్దరు తమరిలో ఎవరు గొప్ప అని ఎల్లప్పుడు జగడాలు ఆడుతూ ఉండేవారు. గరుత్మంతుని బలంచూచి భయపడ్డ ఆదిశేషుడు ఈ శిరుపులి యూర్ దివ్యదేశానికి వచ్చి కఠోరమైన తపస్సు చేశాడు. తపస్సుకు మెచ్చిన బాలస్వరూపుడైన ఈ జలశయనపెరుమాళ్ ఆదిశేషుడికి ప్రత్యక్షమై తనకు పాన్పుగా ఉండుమని అనుగ్ర హించాడు. అదేసమయంలో అక్కడికొచ్చిన గరుత్మంతుడు ఈ అనుగ్రహాన్ని చూచి వెంటనే తనకు అనంతునిమీదున్న శతృత్వాన్ని పోగొట్టుకొని భగవంతుణ్ణి మంగళాశాసనం చేశాడు. శతృత్వ భావనలో ఉన్నవాళ్ళు ఈ భగవంతుణ్ణి సేవిస్తే వెంటనే వారి మనస్సు మారి పగను వదిలి స్నేహభావనతో మంచి మనుషులుగా ఉంటారని ఈ వృత్తాంతంద్వారా తెలుస్తోంది.

వ్యాఘ్రపాదుడు అనే ఒకమహర్షి గొప్ప శివభక్తుడు. అతడు పరమశివునిగురించి తపస్సుచేసి తద్వారా పులివలె పాదాలు, హస్తాలు, నేత్రాలనుకూడా వరంగా పొందాడు. అలాగే చిదంబరం నటరాజస్వామిగురించి తపస్సుచేసి ఆ స్వామి ప్రత్యక్షమవ్వగా తనకు ముక్తిని ప్రసాదించుమని మహర్షి కోరాడు. అందుకు నటరాజస్వామి. శిరుపులియూర్‌లో వేంచేసిఉన్న జలశయనమూర్తిని వేడుకోమని ఆ స్వామియే నీకు ముక్తిని ప్రసాదించగలడని చెప్పాడు. మహర్షికూడా ఈ దివ్యదేశానికి వచ్చి దర్శించడానికి ప్రయత్నించగా ఆ ప్రయత్నం సఫలం కాలేదు. తాను తిరిగి నటరాజుణ్ణి వేడుకోగా ఆయన లింగరూపంలో కన్పించి భగవంతుని విశాలమైనస్వరూపాన్ని దర్శింపచేశారు. ఈ ఆశ్చర్యమైనస్వరూపాన్ని దర్శించిన మునిశ్రేష్ఠుడు తిరువనంతపురం పద్మనాభస్వామిని దర్శించినంత ఆనందాన్ని పొంది తమచేతులతో స్వామివారిని స్పృశించే భాగ్యం కలగలేదని బాధపడ్డాడు. మహర్షి మనోరథాన్ని సఫలం కావించడాన్ని భగవంతుడు వాత్సల్యంతో తన స్వరూపాన్ని చిన్నదిగా చేసుకుని బాలశయ నుడిగా సేవను ప్రసాదించి నట్లు స్థలపురాణం చెప్తోంది. ఈనాటికికూడా శిరుపులి యూర్ దేవదేవుడు బాల శయనమూర్తిగానే భక్తులకు దర్శనభాగ్యాన్ని కలిగిస్తు న్నాడు.







మూలమూర్తి శ్రీపాదాలచెంత వ్యాఘ్రపాదమహర్షి విగ్రహప్రతిష్ఠ చేయబడి ఉంది. నాభికమలంలో చతుర్ముఖబ్రహ్మ, వ్యాఘ్రపాదవిగ్రహసమీపంలో కణ్వమహర్షి శిలకూడా మనకు కనిపిస్తుంది. తిరుమంగైఆళ్వార్లు ఈ దివ్యదేశానికొచ్చి శేష పాన్పుపై చిన్నమూర్తిగా పవళించి ఉన్న స్వామినిచూచి అయ్యో! ఇంత చిన్న స్వరూపమా భగవంతుడిది అని కాస్త బాధపడగా వెంటనే దేవ దేవుడు తనను పెద్దస్వరూపంతో సేవించుకోవాలని అభిలాష ఉంటే తిరుక్కణ్ణమంగై అనే దివ్యదేశంలో సేవించుకోవచ్చని అను గ్రహించారు.

**మూలమూర్తి** - అరుమాకడల్ అముదన్ (జలశయన పెరుమాళ్) దక్షిణదిక్కు, దక్షిణముఖం భుజంగ శయనం (బాలశయనం)

**ఉత్సవమూర్తి** - కృపాసముద్రుడు

**అమ్మవారు** - తిరుమామగళ్‌నాచ్చియార్

**ఉత్సవమూర్తి** - దయానాయకి

**తీర్థం** - అనంతసరస్సు, మానసపుష్కరిణి

**విమానం** - నందివర్ధనవిమానం

**స్థలవృక్షం** - బిల్వవృక్షం

**ప్రత్యక్షం** - వ్యాఘ్రపాదముని, వ్యాసమునులకు

**మంగళాశాసనం** - తిరుమంగైఆళ్వారులు (పదిపాశురాలు)

**ఆగమం** - పాంచరాత్రాగమం

**విశేషాలు** - శ్రీరంగంవలె దక్షిణదిక్కునుచూచే శయన భంగిమ, మానస అనంతపుష్కరిణులలో పవిత్రస్నానం చేసి బాలశయనమూర్తిని దర్శించుకుంటే సర్వదోషం తొలగుతుంది.

భక్తులు ఈ శిరుపులియూర్ భగవంతుణ్ణి దర్శించుకుని శతృత్వభావనలను వీడి, సత్ప్రవర్తన కలిగినవారై సమస్తదోషాలను పోగొట్టుకుని, ప్రశాంతంగా ఇహలోకజీవితాన్ని గడిపి తదుపరి భగవత్పాదారవిందాలను పొందుతారు.

శ్లో॥ బాలవ్యాఘ్రపురే కృపాజలనిధిః శ్రీదేవికా ప్రేయసీ
నంద్యావర్తవిమాన మానస మహత్తీర్థం తు అనంతాహ్వయమ్।
బాలవ్యాఘ్రముని ప్రసాద సుముఖః శేషాంగశాయీ సదా
శ్రీమాన్ దక్షిణదిఙ్ముఖః సురగణైః సంసేవితో రాజతే॥



పాఠకులకు, రచయిత(త్రు)లకు, ఏజెంట్లకు అందరికీ....

**ఆంగ్ల నూతన సంవత్సర**

మరియు

**సంక్రాంతి శుభాకాంక్షలు!**



దేవదేవుడైన శ్రీవేంకటేశ్వరుని
కరుణాకటాక్షవీక్షణాలు అందరిపై అనవరతం
ప్రసరించాలనీ మరియు ఆయురారోగ్య
ఐశ్వర్యాలు ప్రసాదించాలనీ
స్వామివారిని ప్రార్థిస్తూ...

మీ... ప్రధానసంపాదకుడు



ఇతరుల చెడుస్వభావాన్ని సహించడమే మంచివారి గొప్పగుణం

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## జనవరి 2024

శ్రీ శ్రీనివాస గోవిందా
శ్రీ వేంకటేశ గోవిందా

శ్రీ భక్తవత్సల గోవిందా
శ్రీ భాగవతప్రియ గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

## ఫిబ్రవరి 2024

శ్రీ నిత్యనిర్మల గోవిందా
శ్రీ నీలమేఘశ్యామ గోవిందా

శ్రీ పురాణపురుషా గోవిందా
శ్రీ పుండరీకాక్ష గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | | |

## మార్చి 2024

శ్రీ గోవిందా హరి గోవిందా
శ్రీ గోకులనందన గోవిందా

శ్రీ నందనందనా గోవిందా
శ్రీ నవనీతచోర గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |
| 31 | | | | | | |



### జనవరి

01 ఆంగ్లసంవత్సరాది
07-13 శ్రీఆండాళ్ నీరాట్టోత్సవం
14 భోగిపండుగ
15 మకరసంక్రాంతి
16 కనుమ,
శ్రీ గోదాదేవి పరిణయోత్సవం
25 శ్రీరామకృష్ణతీర్థముక్కోటి
26 భారతగణతంత్రదినోత్సవం
30 శ్రీత్యాగరాజస్వామి ఆరాధన

### ఫిబ్రవరి

09 శ్రీపురందరదాసు ఆరాధన
10-18 దేవునికడప,
శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
14 వసంతపంచమి
16 రథసప్తమి, భీష్మాష్టమి
20 భీష్మఏకాదశి
24 కుమారధారతీర్థముక్కోటి
29నుండి మార్చి 08వరకు
శ్రీనివాసమంగాపురం,
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం

### మార్చి

01-10 తిరుపతి,
శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం
08 మహాశివరాత్రి
17నుండి 25వరకు
తరిగొండ,
శ్రీలక్ష్మీనరసింహస్వామివారి బ్రహ్మోత్సవం
20-24 తిరుమల శ్రీవారి తెప్పోత్సవం
25 శ్రీలక్ష్మీజయంతి,
తుంబురుతీర్థముక్కోటి

# తిరుమల తిరుపతి దేవస్థానములు



## ఏప్రిల్ 2024

శ్రీ పశుపాలకశ్రీ గోవిందా
శ్రీ పాపవిమోచన గోవిందా
శ్రీ దుష్టసంహార గోవిందా
శ్రీ దురిత నివారణ గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | | | | |

## మే 2024

శ్రీ శిష్టపరిపాలక గోవిందా
శ్రీ కష్టనివారణ గోవిందా
శ్రీ వజ్రమకుటధర గోవిందా
శ్రీ వరాహమూర్తి గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 12 | 13 | 14 | 15 | 16 | 17 | 18 |
| 19 | 20 | 21 | 22 | 23 | 24 | 25 |
| 26 | 27 | 28 | 29 | 30 | 31 | |

## జూన్ 2024

శ్రీ గోపీజనలోల గోవిందా
శ్రీ గోవర్ధనోద్ధార గోవిందా
శ్రీ దశరథనందన గోవిందా
శ్రీ దశముఖమర్దన గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | | 1 |
| 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 | 12 | 13 | 14 | 15 |
| 16 | 17 | 18 | 19 | 20 | 21 | 22 |
| 23 | 24 | 25 | 26 | 27 | 28 | 29 |
| 30 | | | | | | |

### ఏప్రిల్

05-13 తిరుపతి, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
06 శ్రీ అన్నమాచార్యవర్ధంతి
09 శ్రీ క్రోధినామసంవత్సర 'ఉగాది'
11 మత్స్యజయంతి
12 నుండి 20 వరకు
వాయల్పాడు, శ్రీపట్టాభిరామస్వామివారి బ్రహ్మోత్సవం
13 శ్రీపంచమి
14 తమిళసంవత్సరాది, డా॥ బి.ఆర్.అంబేద్కర్‌జయంతి
17 శ్రీరామనవమి
17నుండి 25వరకు
ఒంటిమిట్ట, శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం
21-23 తిరుమల శ్రీవారి వసంతోత్సవం
23నుండి మే 01వరకు
నాగులాపురం శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం

### మే

01 మే డే, నర్మదానది పుష్కరప్రారంభం
10 పరశురామజయంతి, అక్షయతృతీయ
12 శ్రీరామానుజజయంతి, శ్రీ శంకరజయంతి
13 శ్రీరామజయంతి
14 తిరుపతి గంగజాతర
16-24 తిరుపతి, శ్రీగోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం
21-23 తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి వసంతోత్సవం
21-29 హృషీకేశ్, నారాయణవనం-
శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివార్ల బ్రహ్మోత్సవాలు
22 శ్రీనృసింహజయంతి,
తరిగొండవెంగమాంబజయంతి
23 శ్రీఅన్నమాచార్యజయంతి, శ్రీకూర్మజయంతి
29నుండి జూన్ 06వరకు
కార్వేటినగరం, శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం

### జూన్

01 శ్రీహనుమజ్జయంతి
17-21 తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి
తెప్పోత్సవం
19-21 తిరుమల శ్రీవారి జ్యేష్ఠాభిషేకం
17-25 అప్పలాయగుంట, శ్రీప్రసన్నవేంకటేశ్వర
స్వామివారి బ్రహ్మోత్సవం
21 ఏరువాకపూర్ణిమ
27-29 తిరుచానూరు, శ్రీసుందరరాజస్వామివారి
అవతారోత్సవాలు

# తిరుమల తిరుపతి దేవస్థానములు

## జూలై 2024

శ్రీ పక్షివాహన గోవిందా
శ్రీ పాండవప్రియ గోవిందా

శ్రీ మత్స్యకూర్మ గోవిందా
శ్రీ మధుసూదన హరి గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |

## ఆగష్టు 2024

శ్రీ వరాహ నరసింహ గోవిందా
శ్రీ వామన భృగురామ గోవిందా

శ్రీ బలరామానుజ గోవిందా
శ్రీ వేణుగాన ప్రియ గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 | 2 | 3 |
| 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 |
| 11 | 12 | 13 | 14 | 15 | 16 | 17 |
| 18 | 19 | 20 | 21 | 22 | 23 | 24 |
| 25 | 26 | 27 | 28 | 29 | 30 | 31 |

## సెప్టెంబర్ 2024

శ్రీ సీతానాయక గోవిందా
శ్రీ శ్రితపరిపాలక గోవిందా

శ్రీ అనాథరక్షక గోవిందా
శ్రీ ఆపద్బాంధవ గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | | | | | |



### జూలై

07 పూరీజగన్నాథరథయాత్ర
10-12 శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి సాక్షాత్కారవైభవం, శ్రీనివాసమంగాపురం
15 శ్రీపెరియాళ్వార్ శాత్తుమొఱ
16 తిరుమల శ్రీవారి ఆణివరఆస్థానం
17 తొలిఏకాదశి
21 గురుపూర్ణిమ, ఆళవందార్ వ.తి.న.
22 తిరుపతి శ్రీవిఖనసాచార్యులవారి శాత్తుమొఱ
29నుండి ఆగష్టు 07వరకు శ్రీఆండాళ్ తిరువాడిపూర్వంఉత్సవాలు
30 ఆడికృత్తిక

### ఆగష్టు

08 నాగచతుర్థి
09 గరుడపంచమి
13 తరిగొండవెంగమాంబ వర్ధంతి
15-17 తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం
15 భారతస్వాతంత్ర్యదినోత్సవం
16 శ్రీవరలక్ష్మీ వ్రతం
19 శ్రావణపూర్ణిమ, శ్రీహయగ్రీవజయంతి శ్రీవిఖనసమహాముని జయంతి
20 గాయత్రీజపం
26 శ్రీకృష్ణాష్టమి
27 గోకులాష్టమి

### సెప్టెంబరు

03 పోలాల అమావాస్య
05 శ్రీబలరామజయంతి, శ్రీవరాహజయంతి
07 వినాయకచవితి
15 శ్రీవామనజయంతి
16-18 తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి పవిత్రోత్సవం
17 అనంతపద్మనాభవ్రతం
18 మహాలయపక్ష ప్రారంభం

# తిరుమల తిరుపతి దేవస్థానములు



శ్రీ శరణాగతవత్సల గోవిందా
శ్రీ కరుణాసాగర గోవిందా

## అక్టోబర్ 2024

శ్రీ కామితఫలదా గోవిందా
శ్రీ పాపవినాశక గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | 1 | 2 | 3 | 4 | 5 |
| 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 13 | 14 | 15 | 16 | 17 | 18 | 19 |
| 20 | 21 | 22 | 23 | 24 | 25 | 26 |
| 27 | 28 | 29 | 30 | 31 | | |

శ్రీ ధరణీనాయక గోవిందా
శ్రీ దినకరతేజ గోవిందా

## నవంబర్ 2024

శ్రీ పద్మావతీప్రియ గోవిందా
శ్రీ ప్రసన్నమూర్తీ గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| | | | | | 1 | 2 |
| 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 10 | 11 | 12 | 13 | 14 | 15 | 16 |
| 17 | 18 | 19 | 20 | 21 | 22 | 23 |
| 24 | 25 | 26 | 27 | 28 | 29 | 30 |

శ్రీ సాలగ్రామధర గోవిందా
శ్రీ సహస్రనామ గోవిందా

## డిసెంబరు 2024

శ్రీ గరుడవాహన గోవిందా
శ్రీ గజరాజరక్షక గోవిందా

| ఆదివారము | సోమవారము | మంగళవారము | బుధవారము | గురువారము | శుక్రవారము | శనివారము |
|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 |
| 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 15 | 16 | 17 | 18 | 19 | 20 | 21 |
| 22 | 23 | 24 | 25 | 26 | 27 | 28 |
| 29 | 30 | 31 | | | | |

### అక్టోబరు

02 మహాత్మాగాంధిజయంతి, మహాలయఅమావాస్య
04-12 తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవం
04-12 తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి నవరాత్రిఉత్సవం
08 తిరుమల శ్రీవారి గరుడసేవ
09 సరస్వతిపూజ
11 దుర్గాష్టమి
12 విజయదశమి
31 నరకచతుర్దశి, దీపావళిపండుగ, ధనలక్ష్మిపూజ.

### నవంబరు

01 కేదారగౌరివ్రతం
05 నాగులచవితి
09 తిరుమల శ్రీవారి పుష్పయాగం
13 కైశికద్వాదశి
14 బాలలదినోత్సవం
15 కార్తికపూర్ణిమ
28 ధన్వంతరిజయంతి
28నుండి డిసెంబరు 06వరకు తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి బ్రహ్మోత్సవం

### డిసెంబరు

02 తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి గజవాహనోత్సవం,
06 పంచమీతీర్థం
07 తిరుచానూరు శ్రీపద్మావతిఅమ్మవారి పుష్పయాగం, సుబ్రహ్మణ్యషష్ఠి
11 గీతాజయంతి
12 శ్రీచక్రతీర్థముక్కోటి
14 శ్రీదత్తజయంతి
16 ధనుర్మాసం ప్రారంభం
30 తిరుమల శ్రీవారిసన్నిధిన అధ్యయనోత్సవారంభం

30-01-2024న
త్యాగరాజస్వామివారి ఆరాధనసందర్భంగా..

# నాదబ్రహ్మ త్యాగయ్య

- డా॥ కే.ఎస్.ఇందిర, 98491 00248

సంగీత సార్వభౌముడు, పరమభక్తాగ్రేసరుడు, భారతీయ సంగీతచరిత్రలోనే అత్యంత విశిష్టమైన స్థానం పొందిన మహా గాయక వాగ్గేయకారుడు శ్రీత్యాగరాజు. సంగీత సాహిత్యాలలో త్యాగయ్య ఒరవడి సుప్రసిద్ధం.

త్యాగయ్య జన్మతః రామభక్తుడు. చిన్నవయస్సులోనే తండ్రివద్ద సంస్కృతాంధ్రములు అభ్యసించారు. తల్లివద్ద జయ దేవుని అష్టపదులు, పురందరదాసు దేవురనామాలు, రామదాసు కీర్తనలు నేర్చుకున్నారు. తన మధురగాత్రంతో పూజామందిరం వద్ద కూర్చుని పాడుతూ ఉండేవారట. రామబ్రహ్మంగారు తన పుత్రుడైన త్యాగయ్యకు శాస్త్రీయసంగీతశిక్షణ ఇప్పించదలచి ప్రముఖవిద్వాంసుడు తంజావూరు ఆస్థానసంగీతజ్ఞులైన శొంఠి వేంకటరమణయ్యగారివద్ద శిష్యరికానికి ఏర్పాటుచేశారు. ఏకసంథాగ్రాహి అయిన త్యాగరాజు అనతికాలంలోనే సంగీత విద్యలో ప్రవీణులయ్యారు.

వీరు అమృతధారలు కురిపించే మధురభక్తికి త్యాగ నిరతిని రంగరించి, సంగీతసాహిత్యాలను మేళవించి ఎన్నో కృతులు రచించారు. త్యాగయ్యదృష్టిలో సంగీతం ముక్తికి



సాధనం. సంగీతాన్ని 'నాదోపాసన'గా సాగించిన త్యాగరాజు ఆ నాదాన్నే రామునిగా ఆరాధించారు. తనగృహంలో నిత్యం జరిగే అర్చనసమయంలో త్యాగయ్యగారు ఒక క్రొత్తకృతిని రామునికి కైంకర్యంగా, ఆశువుగా గానం చేసేవారు. వీరి కృతులలో రామ కథ, రామవైభవం, రామతత్త్వం ప్రత్యక్షమౌతాయి. మరోవైపు అద్వైతవేదాంతపరిమళాలు గుబాళిస్తుంటాయి.

త్యాగయ్య రామభక్తియే తన సామ్రాజ్యమనుకొన్న భాగవతోత్తముడు. ఐహికవిషయాలందు విముఖుడై తన సంగీతాన్ని రామసేవకు వినియోగించిన నిరాడంబరుడు. తంజావూరునేలిన మరాఠారాజు రెండవశరభోజి త్యాగయ్య ప్రతిభ తెలుసుకున్నవాడై అంతటి మహానుభావుడు తన ఆస్థానంలో ఉంటే మంచిదని భావించి ధనకనకవస్తువాహనా లను ఇచ్చి త్యాగయ్యను తోడ్కొనిరమ్మని సేవకులను పంపిం చాడు. వారెళ్లి ఆ నిధులను త్యాగయ్య ముందుంచారు. అది చూచి... నాదోపాసకుడు, సంగీతబ్రహ్మ త్యాగయ్య

**'నిధి చాల సుఖమా, దేవుని సన్నిధిసేవ సుఖమా,**
**నిజముగ బల్కు మనసా!**

అంటూ... ఆస్థానానికి వెళ్లడంవల్ల వచ్చే నిధులు సుఖా న్నిస్తాయా? ఆర్తజనులపాలిటి పెన్నిధి అయిన రామునిసన్నిధిన ఉండి నిరంతరం సేవించడం సుఖాన్నిస్తుందా? నిజం చెప్పు ఓ మనసా! అంటూ తన మనసును తానే ప్రశ్నించుకుంటూ ఆత్మా శయధోరణిలో కీర్తన గానం చేశారు. మహారాజులందించిన సత్కారాలను తిరస్కరించి కేవలం రామభక్తితత్పరుడై, నిత్యము శిష్యసమేతుడై తంబూర చేతబూని మెడలో జోలె ధరించి దివ్య నామకీర్తనలను గానం చేస్తూ తిరువయ్యూరువీథుల్లో ఉంఛవృత్తి

చేసుకొంటూ శిష్యులకు విద్యాదానం చేస్తూ కాలం గడిపారు. ఉంఛవృత్తి అంటే తనకు ఆ రోజుకు కావల్సిన ధాన్యాన్ని భిక్షాటన చేసి జీవితాన్ని కొనసాగించడం.

నాదబ్రహ్మోపాసకుడైన త్యాగయ్య కర్ణాటకసంగీతానికి మకుటం లేని చక్రవర్తి అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయన కృతులన్నీ భక్తిపారవశ్యస్తుతిలో ఆశువుగా వెలువడిన అద్భుతమైన పలుకులే! రాగస్వరూపాన్ని బాగుగా ఆకళింపు చేసుకున్న త్యాగయ్య తాను సృష్టించిన అనేక క్రొత్తరాగాల్లోనూ, వందలకొలది రసవత్తరమైనకృతులను రచించి కర్ణాటక సంగీత ప్రపంచంలో అత్యున్నతస్థాయిని పొందారు.

త్యాగయ్యగారి కృతులు పండితులను, పామరులను కూడా రంజింపచేస్తాయి. అందుకే వీరి రచనాశైలి ద్రాక్ష పాకంతో పోల్చబడింది. సులభంగా అర్థమయ్యే లలితమైన పదాలతో, ఉదాత్తభావాలతో, మధురశైలితో, విరివిగా వాడిన లోకోక్తులతో, సామ్యాలతో, మెండైన రాగభావాలతో అలరారే త్యాగయ్యకృతులు కర్ణాటకసంగీతప్రపంచంలో విలువకట్టలేని సంపదలయ్యాయి.

మనసు తడిస్తే ఓ రాగం, హృదయం ఉప్పొంగితే మరో రాగం. భక్తి వెల్లువైతే ఇంకో రాగం..., సంగీతం హృదయ స్పందనకు ఓ అద్భుతమైన ప్రతిరూపం. భావమైనా, రాగమైనా, గానమైనా మనస్సు పొరల్లోంచి వస్తే అదే మాధుర్యమౌతుంది. త్యాగయ్య రామభక్తితో ఏ అద్భుతభావమైతే పలికించాడో అలాగే ఆయన అనుభూతులు మహాద్భుతరాగాలయ్యాయి. ఆయన రచించిన ప్రతి కృతి, ప్రతి ఆలాపనా జీవితానుభవాల్లోంచి వచ్చినవే. గుండెపొరల్లోని ఆర్ద్రతతో తడిచినవే. అందుకే అవి అంత గొప్పవయ్యాయి. నవరసాలు ఒలికించిన వీరికృతులు అసామాన్యాలు.

అపూర్వమైన సంకీర్తనసామ్రాజ్యాన్ని స్థాపించిన త్యాగ 'రాజ' బ్రహ్మను పొందిన తెలుగువారు ధన్యులు. భారతీయులు భాగ్యవంతులు.

త్యాగరాజు శివుండు, తాభాగవతుల-
కగ్ర గణ్యుందు, తారక మనవరతలు
జపము సల్పుకితాన తత్త్వదృశుడితడు
మానవుడు కాదు, దేవుండు మనకు నిజము

అని చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రిగారు కీర్తించిన మాటలు అక్షరసత్యాలు.

# శ్రీకృష్ణామృతం...

నారాయణాచ్యుతా నారదాదివినుత
నిర్ద్వైతజ్ఞానావృత (జ్ఞానామృత)
గూఢమూ అవతారతత్త్వం గుహుని
తెలియుటే పారమార్థకం

ప్రథమం మత్స్యరూపాయ వేదవిద్యరక్షకా
దుర్గుణాసురసంహార జ్ఞానవిద్యలనీయవే

ద్వితీయా కూర్మావతార మనః మంథరధారక
జ్ఞానసాధనమార్గాన దన్నువై బలమీయవే

తృతీయా వరాహ భువిగమన నిర్దేశక
బుద్ధిగతి వీడనీక మార్గదర్శివై కావవే

చతుర్థ నారసింహ సంశయంబులు చీల్చవే
అంతయు నీవే అన్న సత్యమును మదినింపవే

పంచమ వామనావతార అహంకారమునణచవే
నేను నాదన్న భావన త్రుంచి మము పాలింపవే

షష్ఠమ పరశురామ రాజసవిధ్వంసక
త్రిసప్తసంహారకర్త సత్యమును స్థాపించవే

సప్తమ రామచంద్ర దశేంద్రియ నియంత్రక
మోహకామపాశమోచక ధర్మస్థాపక బ్రోవవే

అష్టమ శ్రీకృష్ణ మాధవ జ్ఞానముక్తిబోధక
అనాహిత నాదరూప నీ సన్నిధానము చేర్చవే

నవమం బలరామ హలధారకకర్షకా
మనఃక్షేత్రమున బీడుతీసి
భక్తిసస్యము పండించవే

దశమం కల్క్యావతార
కలికల్మషభంజకా
కలిదోషనివారక సుమతుల
కాపాడవే



-'అనంత'
కృష్ణసుందరి సత్తిరాజు,
99103 45794

# గోదాదేవికల్యాణం

- శ్రీమతి కొల్లి విజయలక్ష్మి, 9676244685



16-01-2024న గోదాదేవిపరిణయోత్సవం సందర్భంగా...

మధురభక్తిమార్గంలో ప్రయాణం చేసి, మాధవుని మనువాడి, మహిని పునీతం చేసిన మహిళామణి గోదాదేవి. ఈమె శ్రీమహాలక్ష్మి అంశయని కొందరు, భూమాత అంశయని మరికొందరు అంటారు. మొత్తానికి ప్రకృతిశక్తి అంశ ఈ తల్లి. కోద్దై అనే అరవపదానికి పూలమాల అని అర్థం. కోద్దై పదమే గోదాగ మారిందంటారు. గోదా అనగా జ్ఞానాన్నిచ్చేది అని అర్థం. తన గానంతో, ధ్యానంతో, పాశురాలతో, భక్తిప్రపత్తులతో ప్రపంచానికి మధురభక్తిచైతన్యస్ఫూర్తిని అందించిన మహాతల్లి గోదాదేవి. ఈమెనే ఆండాళ్ అనీ అంటారు. అంటే రక్షకురాలని అర్థం.

గోదాదేవి మంచి మాటకారి. మధురకవయిత్రి. ద్రావిడభాషపై మంచిపట్టున్న పడుచు. తన లక్ష్యం ఒక్కటే. అది “రంగనాథస్వామియే తనకు భర్తకావాలి” అని. అందుకు వ్రతం చేయాలి. నోములు నోయాలి. “పుణ్యంకొద్దీ పురుషుడు కదా!” భక్తిమార్గం తనకు తెలుసు. పూర్వం వ్రేపల్లె గోపికలు శ్రీకృష్ణుని పతిగా కోరి కాత్యాయనీవ్రతం చేశారు. అలాగే తనను తన చెలులతో శ్రీవ్రతానికి శ్రీకారం చుట్టింది. మధురభక్తి సామ్రాజ్యం ద్వారకవాటాలను అమ్మ తెరచింది. తాను అయోనిజ. భూమాత లేదా శ్రీమాత లేదా ఆ ఇద్దరిఅంశలు తనలో ఉన్నాయి. పురికొల్పాయి. ప్రేరణనిచ్చాయి. ఫలితంగా ‘తిరుప్పావై’ రూపుదిద్దుకొంది.

పరమాత్మే పూర్ణపురుషుడు. జీవాత్మలంతా స్త్రీరూపాలే. భగవంతుడు నాయకునిగ, భక్తుడు తనను తానే నాయికగా భావించుకొని భజించడం, కీర్తించడమే మధురభక్తి. గానంతో, ధ్యానంతో, దైవాన్ని నిల్పుకొని, దార్శనికతతో తనలో స్వామిని దర్శించుకోగల్గడం. సర్వం సర్వేశ్వరతత్త్వమే. సర్వసంబంధాలు స్వామియే. జన్మజ కర్మల పాపపుణ్యాలననుభవించి, సకల బంధుత్వబాంధవ్యాలనుండి జీవాత్మ పూర్తిగా విడివడడం మోక్షం. అదియూ పరంధామునిలో లీనంకావడం. పునర్జన్మ రహిత కైవల్యం. అదే శ్రీకైవల్యం. ఆళ్వారుల భక్తిసంప్రదాయంలో ఈ రీతి, నీతి, నియమం సుస్పష్టంగా గోచరిస్తాయి.

తిరుప్పావైవ్రతం ముప్పయిరోజులపాటు ధనుర్మాసంలో సాగింది. తిరుప్పావైలో గోదాదేవి ముప్పయిపాశురాలను గానం చేసింది. మార్గశిరమాసపువ్రతంగా ఈ నోము ప్రారంభమైంది. పాడిపంటలకు, దుర్భిక్షనివారణకు, వానలరాకకు స్వామిని ప్రార్థిస్తూ ప్రారంభమైన వ్రతమిది. కాని గోదామాత అంతరంగమంతా కాత్యాయనీవ్రతస్ఫూర్తియే. గోదాదేవి ఆత్మ పూర్తిగా పరమాత్మపాదసన్నిధికై పరితపించే ప్రపత్తి, శరణాగతులే కన్పిస్తాయి. అయితే సామూహికంగా ఈ వ్రతం చెలులతో సాగించింది.

గోదాదేవి తిరుప్పావైవ్రతంలో శరీరాన్ని పట్టించుకొనక, భౌతికాలపై ఆసక్తి, అనురక్తులను విడచి, పరమాత్మపై భక్త్యనురక్తులను పెంచుకొంటూ, పంచుకొంటూ ప్రొద్దులను కరగించుతుండగా తండ్రి విష్ణుచిత్తుడు విషాదమగ్నుడైనాడు.

అందునా బ్రాహ్మీముహూర్తంలో లేచి చన్నీటిస్నానం చేయడం, నిడువెంట్రుకలగుంపు మలచివైచి తడియొత్తి, నిరాడంబరవస్త్రధారియై, చెలులతో స్వామి మందిరానికి పోయి, ముగ్గులుపెట్టి, చెంగలువదండలు స్వామికి సమర్పించి, ధూపములిచ్చి, నైవేద్యములర్పించి, తాంబూలములందించి, గర్భగృహప్రదక్షిణలాచరించి, శఠకోపమును ధరించి, చరణతీర్థమును స్వీకరించి, తత్ప్రసాదలుబ్ధమైనమాలలను ధరించి, తిరిగి ఇంటికి వచ్చి, స్వామినే గానంచేస్తూ వియోగచ్యుతధైర్యయై ఉండడాన్ని తండ్రి గ్రహించాడు. అందుకే ఉండబట్టలేక విష్ణుచిత్తుడు స్వామితో “దేవా!! నీ సేవకురాలైన నా బిడ్డ గోదాదేవి విచిత్రమైనవ్రతంతో దేహాన్ని శుష్కింపచేసుకుంటోంది.

వద్దన్నా మాట వినకున్నది. తన తపశ్చర్య మాకు భిన్నంగా కన్పిస్తోంది. సర్వాంతర్యామివైన నీకు తెలియనిదేముంది? దయచేసి నా కర్తవ్యమేమిటో తెల్పు"మన్నాడు. స్వామి విష్ణు చిత్తుని అమాయకత్వానికి మందస్మితుడయ్యాడు. "విష్ణుచిత్తా! నీవు నీ కుమార్తెను శ్రీరంగానికి కొనిపొమ్మని" అజ్ఞాపించాడు.

విష్ణుచిత్తుడు గోదామాతను విల్లిపుత్తూర్‌నుండి శ్రీరంగంలోని రంగనాథునిఆలయానికి తీసుకొనిపోవడం, స్వామి కరుణాంతరంగితహృదయుడై గోదాదేవి మధురభక్తిపరిణతికి ముగ్ధుడుకావడం, విష్ణుచిత్తుని అనునయించి గోదాదేవిని తన శుద్ధాంతఃకాంతను చేసుకోవడంతో కథ సుఖాంతమయ్యింది.

అయితే, పాశురాలగానంతోనే పరమాత్ముని పాద పద్మాలలో గోదామాత లీనమైందన్నది ఐతిహ్యం.

మొత్తానికి సిరినోముతో శ్రీరంగనాథుణ్ణి భోగరంగనిగ చేసిన గోదామాత పన్నిద్దరాళ్వారులలో ఏకైక మహిళాఆళ్వారుగ నిలచింది.

మకరసంక్రమణకు ముందురోజు అదే భోగిరోజు గోదా రంగనాథులవివాహం కమనీయంగా, కడురమణీయంగా జరిగింది. ప్రకృతీపురుషుల ప్రణయపరిపక్వతకు, పరిపుష్టికిని కల్యాణం ఒక సంకేతం. ఆలుమగలు అద్వైతనిత్యత్వానికి, జీవేశ్వరుల చిన్మయతత్త్వానికి సూచిక. స్త్రీ, పురుషశక్తుల దాంపత్యానుబంధసంబంధమే విశ్వసృష్టికి, తుష్టికి, పుష్టికి ఎత్తిన పతాకం. దాంపత్యానుబంధంలోని అనిర్వచనీయానుభూతియే గార్హపత్య ధార్మికవ్యవస్థకు పునాది. ఈ నిజాన్ని ఋజువు చేయడానికి, లోకరక్షణ, జీవసంరక్షణలే ధ్యేయంగా దేవతా మూర్తులకల్యాణాలు వైదికధర్మయుక్తంగా సాగడంలో పరమార్థం. అదే సంకల్పంతోనే గోదాకల్యాణం ఆకృతిని దాల్చింది.

పర్వదినాలు, పావనసమయాలలో సందర్భశుద్ధిని అనుసరించి దేవతామూర్తులకల్యాణాలను నిర్వహించడం జరుగుతోంది. సందేశాత్మకస్ఫూర్తిగ, సంస్కారసంస్కృతులే నీతిగ, విశ్వశ్రేయోదాయకంగా ఈ కల్యాణాలు సాగుతాయి.

భాగవతులకథలను, భాగవతులమహిమలను, భాగ వతులనడక, నాణ్యతలను మనం గమనించాలి. గౌరవించాలి. భద్రపరచుకోవాలి. భద్రతకై భావితరాలకు అందించాలి. జీవి అంతిమలక్ష్యం ఒక్కటే. జీవధారియైన పరమాత్మసన్నిధికి చేరడం. అందుకున్నదారుల్లో కర్మజ్ఞానమార్గాలకన్నా, సులభమైన మార్గం భక్తిమార్గం. కలియుగంలో కలిపురుషుని కల్మషాల నుండి కాపాడడానికే పరమాత్మ శ్రీరంగంలో రంగనాథునిగ, తిరుమలలో శ్రీనివాసునిగ అర్చామూర్తియై వేంచేయడం జరిగింది. అది ఈ భువి చేసుకొన్న సుకృతం. అందుకు మనం కూడా స్వామిసేవకే అంకితం కావాలి. అదే గోదామాత చూపిన మార్గం.

## గ్రంథసమీక్ష

# శ్రీమద్భగవద్గీత-జీవనగీత

**రచయిత-** డా॥ బి.రామాచార్యులు; **సైజు-**1/8 డెమ్మీ సైజు; **పుటలు-**315; **వెల-**200/-, **ప్రాప్తిస్థానము-** డా॥ బి.రామా చార్యులు, గుళ్లదుర్తి(పో), కోవెలకుంట్ల (మండలం), నంద్యాల జిల్లా- 518 134. **ఫోన్-**96182 39912.

విశ్వవాఙ్మయానికి మూలాధారం శ్రీమద్భగవద్గీత. భారతీయసంస్కృతికి ప్రతీక, అన్నిధర్మాలకు జీవగఱ్ఱ. మానవకల్యాణానికి పతాక. సకలశాస్త్రాలకు పెన్నిధి. శ్రీమన్నారాయణుని దివ్యావతారమైన శ్రీకృష్ణపరమాత్మ ముఖ పద్మంనుండి స్రవించిన గీతామృతం సకలవేదాలసారం.

ఉపనిషత్తులవిభూతితో విరాజిల్లేగీతను శ్రీకృష్ణపర మాత్మ నరుడైన అర్జునునికి మార్గశిరశుద్ధఏకాదశిరోజున గురువై శిష్యునికి బోధించాడు.

గీతయొక్క అంతరార్థాన్ని గీతామకరందం ఇలా తెలియజేస్తోంది. కురుక్షేత్రం-హృదయక్షేత్రం; అర్జునునిరథం-శరీరం; సారథి-ప్రజ్ఞానరూపమగుబుద్ధి; శ్రీకృష్ణపరమాత్మ రథికుడు; అర్జునుడు-చంచలమనస్సు (జీవుడు); గుర్రాలు-ఇంద్రియాలు; కౌరవపక్షము-దుర్గుణాలు; పాండవపక్షము-సద్గుణసమూహము; అర్జునునివిల్లు-సాధనచతుష్టయము; సంజయుడు-వివేకము; ధృతరాష్ట్రుడు-అవిద్య; దుర్యో ధనుడు-కామము; భగవద్గీత-జీవునికి ప్రజ్ఞానరూపమైన బుద్ధిప్రసాదించే హితవాక్యాలు. ఇంతటి విశిష్టత కల్గిన భగవ ద్గీతను రచయిత 'జీవనగీత'గా రూపొందించి 31అంశాలతో మానవాళికి అందించిన సందేశాత్మకగ్రంథమిది.

*- ఆచార్య కోగంటి వేంకట అప్పలాచార్యులు.*



# శ్రీవేంకటేశ్వర వ్రతకల్ప వైశిష్ట్యం

– శ్రీ ఐనవోలు మోహనాచార్యులు,
80741 83737

**వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన।
వేంకటేశ సమో దేవో నభూతో నభవిష్యతి॥**

ఈ భూమండలంలో తిరుమలను మించిన దివ్య ప్రదేశమూ, వేంకటేశ్వరస్వామిని మించిన దైవమూ న భూతో న భవిష్యతి.

ఈ కలియుగంలో భక్తుల కొంగుబంగారమై కోరికలు తీర్చే ఆపదమొక్కులవాడు శ్రీవేంకటేశ్వరస్వామి. ఆ స్వామి నామం ఒక్కసారి స్మరిస్తే చాలు. చేసిన పాపాలన్నీ పటాపంచలు అవడమే కాక సర్వశుభాలు సిద్ధిస్తాయి.

కలియుగంలో ధర్మాన్ని నాలుగుపాదాలమీద నడిపించ డానికీ, భక్తులకష్టాలను తీర్చేందుకు గోవిందుడు స్వయంభువై, శరణుకోరిన భక్తులను అనుగ్రహించే భక్తవత్సలుడై ఏడు కొండలపైన కొలువైనాడు.

మనం మన అహంభావాన్ని, ప్రాపంచికవిషయాలపై కోరికలను విడిచిపెట్టి, మనస్ఫూర్తిగా స్వామి పాదపద్మాలను ధ్యానించినవారికి వెన్నుదన్నుగా నిలుస్తాడు. కలియుగంలో వేంకటేశ్వరునికంటె గొప్పదైవము లేదు. అందుకే ప్రతిరోజూ వేలాది మందిభక్తులు కలియుగవైకుంఠమైన తిరుమలకు వెళ్లి స్వామిని దర్శించి తరిస్తారు. తిరుమల దివ్యక్షేత్రం. భూలోకస్వర్గం.

తిరుమలలో మనం ఏ ప్రదేశంలోనైనా, ప్రశాంతంగా కూర్చుని ధ్యానంచేస్తే 'ఓంకారం' స్పష్టంగా వినబడుతుందనీ, నేటికీ తిరుమలలో ముక్కోటిదేవతలు మరియు మహామునులు అదృశ్యరూపాలలో సంచరిస్తూ ఉంటారని మహనీయులమాట. తిరుమల అంతటివిశిష్టతగల మహిమాన్వితమైన పవిత్రప్రదేశం.

గోవిందుడు భక్తవత్సలుడు. శరణు అన్నవారిని కాచే భక్తవరదుడు. అందుకే తనను నమ్మిన భక్తుల ఈతిబాధలను తొలగించేందుకు, భక్తులను సమస్యలనుండీ గట్టెక్కించేందుకు శ్రీవేంకటేశ్వరవ్రతకల్పాన్ని అనుగ్రహించాడు. సమస్యలలో చిక్కిన మానవులు ఒక్కసారి ఈ వేంకటేశ్వరవ్రతం చేసినట్లయితే ఆ సమస్యలనుండి బయటపడి సుఖశాంతులను పొందగలరు. అటువంటి వేంకటేశ్వరుని లీలలనుగురించి తెలిపేదే శ్రీవేంకటేశ్వరవ్రతకల్పం.

ఈ వ్రతంలోని మొదటికథ తిరుమలకొండపైనే వ్రాయ బడింది. ఇది వేంకటేశ్వరుడు స్వయంగా తెలుపగా.. మిగిలిన నాలుగుకథలకు విశ్వామిత్రుడు, భరద్వాజ, వసిష్ట మరియూ అత్రిమహర్షులు ప్రవర్తకులై ఉన్నారు.

కలియుగంలో శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం పొంద డానికి ఈ వ్రతం ఉత్తమమైనది మరియు సులభమైనమార్గం. ఈ వ్రతాన్ని ప్రతిఒక్కరు తమ తమ సౌలభ్యంప్రకారం చేయ వచ్చు. ఈ వ్రతం చేసిన కొద్దికాలంలోనే ఎలాంటికష్టాలైనా తొలగిపోతాయి. వ్రతం చేసేటప్పుడు భక్తి మరియు ఏకాగ్రత చాలా ముఖ్యం. ప్రశాంతమైనమనస్సుతో, భగవంతునిపాదా లపై పూర్తిఏకాగ్రత ఉంచి, ఈ వ్రతంచేస్తే వెంటనే పూర్తి ఫలితాన్ని పొందవచ్చు.

కలియుగంలో మనం ఎదుర్కొనేకష్టాలన్నీ, మన పరిమితులు మొదలైనవన్నీ శ్రీనివాసభగవానుడికి తెలుసు. అందుకే ఆయనను సంతోషపెట్టడానికి మరియు మనకష్టాలను తొలగించుకోవడానికి చాలా సులభమైనమార్గాన్ని మనకు అందించాడు. ఈ వ్రతం చేసేవారిని, కథలు వినేవారిని, ప్రసాదం భుజించేవారినికూడా ఆ శ్రీనివాసుడు తప్పక అనుగ్రహిస్తాడు. వారికష్టాలు తొలగిస్తాడు.

## వ్రతమును ఎప్పుడు చెయ్యాలి?

శ్రీవేంకటేశ్వరవ్రతాన్ని మార్గశిర, మాఘ, కార్తిక మాసాల్లో లేదా పౌర్ణమి, పంచమి, సప్తమి, ఏకాదశిరోజులలో లేదా శ్రవణానక్షత్రంరోజున చేసినా అత్యున్నతమైన ఫలితాలు ఉంటాయి. ఈ వ్రతం ఉదయం లేదా సాయంత్రంసమయాలలో చేయవచ్చు. ఈ వ్రతంలో ఐదుకథలున్నాయి. ఈ వ్రతాన్ని స్వగృహంలోనైనా, అద్దెఇంట్లోనైనా, గుడి లేదా ఏదైనా పవిత్ర స్థలంలోనైనా చేసుకోవచ్చు. అవకాశంమేరకు బంధుమిత్రులను ఆహ్వానించి వ్రతం చేయడం శుభకరం.

## శ్రీవేంకటేశ్వరవ్రతవిధానం

ముందుగా వ్రతం చేయబోయేప్రదేశాన్ని చక్కగా శుభ్రం చేసుకోవాలి. ఆ తర్వాత ఒకమండపాన్ని నిర్మించి, దానిలో వేంకటేశ్వరునిచిత్రపటాన్ని ఉంచాలి లేదా శ్రీదేవి, భూదేవిసమేత కల్యాణవేంకటేశ్వరుని చిత్రపటాన్ని ఉంచగలిగితే మరింత మంగళకరం. ఒకనాణెంపై వేంకటేశ్వరుని చిన్న విగ్రహాన్ని లేదా స్వామిరూపాన్ని ఉంచాలి లేదా కేవలం ఒక రూపాయినాణెం ఉపయోగించాలి. తర్వాత కలశం ఏర్పాటు చేసుకుని, నవగ్రహాలు మరియు అష్టదిక్పాలకులకోసం



ఆవాహన చేయాలి లేదా కనీసం వారిని మానసికంగానైనా ప్రార్థించాలి. వ్రతం నిర్విఘ్నంగా పూర్తి అయ్యేందుకు పసుపుతో చిన్నగణపతిని చేసి ప్రార్థించాలి. పూజ ముగిసినతర్వాత వ్రతం లోని ఐదుకథలను చదవాలి.

ఎవరైతే సంపూర్ణ భక్తిశ్రద్ధలతో ఈ వ్రతాన్ని ఆచరి స్తారో వారివద్దకు స్వామి స్వయంగా ఏదో ఒకరూపంలో వచ్చి ప్రసాదం తీసుకుంటాడని భక్తులవిశ్వాసం. బంధుమిత్రులమధ్య ఈ వ్రతాన్ని జరుపుకొనే వీలులేనివారు ఒంటరిగానైనా ఈ వ్రతాన్ని చేసుకోవచ్చు.

వ్రతకథ తర్వాత నైవేద్యంగా ఒక కొబ్బరికాయ సమర్పించాలి. సత్యనారాయణవ్రతం మాదిరిగానే గోధుమరవ్వ, చక్కెర మరియు నెయ్యితో మహాప్రసాదం చేయాలి. స్వామికి సమర్పించేముందు అరటిపండును ఈ ప్రసాదంలో పెట్టాలి. వ్రతకథతర్వాత మనం "గోవిందా గోవిందా" అని చెప్పాలి.

వేంకటేశ్వరస్వామికి తులసిఆకు అంటే చాలా ఇష్టం. కాబట్టి పూజాసమయంలో తులసిదళాలను నైవేద్యంగా పెడితే ఉత్తమఫలితాలను పొందుతారు. పూజతర్వాత ప్రతిఒక్కరూ తులసిని ప్రసాదంగా తీసుకుంటే అన్నిరకాలరోగాలు నశిం చడమేకాక అష్టైశ్వర్యాలు ప్రసాదించబడతాయి.

వ్రతం విరమించిన తర్వాత కొబ్బరికాయను, రవ్వతో చేసిన మహానైవేద్యంతోపాటు ప్రసాదంగా అందరికీ అందించి శ్రీనివాసునికృపకు పాత్రులు కావొచ్చు.

## వ్రతఫలితం

కష్టాలనుండి బయటపడాలంటే శ్రీవేంకటేశ్వరవ్రతం చేసుకోవడం మంచిదని ఆధ్యాత్మికగ్రంథాలు చెబుతున్నాయి. నియమనిష్ఠలను పాటిస్తూ, భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరవ్రతం జరుపుకోవడంవలన సమస్తపాపాలు నశిస్తాయి.

దోషాలు తొలగి, వ్యాధులు, బాధలు దూరమవుతాయి. తలపెట్టిన కార్యాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పూర్తవు తాయి. ధర్మబద్ధమైన కోరికలు నెరవేరుతాయి. అందువలన కష్టాలనుండి గట్టెక్కాలనుకునేవారు వ్రతకల్పం చెప్పినప్రకారం శ్రీవేంకటేశ్వరవ్రతం జరుపుకోవడంవలన శ్రీనివాసుని అనుగ్రహం తప్పక పొందగలరు.

శుభం భూయాత్



జీవితమంటే భయపడేవారు అప్పడే మూడొంతులు మరణించినట్లే

# తొండరడిప్పొడి ఆళ్వార్

- డా॥ మైలవరపు లలితకుమారి, 99595 10422

శ్రీరంగనాథుని స్మరణంతో, తరించినవాడే తొండరడిప్పొడిఆళ్వార్ (లేదా) విప్రనారాయణుడు. ఈతడు వైష్ణవమతంలోని పన్నిద్దరా ళ్వారులలో పదవవాడు. ఈ పన్నిద్దరాళ్వారులు రచించిన శ్లోకములు "నాలాయిర" ప్రబంధమను దివ్యప్రబంధంగా సంకలనం చేయబడ్డాయి. అందులో విప్రనారాయణుడు 45 పద్యాలలో "తిరుమాలై"ని, 10పద్యాలలో "తిరుపళ్లియెళుచ్చి"ని రచించాడు. "దేవుని పాదధూళిని మోసిన వోటరి!" అని మొదలయ్యే పద్యాలతో నిత్యము రంగనాథుని మేల్కొలపడానికి "తిరుపళ్ళియెళుచ్చి" అనుపద్యాలలో విప్రనారాయణుడు శ్రీరంగ నాథుని స్తుతించాడు.

ఆళ్వారులు అంటే విష్ణువుకే జీవితం అంకితము చేసినవారని అర్థం. చోళసామ్రాజ్యంలోఉన్న 'తిరుమణ్ణంగుడి' అను ప్రాంతంలో వేదవిసారధర్ అను వైష్ణవ భక్తునికి శ్రీమన్నారాయణుని మెడలోఉన్న వనమాలఅంశతో జన్మించినవాడే శ్రీరంగే శునిభక్తుడైన విప్రనారాయణుడు.

విప్రనారాయణునికి శ్రీమన్నారా యణుని అన్ని ఆలయాల్లో పూజలు చేస్తూ, మాలాకైంకర్యం చేయాలన్నది ఆయన కోరిక. అలా కావేరీనదీతీరానున్న శ్రీరంగ క్షేత్రానికి వచ్చాడు. అక్కడ ఆలయంలో ఆదిశేషునిపై శయనించి ఉన్న పెరుమాళ్ విగ్రహాన్ని దర్శించి, ఆ మూర్తి సౌందర్యానికి విచలితుడై శ్రీరంగమే తనకు మోక్షక్షేత్ర మని భావించి, నిత్యం ఇక్కడి స్వామికి తానే స్వయంగా మాలలనల్లి సమర్పించ నిశ్చ యించుకొన్నాడు. పూలతో అందమైన మాలి కలనల్లి స్వామికి కైంకర్యం చేయసాగాడు. ఆయన మాలికలు, పాటలే స్వామికి మేలు కొలుపులయ్యాయి. ఈ విధంగా విప్ర నారాయణుడు శ్రీరంగనిసేవకు అంకిత మయ్యాడు.

ఆ సమయంలో నర్తకీమణులయిన దేవదేవి, ఆమె సోదరి రాజాస్థానంలో నృత్యం చేసి, రాజునానందింపజేసి, ఆయన కానుకగా ఇచ్చిన అనేక రత్నాభరణాలను గ్రహించి ఇంటికి బయలుదేరారు.



09-01-2024న తొండరడిప్పొడిఆళ్వార్ వర్షతిరునక్షత్రం సందర్భంగా...

ఆ సమయంలో మూర్తీభవించిన వైష్ణవమూర్తివలె, వైరాగ్యానికి కరచరణాద్యావయవములు న్నట్లుగా శ్రీరంగని నామస్మరణం చేసు కుంటూ ఇహలోకస్మరణంలేక తన్మయుడైన విప్రనారాయణుడు ఆశ్రమానికి వచ్చాడు. ఆతణ్ణిచూచిన దేవదేవి, ఆమెసోదరి అతని సమీపానికి వచ్చి నమస్కరించారు. భక్తిపారవశ్యంలో మునిగిఉన్న విప్ర నారాయణుడు వారిని కన్నెత్తిచూడక లోపలికి వెళ్లిపోయాడు. దేవదేవి అహం కరించి తాను నమస్కరించినా తనను నిర్లక్ష్యం చేశాడనే క్రోధంతో, ఈతడు విశ్వామిత్రాదులకంటే గొప్పవాడా? ఏ విధంగానైన తనవశం చేసుకుంటానని అక్కఎదుట ప్రతిజ్ఞచేసింది. వైష్ణవ భక్తులతో పంతంవద్దు. అవమానం కలుగుతుంది. ఆతని కోపానికి గురి కావద్దు. పదపద మనం ఇంటికి వెళదా మంటూ పరిపరివిధాల బ్రతిమిలాడింది. అక్కమాటవినక దేవదేవి తనపంతం చెల్లు వరకు తానిక్కడే ఉంటానని, తన నిశ్చయం తప్పదని, కాషాయాంబరాలు ధరించి ఆశ్రమంలో ఉండటానికి నిశ్చయించుకుంది.

దురాలోచనతో ఆశ్రమంలో ప్రవే శించిన దేవదేవి విప్రనారాయణుని సమీ పించి-

"పాదములొత్తేనయ్యా తావిపువ్వాడి
పదనుసేసి మెత్తేనయ్యా
సేదదీరి కొంత సేవ సేయించుకొనుము"

అని పలుకుతూ సేవనెపంతో ఆతనికి చేరువయ్యింది.

మాలాకైంకర్యములోగాని, పూజలోగాని, స్వామిసేవలో గాని ఏ లోపము చేయనప్పటికి విప్రనారాయణుని మనస్సు మాత్రం ఒకింత దేవదేవివైపు మొగ్గసాగింది. ఇది విష్ణుమాయయే గాని అన్యము కాదుకదా!

ఆ సమయంలో దేవదేవి తల్లి తనను చూడాలను కొంటున్నదని అక్క వచ్చి చెప్పిందని తాను ఇంటికి వెళ్ళివస్తానని విప్రనారాయణునితో చెప్పింది.

అలాగే అతణ్ణికూడా ఇంటికి తీసుకొచ్చింది. విప్ర నారాయణుడు కొంతకాలం దేవదేవి ఇంట ఉన్నాడు. కాని ఆ బడుగుబాపనివలన ఏవిధమైన ప్రయోజనంకాని, ధనలాభం గాని లేదని భావించిన దేవదేవి తల్లి అతణ్ణి ఇంటినుండి బయటకి గెంటేసింది. విప్రనారాయణుడు నేనెంత పాపం చేశానో కదా! ఇంతటి దుఃఖం కల్గిందని బాధపడ్డాడు. ఇదంతా శ్రీరంగనిసేవ మరచినందువల్ల కలిగిన పాపఫలితమే కదా! అని రోదించాడు. ఐనా దేవదేవి వియోగానికి బాధపడ్డాడు.

భక్తునిబాధను చూడలేక శ్రీరంగనాథుడు విప్రనారా యణునిరూపంలో వచ్చి రంగనాథునిఆలయంలోపలున్న బంగారుగిన్నెను విప్రనారాయణుని శిష్యునికిచ్చి, దానిని దేవ దేవితల్లికిచ్చి, తమను కలవాల్సిందిగా కోరాడు. శిష్యుడు ఆ గిన్నెను తీసుకెళ్ళి ఆమెకివ్వగా వాకిలి బయటనున్న విప్ర నారాయణుణ్ణి లోపలికి ఆహ్వానించింది. ఇది చూసిన విప్ర నారాయణుడు స్వామిసేవకాక ధనమే కదా అన్నింటికి మూల మని బాధపడ్డాడు. విప్రనారాయణుని మనస్సంతా వైరాగ్యంతో నిండిపోయింది.

మరునాడు అర్చకులు ఆలయం తలుపు తెరిచి స్వామికి పూజకైంకర్యాదులు చేయబోగా, అక్కడ పంచపాత్ర బంగారుగిన్నె కనబడలేదు. ఆ విషయాన్ని వారు ఆలయాధికారులకు చెప్పారు. వారు రాజుకు విషయం వివరించారు. రాజు విచా రించగా దేవదేవి ఇంటిదాసివల్ల విప్రనారాయణుడే తన శిష్యునితో ఆ గిన్నెను దేవదేవితల్లికిచ్చినట్లుగా తెలిసింది.

అప్పుడు రాజు దేవదేవి ఇంటికేగి బంగారుగిన్నెతోసహా విప్ర నారాయణుణ్ణి, దేవదేవిని తీసుకురావాల్సిందిగా భటులను ఆజ్ఞా పించాడు. సముఖానికి వచ్చినవారిని చూసిన రాజు నీవిట్లేల చేశావని ప్రశ్నించాడు. అప్పటికి ఆయనకు కమ్మిన మాయ పొరలు తొలగిపోయాయి. నేనెంత పాపం చేశాను. స్వామిని సేవించే ఈ చేతులింత నీచపుకార్యానికెట్లా పాల్పడ్డాయి. నా నిష్ఠ ఏమైంది. నా మనస్సెంత వ్యాకులమయింది అని ఎంతగానో బాధపడ్డాడు. నా స్వామికి నేనెంత ద్రోహం చేశానో కదా! స్వామి సేవాకైంకర్యాలు తప్ప అన్యమెరుగని నేను ఇంతటి అకార్యానికెట్లా పాల్పడ్డానో గదా! అని దుఃఖించాడు. తన తప్పుకు మరణం తప్ప మరే తరణోపాయం లేదని రోదించాడు.

దేవదేవికూడా విప్రనారాయణుడు తనను పట్టించు కోలేదనే అహంకారంతో, అక్కతో తాను వేసిన పందెంసంగతి రాజుకు చెప్పి తప్పంతా తనదేనని, అందుకు ఫలితంగా తనను శిక్షించుమని రాజును కోరింది. ఇద్దరూ తాము చేసినపనికి పశ్చాత్తాపం పొంది, శిక్షను విధించుమని ప్రార్థించారు. రాజు వారిని శిక్షించటానికి సిద్ధమయ్యాడు.

అప్పుడు శ్రీరంగనాథుడు ప్రత్యక్షమై రాజా! ఈ విప్ర నారాయణుడు నా భక్తాగ్రగణ్యుడు. ఈ జరిగింది సమస్తము నా మాయాకల్పితమే. ఈతడు సనకాదులకన్నా నాకు ప్రియ తముడు. ఈతనికి త్రైలోక్యసామ్రాజ్యమిస్తున్నాను. నేను ప్రియంగా ధరించే "వనమాలయే" విప్రనారాయణుడుగా భూలోకంలో అవతరించాడు. అందుకే మాలాకైంకర్యమీతనికి అత్యంత ఇష్టమైనకార్యం. ఈతనిభక్తిని పరీక్షింపగోరి నేనే ఈ మాయను పన్నాను. నా భక్తాగ్రేసరుడైన ఈతడు "తొండరడిప్పొడి ఆళ్వార్" అనగా "భక్తాంఘ్రిరేణువు" అను నామంతో విప్ర నారాయణుడుగా ప్రసిద్ధిపొందుతాడు అని వరమిచ్చాడు. శ్రీరంగనాథునిదర్శనంతో పరవశించిన విప్రనారాయణుడు...

జయ విహంగ తురంగ! జయకృపాపాంగ
జయదేవ మూర్ధన్య! జయజగన్మాన్య
సాక్షాత్కరించి మీ చనువు బాలించి
రక్షింపు మముచాల శ్రీరంగనాథ!

అని భక్తిపురస్సరంగా స్వామిని కీర్తించి ముక్తినొందిన పరమభాగవతుడుగా ప్రసిద్ధిచెందాడు.


జీవితం అచ్చువేయని పుస్తకం. దానికి రోజులే పేజీలు

# భగవద్గీత సందేశం

# ఆర్తనాదం

- శ్రీ కొలచిన సూర్యప్రకాశరావు,
94401 43332

శ్లో॥ చతుర్విధా భజంతే మాంజనాః సుకృతి నోర్జున।
ఆర్తోజిజ్ఞాసురర్థార్థిజ్ఞానీచ భరతర్షభ॥ (గీత 7-16)

(అర్జునా! ఆపదలో ఉన్నవారు, నన్ను తెలియాలనే సంకల్పం కలవారు, ధనధాన్యాలు, భోగభాగ్యాలు కోరేవారు; ఆత్మజ్ఞానులు, ఈ నలుగురు నన్ను సేవిస్తారు.)

వీరిలో ఆర్తులను కాపాడటంవల్ల భగవానుడు ఆర్త త్రాణపరాయణుడని బిరుదు పొందాడు. మానవుడు సాధారణంగా ఆపదలో ఉన్నప్పుడు ఆపదమొక్కులవాడా! ఏడు కొండలవాడా! శ్రీనివాసా! బ్రహ్మాండనాయకా! అని పదే పదే తలుస్తూ, నిలువుదోపిడీలు, ముడుపులు, మొక్కులు, తులాభారాలు, కల్యాణాలు, పొర్లుదండాలుచేస్తూ, ఆర్తనాదాలుచేస్తూ ఉంటారు. వారి దీనాలాపనలు విని భగవానుడు తన భక్తుని పరీక్షించి, నిరీక్షించి, చివరిక్షణంలో ఆదుకొని రక్షిస్తాడు. ఈ తరగతికి చెందినవాడే 'గజేంద్రుడు'.

గజరాజు తన ప్రియపరివారంతో విహరిస్తూ దప్పికతో, నిర్జనప్రదేశంలోని సరోవరంలో ప్రవేశించి మకరికి చిక్కాడు. అప్పుడు సఖులు ఎవరికివారే కొలనునుండి నిష్క్రమించారు.

కామక్రోధలోభమోహమదమత్సరాలతో మానవుడు సతమతమౌతూ పతనమైనవిధంగా, మకరిబలం తెలియక కరి నిద్రాహారాలు లేక, అహోరాత్రాలు పోరుసాగిస్తూ తనబలం తరిగి, మకరిబలం పెరిగి చేసేదిలేక, నేనింక దీనితో పోరాడలేను అనుకుంటూ నిస్సహాయస్థితిలో 'ఓ దేవాధిదేవా! అన్యథాశరణం నాస్తి త్వమేవశరణం మమ' అంటూ దీనాలాపనతో రెండుపాదాలు నేలపై మోపి, ప్రాణవాయువు



బంధించి, ఇంద్రియాలను నిగ్రహించి, ధ్యానముద్రలో ఉన్న యోగివలె తొండం పైకెత్తి, ముందు రెండుకాళ్లను జోడించి, ఓ దేవా! నాకు ఈ పాడుదప్పిక ఎందుకు కలిగింది? ఈ సరోవరానికి ఎందుకు వచ్చాను? ఇంతటి మహావిపత్తులో ఏల చిక్కుకొన్నాను? దేవా! ఆపదలో ఉన్నవారియందు, దిక్కులేని వారియందు, యోగీశ్వరులందు, అన్నిదిక్కుల నిండిఉన్నావని తత్త్వవేత్తలంటారే. అట్టి పరమాత్మ ఉన్నాడో? లేడో? అని సందేహించే ఇట్టి సంశయం నాకేల కలగాలి? ప్రపంచసృష్టికర్త, మాయాతీతుడు, శాశ్వతుడు, అనంతుడు, జన్మలేనివాడు, ఆది మధ్యాంతాలు లేని పరమాత్మకు నమస్కారం.

ఓ ఈశ్వరా! నా శత్రువుతో శక్తి ఉన్నంతవరకూ పోరాడాను. నా బలం తగ్గింది. ధైర్యం సన్నగిల్లింది. ప్రాణాలు వాటిస్థానాలు తప్పిపోయాయి. శరీరం అలసిపోయింది. మూర్ఛ వచ్చింది. ఇక నావల్లకాదు. దీనితో నేను పోరాడలేను. ఇక నీవే దిక్కు. ఇతరులెవ్వరూ నన్ను రక్షించేవారు లేరు. ఈ దీనుణ్ణి కాపాడటానికి జాగుచేయక త్వరగా వచ్చి నా ఇక్కట్లు తొలగించి కాపాడు. ఓ కరుణాసముద్రుడా! ఆపదలో ఉన్నవారిని కాపాడుతావట! ఏ దిక్కు తెలియక నిన్ను శరణువేడినవారిని, ఎట్టి స్థలమునకైనా వెళ్లి ఆదుకొంటావట! దీనుల ఆర్తనాదం వింటే ఓ! అని పలుకుతావట! వెంటనే వచ్చి రక్షిస్తావట! సమస్తాన్ని చూడగలవట! నా మొర విని నా అపదను బాపి నన్ను కాపాడటానికి ఇంతవరకు రాకపోవటానికి కారణం తెలియదు. ఇక నా కర్మ ఇంతే అంటూ... గజేంద్రుడు తన తొండమును ఆకాశం వైపు ఎత్తి నిట్టూర్పులు విడుస్తూ... బాధపడుతున్నాడు. ఆ ఆర్తనాదం విని భగవానుడే శీఘ్రమే వచ్చి మకరిని సంహరించి కరిని రక్షించి విజయసూచకంగా పాంచజన్యాన్ని పూరించాడు.

ఈ కథవల్ల దైవాన్ని సర్వస్యశరణాగతిగా నమ్మిన వారిని భగవానుడు తప్పక రక్షిస్తాడు అని మనకు తెలుస్తోంది.

*ఓం శాంతి శాంతి శాంతిః*



# పతంజలి యోగసూత్రములు

– డా॥ స్వర్ణ సాంబశివరావు,
99894 91600

పతంజలియోగసూత్రాలను విషయాలనుబట్టి నాలుగువిభాగాలుగా చేశారు. అవి 1)యోగము–దానిలక్ష్యాలు 2)యోగము–దానిసాధన 3)యోగము–యోగశక్తులు 4)యోగము–మోక్షము.

ఆధ్యాత్మికసత్యాన్వేషణకు యోగవిద్య గొప్ప సాధనం. దైహిక, మానసికశక్తుల సమగ్రపరిణతికి ఇది సాధనం. పరమలక్ష్యమైన సుఖం, శాంతి సాకారం కావటంలో ముఖ్యభూమికయైన సమతౌల్య సాధనకు యోగవిద్య దోహదం చేస్తుంది. ఇందులో నాలుగుసూత్రాలున్నాయి. అవి–

**సూత్రం-1- 'జన్మౌషధి మంత్రతపః సమాధిజాః సిద్ధయః'**

**వివరణ-** సిద్ధులు పుట్టుకతోనే రావచ్చు. ఇవి పూర్వ జన్మలలో చేసిన పరిశ్రమలసంస్కారఫలంగా లభిస్తాయి. వీరికి దైవచింతన, దైవజ్ఞానం, దయ, ప్రేమ అనేవి బాల్యంనుండే వికసిస్తాయి. కొన్ని ఓషధులసేవనంద్వారా అతీంద్రియదర్శనాలు కలుగవచ్చు. కాని ఇవి ఆధ్యాత్మికం కావు. పైగా ఆధ్యాత్మికతను నిర్వీర్యం చేసి, మనోవైకల్యాన్ని కలిగించే ప్రమాదముంది. మంత్రజపమూ, తపోనిష్ఠా అనే ఈ రెండున్నూ ఆధ్యాత్మికసాధనలకు శక్తివంతంగా తోడ్పడగలవు. సాధకుని ఆత్మవిశ్వాసాన్ని, సంకల్పాన్నీ దృఢతరం చేస్తాయి. ఇక సమాధి అన్నది ఆత్మదర్శనానికి రాజమార్గమే.

**సూత్రం-2- 'జాత్యన్తర పరిణామః ప్రకృత్యాపూరాత్॥'**

**వివరణ-** మనలోను, మనచుట్టునూ క్రమపరిణామశక్తి వ్యాపించిఉన్నది. ఈ పరిణామం అన్నది వ్యక్తిని అంతకంతకు పూర్ణునిగా చేయటానికే. జీవ పరిణామం ఏ విధంగా సాగుతుందో భౌతికశాస్త్రాలు చెప్పినట్లే ఆధ్యాత్మిక పరిణామాన్ని యోగశాస్త్రం వివరిస్తుంది. పరిణామం జరిగే తీరుతుంది, అదియే భవిష్యద్రూపాన్ని సంతరించుకొంటుందన్న విషయంమాత్రం ఒక్క మానవుడు మాత్రమే ఆకర్షించుకోగలడు. ఈ విషయంలో కర్మప్రసంగం. వాని దుష్కర్మలు అడ్డుగోడలై సహజపరిణామాన్ని దారి మళ్లించగలవు. సత్కర్మలు అన్నవి ఈ అడ్డుగోడలను తొలగించేవి. ప్రతివ్యక్తి తన ఆధ్యాత్మిక పరిపూర్ణతసాధనకు సత్కర్మలు చేయక తప్పదు.

**సూత్రం-3-'నిమిత్తమప్రయోజకం ప్రకృతీనాం వరణభేధస్తు తతః క్షేత్రికవత్'**

**వివరణ-**మానవుడు తన ఇంద్రియాలద్వారా లభించే ఆనందమే అత్యున్నతమని భావిస్తే, ఆ ఇంద్రియసౌఖ్యంకోసం అదుపుతప్పి ప్రవర్తిస్తాడు. అనగా దుష్కర్మలు చేస్తూ తన ఉన్నతిని తానే నశింపచేసుకుంటాడు. అలా కాక మానవుడు తన ఇంద్రియసుఖం అసంపూర్ణమని గ్రహించి, పూర్ణత్వం కోసం ప్రయత్నించాలనుకుంటే, సత్కర్మలద్వారా తన ఆధ్యాత్మికమైన ఎదుగుదలకై అప్పటికే వాసనలరూపంలో ఏర్పడి ఉన్న అడ్డుగోడను తొలగించుకుంటాడు. ఈ విధంగా మానవుడు యోగియై ముక్తుడు కాగలడు.

**సూత్రం-4- 'నిర్మాణచిత్తాన్యస్మితాయాత్రాత్'**

**వివరణ-** మనస్సును అహంకారం చెడ్డదారిని పట్టిస్తుంటే దీనికి కారణం మానవులసంస్కారాలలోని భిన్నత్వం. ఈ సంస్కారం వారివారి పురాకృత కర్మలకు సంబంధించి ఉంటాయి. అహంకారం, శుద్ధాహంకారమనికూడా ఉన్నది. అంటే ఈ శుద్ధాహంకారానికే వేదాంతశాస్త్రపరిభాషలో ఏక జీవుడనిన్నీ, ఈశ్వరుడనిన్నీ పేర్లున్నాయి. దీనికే ప్రధానం, ప్రకృతి అని కూడా పేర్లున్నాయి. ఇదే జగత్కర్త, నడుస్తున్న లోకానికి సృష్టికర్త.

శ్రీవేంకటేశ్వరలీలలు



# నమ్మకం

– శ్రీమతి కోడూరు మారుతీరత్నా, 73861 58062

ఇది నా జీవితంలో జరిగిన యదార్థసంఘటన. నిజంగా ఇది జరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామివారు లీల చూపించారు. అది ఆ ఏడుకొండలస్వామి నా సొమ్ము పోకుండా కాపాడినరోజు.

మా ఊరి వేంకటేశ్వరస్వామిగుళ్ళో బ్రహ్మోత్సవాలు జరుగుతుంటే అక్కడికి మా అమ్మ, నేను వెళ్ళాం. గుళ్ళోకివెళ్ళి దణ్ణం పెట్టుకున్నాం. నా పర్సులో చాలా డబ్బులున్నాయి. ఐనా నేను పెద్దగా కానుక ఏమి వడ్డించకుండా, మా ఆయన వచ్చినప్పుడల్లా బాగానే వడ్డిస్తారుగా అని అనుకొని, గుడి బయట కొంచెం దూరంగా భోజనాలు పెడుతున్నారు అంటే ఇద్దరం వెళ్ళి భోజనం చేసి అయిపోగానే బయటకు వచ్చి వెళదాం అనుకొని బస్సు వస్తే ఎక్కాం. బస్సు బయలుదేరింది. కండక్టర్ వచ్చి టిక్కెట్లు అనగానే తీసుకుందామని పర్సు చూస్తే లేదు. అంతే గుండె గుభేల్‌మంది. మా అమ్మని అడిగా. నాకు ఇవ్వలేదుగా అంది. ఎంత వెతికినా నా పర్సు కనపడలేదు.

అంతే! ఇద్దరం బస్సు దిగేసి భోజనాలు చేసినచోట ఏమన్న పడ్డదేమో అని అక్కడికెళ్ళి వెతికాం. ఎంత వెతికినా దొరకలేదు. నాకు ఏడుపు ఆగటం లేదు. మమ్మల్ని చూసి అక్కడ ఒక ఆయన ఏమయిందమ్మా అని అడిగాడు. సంగతి చెప్పాం. ఏడవకండి ఈ గుడి 'ధర్మకర్త' చాల మంచివాడు. ఆయన ఏదో ఒకటి చేస్తాడు రండి అని ఆయనదగ్గరకు మమ్మల్ని తీసుకెళ్ళాడు.

ఆయనకు విషయం చెబితే ఆయన నొచ్చుకొని బాధపడకండి అని ఇంతకి ఆ పర్సులో ఎంత ఉన్నాయి అని అడిగాడు. నేరుగా ఏడుస్తూ చాలా డబ్బులున్నాయండి. బంగారపు చెవి పోగులున్నాయండి. అదివిని బంగారంవి పర్సులో ఎందుకు పెట్టుకున్నావు అని అడిగాడు ఆయన.

అవి విరిగిపోయాయండి. గుడినుంచి తిరిగి వెళ్లేటప్పుడు వాటిని మార్చుకుందామని పెట్టుకొచ్చానండి అని మా వారు ఏమంటారో అని భయపడుతూ... చెప్పాను.

సరే ఇంతకి సుమారు ఎంత ఉంటాయి. సుమారు పదిహేనువేలుపైనే ఉంటాయి అనుకుంటా అండి అన్నాను ఏడుస్తూ... సరే ఏడవకు. ఇదిగో ఇవి తీసుకో అని 'ఐదువేలు' నా చేతిలోపెడుతూ ఇక్కడకు వచ్చి పోగొట్టుకున్నారు అంటే మా పాలకమండలికి చెడ్డపేరు వస్తుంది. ఇవి తీసుకొని వెళ్లండి అన్నారు.

అప్పుడు నేను వెంటనే వద్దండి అని అక్కడనుంచి పరుగెత్తుకుంటూ గుడికి వెళ్లిపోయా. అక్కడ వెతుకుదాం. ఆ వేంకటేశ్వరుడు నన్ను తప్పక ఆదుకుంటాడు అనే నమ్మకంతో అనుకున్నా.

అంతే! నా నమ్మకం నిజమైంది. గుడిలోపల మెట్లు ఎక్కుతుంటే లోపల లడ్డూ అమ్మే గ్లాస్‌బాక్సులో నా పర్సు కనపడింది. గబగబా వెళ్లి అక్కడ కౌంటర్‌లో ఏమండి అది నా పర్సు ఇవ్వరా! అని అడిగాను.

అక్కడ ఆయన ఇది నీదా ఋజువేంటి అన్నాడు. దానిలో ఏడువేలుపైనే డబ్బులు, బంగారపుచెవికమ్మలు ఉన్నాయండి అన్నాను.

అప్పుడు ఆయన పర్సులో చూసి సరే ఇదిగో తీసుకో! అంత అశ్రద్ధ అయితే ఎట్లా అన్నాడు. ఆ హుండీలో ఎంతోకొంత వేసి అంటున్నంతలో నేనే గబగబా నా చేతికొచ్చినంత హుండీలో వేసి గుడిబయట మా అమ్మ ఉన్నచోటికి వెళ్ళాను.

అప్పుడు మా అమ్మ ఇవిగోమ్మా ఈ డబ్బులు తీసుకొని వెళ్దాం పదా అంటున్నంతలో.. కాదమ్మా! పర్సు దొరికింది అని సంతోషంతో చెప్పా ఆ డబ్బులు తీసుకొంటూ.

గుడి ధర్మకర్త దగ్గరకు వెళ్లి పర్సు దొరికిందండి అని చెప్పి ఆయన డబ్బులు ఆయనకు ఇచ్చేశా. ఆయన ఆశ్చర్యపోయారు. ఇన్నివేలమంది వచ్చినచోట పోయిన పర్సు దొరికిందా అని. నిజంగా ఆ వడ్డికాసులవాడే నీకిచ్చాడు అన్నారు. నాకు ఎంతో సంతోషం కలిగింది. అంత నమ్మకాన్ని కల్గించిన ఆ దేవదేవునికి సదా నా కృతజ్ఞతలు.

బాలనీతి



# ధర్మదేవత

- శ్రీ యెలిశెట్టి శంకరరావు

పూర్వం గండకీనదీతీరానున్న సిరిపురంరాజ్యాన్ని వీరసేనమహారాజు జనరంజకంగా పాలిస్తుండేవాడు. ప్రజలు పాడిపంటలతో, సుఖసంతోషాలతో జీవిస్తుండేవారు.

వీరసేనమహారాజుకు వేట అంటే మిక్కిలి మక్కువ. గండకీనదీతీరాన్ని ఆనుకునిఉన్న అడవుల్లోకి వేటకి బయల్దేరాడు. చాలాసేపు క్రూరజంతువుల్ని వేటాడిన రాజు రెట్టించిన ఉత్సాహంతో బాగా దట్టమైన అడవిలోకి వెళ్లిపోయి దారి తప్పాడు. వెనకఉన్న సైన్యాలు రాజుని అందుకోలేక వెనక పడ్డారు. రెండురోజులు గడిచాయి. రాజు జాడకోసం సైన్యాలు నాలుగుభాగాలుగా విడిపోయి నాలుగుదిక్కులా గాలించి అతి కష్టంమీద మూడోరోజున రాజుజాడ కనుక్కుని అందరూ ఒకచోట చేరుకున్నారు. గుర్రంమీద మూడురోజులు ఒంటరిగా ప్రయాణించిన రాజు బాగా దస్సిపోయి నిస్సత్తువుగా ఉండిపోయాడు. వెంట తెచ్చుకున్న ఆహారపదార్థాలు, నీళ్లు ఖర్చు అయిపోవటంతో సైనికులుకూడా దస్సిపోయారు. చాలాసేపు గాలింపుతర్వాత వాళ్లకి ఓ చిన్న పంటపొలం కనిపించింది. చెరకు, మొక్కజొన్నపంటలు ఏపుగా పెరిగి ఉన్నాయి. దాంతోపాటు మామిడి, పనస, సీతాఫలాలు విరగ్గాసి ఉన్నాయి. మధ్యలో తియ్యటినీటితో కూడిన ఊటబావి. సైనికులందరూ విచ్చలవిడిగా ఎవరికి కావాల్సినవి వారు తీసుకుని కడుపునిండా తిని, చల్లని మధురమైన బావినీరు తాగి, మహారాజుకి కావాల్సిన ఫలాలు, చల్లనినీరు ఇచ్చి రాజుని సేద దీర్చారు. కాసేపటికి తేరుకున్న మహారాజు తిరిగి సైన్యంతోసహా రాజ్యం చేరుకున్నాడు. కానీ చిత్రంగా మరుసటిరోజునుంచే రాజుకి తీవ్రఅశాంతి, అనారోగ్యం మొదలయ్యాయి. రోజురోజుకి క్షీణిస్తూ మంచం పట్టాడు. రాజవైద్యులు ఎన్ని చికిత్సలుచేసినా రాజుకి ఆరోగ్యం చేకూరలేదు.

మాసంరోజులు గడిచాక నిస్పృహతో రాజు తన గురువు తపోధనుడైన సదానందమహర్షిని పిలిపించి తనసమస్య వివరించాడు. ఆ మహర్షి తపోబలంవల్ల తన దివ్యదృష్టితో పరికించి సమస్య అవగతం చేసుకుని ఇలా చెప్పాడు.

"రాజా! రాజన్నవాడు ప్రజల్ని క్రూరమృగాల్నుంచి రక్షించాలి. అదీ ప్రజలు క్రూరజంతువులవల్ల తమకి ప్రాణ భయం ఉందని ఫిర్యాదు చేసినప్పుడు మాత్రమే. నువ్వు మృగయావినోదంకోసం అకారణంగా జంతువుల్ని వేటాడి మూగ జీవుల్ని హింసించావు. పైగా నీ సైనికులు ఓ పైరుపంటల పొలంలో చొరబడి, ఆ పేదరైతుపంటని దోచుకుతిన్నారు. అందులోకూడా నీ సైనికులు అతని అనుమతిని తీసుకోలేదు. అందులో నీకుకూడా భాగం ఉంది. ఆ పాపం కలిపురుషుడిగా మారి నిన్ను వెంటాడుతోంది."

ఇది విన్న రాజు విస్మయం చెందాడు. "మహాత్మా! మన్నించండి. నేను ఈ దేశపురాజుని. నా రాజ్యంలో ఉన్న సకలప్రజలమీద, వాళ్ల ఆస్తులు, ధనధాన్యాలు, పంటపొలాలు, తోటలు, వ్యాపారాలు, అన్నింటిపైనా నాకు సర్వాధికారాలు ఉన్నాయి. నాకు పాపం ఎలా అంటుతుంది" అని అడిగాడు.

దానికి సదానందమహర్షి చిరునవ్వు నవ్వి 'రాజా! నువ్వు చెప్పింది నిజమే. స్వయంగా నువ్వు ఆ రైతు తోటలకి వెళ్లి నీకు కావల్సినవి తిని, నీ సైనికులకు పంచినా నీకు దోషం అంటదు. లేదా నీ ఆజ్ఞపైన నీ సైనికులు ఆ తోటలోంచి పళ్లు, నీరు నీకు తెచ్చి ఇచ్చినా ఆ దోషం నీకు ఉండదు. ధర్మదేవతని ఇక్కడే నువ్వు సరిగ్గా అర్థం చేసుకోవాలి. నీకు దోషం అంటుకోవటానికి కారణం పై రెండు జరగలేదు. నీ సైనికుల అనాలోచితచర్య వల్ల తాత్కాలికంగా నీకు ఉపశమనం కలిగించాయే గాని, ఆ దోషఫలితాన్ని నువ్వు అనుభవించి తీరాల్సిందే అని చెప్పాడు.

రాజు సుదీర్ఘంగా ఆలోచించి దీనికి పరిహారం, ప్రాయశ్చిత్తం చెప్పమని అడిగాడు.

మహర్షి సూచనమేర రాజు అప్పటికప్పుడు ఆ పంట పొలంరైతుని పిలిపించాడు. ఆ రైతు పేదయువకుడైన ముకుందుడు. చక్కనైనరూపం. కాయకష్టం చేసుకుని తనకున్న చిన్న పొలంలో రకరకాలపళ్లు, ఫలాలు పండిస్తూ వృద్ధులైన తన తల్లి దండ్రులను పోషించుకుంటున్నాడు. రాజుసైన్యం తనపంటని మొత్తం కాజేయటంతో గత నెలరోజులుగా తల్లిదండ్రులకు సరైన తిండికూడా పెట్టలేక చాలా దైన్యస్థితిలో ఉన్నాడు.

రాజు అతనికి క్షమాపణలు చెప్పి తన తప్పుకి పరిహారంగా వెయ్యిబంగారునాణేలు బహూకరించాడు. ఆ పేదరైతు మహదానందపడి "రాజా! ఈ బహుమానంతో జీవితాంతం నా తల్లిదండ్రుల్ని అసలు ఏ లోటులేకుండా ప్రేమగా పోషించుకుంటాను" అంటూ రాజుకి కృతజ్ఞతలు చెప్పి వెళ్లిపోయాడు.

అలా ఆ రైతు నిష్క్రమించాక రాజు మహర్షివైపు తిరిగి 'మహాత్మా! ఇక నా పాపం ఉపశమించినట్లేనా?' అని అడిగాడు.

దానికి ఆ మహర్షి 'రాజా! రాజైనవాడు ఎప్పటికప్పుడు ధర్మశాస్త్రాలు, నీతిశాస్త్రాలు క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి లేదా తెలుసుకుంటుండాలి! ప్రస్తుతానికి నీ పాపం కొంత ఉపశమించినట్టే. కానీ, నీవల్ల ఆ పేదరైతుకుటుంబం మొత్తం నెలరోజులపాటు అకారణంగా క్షుద్బాధ అనుభవించాల్సి వచ్చింది. ఆ పాపం ఇంకా నీకు మిగిలే ఉంది' అన్నాడు.

దీనికి పూర్తి పరిహారం చెప్పాల్సిందిగా ఆర్తిగా వేడుకున్నాడు రాజు.



సదాచారవర్తనులైన పండితుల్ని, బ్రాహ్మణోత్తముల్ని సభకి మహర్షి సూచనమీద ఆహ్వానించాడు రాజు. కొన్ని వందల మంది తరలివచ్చారు. రాజు వాళ్లకి జరిగిందంతా వివరించి నెలరోజులపాటు ఆ పేదరైతుకుటుంబాన్ని ఆకలిబాధకి గురిచేసిన పాపం పోగొట్టుకోవటానికిగాను పదివేలబంగారు నాణేల్ని దానంగా ఇవ్వటానికి సిద్ధపడ్డాడు. ఎవ్వరూ ఆ దానాన్ని స్వీకరించటానికి ముందుకు రాలేదు. ఎందుకంటే వాళ్లు పండితోత్తములు. ఆ పాపఫలం ఆ దానం స్వీకరించినవాళ్లకి చుట్టుకుంటుందని వాళ్లకి తెలుసు. రాజు నిరాశగా వాళ్లవైపు చూస్తుండగా విశ్వవేదుడనే బ్రాహ్మణోత్తముడు లేచి తను ఆ దానం స్వీకరించటానికి తన సంసిద్ధతను తెలియజేశాడు.

రాజు ఆనందంగా పదివేలబంగారునాణేల్ని బహుమానంగా ఇవ్వగానే విశ్వవేదుడు తాను తెచ్చిన రెండుబంగారు నాణేల్ని వాటితో కలిపి అక్కడచేరిన పండితులకు, బ్రాహ్మణులకు ఉచితంగా పంచేశాడు. దానివల్ల ఆ పాపఫలం అతనికి అంటలేదు.

రాజు విశ్వవేదుణ్ణి విస్మయంగా చూసి 'మహానుభావా! తమ పరిస్థితి మెరుగుపడాలని అంత పెద్దమొత్తం దానంగా ఇచ్చాను. ఇప్పుడు తమరికి నేను ఇచ్చిందేముంది. ఇప్పుడు ఇదంతా మీరు దానధర్మాలు చేసి మీ పాపం పోగొట్టుకున్నారు. ఇప్పుడు నేను తమరికెలా సహాయపడగలను?' అని అడిగాడు.

దానికి విశ్వవేదుడు బదులిస్తూ 'రాజా! గండకీనదీ తీరాన ఉభయసంధ్యల్లో సంధ్యావందనంతోపాటు గ్రామీణుల ఇళ్లలో పూజాదికశుభకార్యాల్లో పౌరోహిత్యం చేసుకుంటుంటాను. దాంతో నేను, నా భార్యా ఆనందంగా జీవిస్తున్నాం. తమరు పవిత్రగండకీనదీతీరంలో ఓ అపురూపశివాలయం నాకు నిర్మించి ఇస్తే శేషజీవితం ఆ శివారాధనలో గడిపేస్తాను. దాంతో మనిద్దరి జీవితాలు ఆ పరమేశ్వరానుగ్రహంవల్ల పరిపూర్ణమౌతాయి. సకలదోషాలు తొలగిపోతాయి" అని చెప్పాడు. దానికి రాజు ఆనందంగా ఒప్పుకొని ఆ బ్రాహ్మణుడికి శివాలయం కట్టించి ధర్మదేవత అనుగ్రహం పొంది ధన్యుడయ్యాడు.

**నీతి**

**అధికారబలంతో ఇతరుల మనస్సు నొప్పించరాదు. అలా నొప్పిస్తే మనశ్శాంతి కరువౌవుతుందనేదే పై కథానీతి.**

ఆయుర్వేదం

# ఆముదం

–డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

మనం దైనందినజీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్యసమస్యలకు ఈ ఆముదం ఎలా ఉపయోగపడుతుందో ప్రస్తుతం తెలుసుకుందాం.

**కీళ్ళనొప్పలకు:** ఆముదంఆకులపై ఆముదం రాసి వెచ్చచేసి కీళ్ళపై పెట్టి కట్టులా కడుతుంటే కీళ్ళనొప్పులు, వాపులు తగ్గుతాయి.

**పచ్చకామెర్లకు:** ఆముదంఇగుర్లు, వెల్లుల్లిరెబ్బలు, మిరియాలపొడి సమానంగా కలిపి మెత్తగా నూరి ఎండించి పొడిచేసి నిల్వఉంచుకుని రోజు ఉదయం పరగడుపున 50 మి.లీ. తాజా పెరుగులో పావుటీస్పూనుపొడి కలిపి సేవిస్తూ చప్పిడిపథ్యం చేస్తూ తేలికపాటిఆహారం తీసుకుంటుంటే కామెర్లవ్యాధి త్వరగా తగ్గిపోతుంది.

**తామర, గజ్జిలాంటి చర్మవ్యాధులకు:** 250మి.లీ. ఆముదంలో 50గ్రా. నలగ్గొట్టిన వెల్లుల్లిరెబ్బల్ని వేసి వెల్లుల్లిరెబ్బలు నల్లగా



అయ్యేలా ఆముదాన్ని మరిగించి దించి వడగట్టి గోరువెచ్చగా ఉన్నప్పుడు 25గ్రా. పసుపుపొడి, 25గ్రా. వచపొడికలిపి చల్లారినపిదప అంతా బాగానూరి నిల్వఉంచుకుని రోజూ ఒకట్రెండుసార్లు లేపనం చేస్తుంటే త్వరగా ఫలితం కలుగుతుంది.

**వాతనొప్పలకు:** ఆముదం, ఆవనూనె, నువ్వులనూనె, వేపనూనె, కానుగనూనె ఒక్కొక్కటి 50 మి.లీ. చొప్పున తీసుకొని అన్నింటికి కలిపి వేడిచేసి దించి 10గ్రాములకర్పూరంపొడి వేసి చల్లారాక 10మి.లీ. నీలగిరితైలం(యూకలిప్టస్ఆయిల్) కలిపి నిల్వ ఉంచుకుని ఆయాభాగాలపై పూసి సున్నితంగా మర్దనచేస్తుంటే చక్కటి ప్రయోజనం చేకూరుతుంది.

**కాలిపగుళ్ళకు:** ఒకపాత్రలో 100గ్రా. ఆవనూనె, 100గ్రా. ఆముదం తీసుకొని అందులో 25గ్రా. తేనెమైనంముక్కలు కలిపి పొయ్యిపైపెట్టి తేనెమైనం కరిగేంతవరకు వేడిచేసి దించి చల్లారిస్తే ఆయింట్‌మెంట్‌లా తయారవుతుంది. దీన్ని రోజూ ఒకట్రెండుసార్లు లేపనంచేస్తుంటే అతిత్వరగా ఆ సమస్య తగ్గుతుంది.

**దురదలకు:** ఆముదం గింజల్లోని పప్పులని రాత్రిపూట తగినంత పెరుగులోవేసి ఉదయం రెంటినికలిపి మెత్తగానూరి దురదలున్న భాగంలో లేపనంచేసి గంటసేపాగి స్నానం చేస్తుంటే ఒంటి దురదలు తగ్గుతాయి.

**అతినిద్రకు:** తగినన్ని ఆముదంచెట్టుపూలలో తగినన్ని పాలు కలిపి మెత్తగా నూరినపేస్టును శిరస్సుపైపెట్టి కట్టుకట్టడంతో పాటు కణతలకికూడా పట్టిస్తుంటే ఈ సమస్య తగ్గుతుంది.

**వాతవ్యాధులు తగ్గేందుకు:** ఆముదంవేర్లు, శొంఠి, దేవదారు, దుంపరాష్ట్రం, తిప్పతీగెచూర్ణాలను (ఇవన్నీ ఆయుర్వేదఔషధ విక్రయశాలలో లభిస్తాయి) ఒక్కొక్కటి 50గ్రాములచొప్పున కలిపి ఉంచుకుని రోజూ 2పూటలా పూటకి 200మి.లీ.నీటిలో అరటీస్పూన్‌పొడికలిపి 50 మి.లీ. నీరు మిగిలేలా మరిగించి దించి చల్లార్చి వడగట్టి ఒకటీస్పూన్ తేనెకలిపి సేవిస్తుంటే కాళ్ళనొప్పులు, కీళ్ళనొప్పులు, కండరాలనొప్పులు, మెడనొప్పులు, భుజంనొప్పులులాంటి వాతవ్యాధులు త్వరగా తగ్గిపోతాయి.

జనవరి, 2024

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** భూమి కొనుగోలు చేయడం లేదా భూమివలన అధికఆదాయం కలుగుతుంది. అనవసరఖర్చులు తగ్గించుకోవటం మంచిది. పుణ్యక్షేత్రసందర్శనలు. గృహంలో మంగళతోరణాలతో శుభప్రదమైన, ఆనందదాయకమైన కలయికలు సంభవిస్తాయి.



**వృషభం–** వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్త అవసరం. సుబ్రహ్మణ్య ఆరాధనవల్ల అష్టమకుజప్రభావంనుండి బయటపడవచ్చు. అనవసరఖర్చులకు పోయి నష్టపోకుండా జాగ్రత్త అవసరం. ఆకస్మిక ధనలాభం వరిస్తుంది. వ్యవసాయంమూలంగా ఆర్థికలాభాలు కలుగుతాయి.



**మిథునం–**జ్ఞానంవృద్ధితో అనేకరకాలుగా వ్యాపార ప్రయోజనాలను పొందుతారు. బంధుమిత్రులతో ఆనందంగా ఉంటారు. సంతానంవిషయంలో ఆనందం కలుగుతుంది. దూరపుప్రయాణాలు చేస్తారు.



**కర్కాటకం–** అధికారం, శక్తి, శ్రేయస్సు, సమాజంలో గౌరవస్థానం మరియు విలాసవంతమైనజీవనం కల్గుతాయి. మానసిక శారీరక ఒత్తిళ్లతో సతమతమౌతారు. గతంలో చేసిన బాకీలు తీర్చగల్గుతారు. వాహనయోగం కల్గుతుంది.



**సింహం–** శుక్రసంచారం అనుకూలం. పేరు, కీర్తి, మంచిఆదాయం, కుటుంబంలో ఆనందం, మంచిఆరోగ్యం మరియు భౌతికసుఖాలుంటాయి. జీవితభాగస్వామి మరియు పిల్లలతో సమయాన్ని గడుపుతారు. రాజకీయంగా పలుకుబడిని పొందుతారు. మానసికంగా దృఢంగా ఉంటారు.



**కన్య–** నూతన గృహమందుప్రవేశించే అవకాశముంది. నూతన వస్తువస్త్రలాభం. ప్రభుత్వం నుండి లాభాలను పొందుతారు. ధనానికి లోటుండదు.



**తుల–** వ్యాపారంలో బాగా రాణిస్తారు. మీ బంధువులు, కుటుంబసభ్యులు మరియు స్నేహితులు మీ విలువను గుర్తించి గౌరవం ఇస్తారు. కుటుంబ సభ్యులతో కలసి పుణ్యక్షేత్రదర్శనం చేస్తారు. ధైర్యంతో, ప్రణాళికతో అనుకున్నది సాధిస్తారు.



**వృశ్చికం–** వాగ్ధాటి ప్రదర్శించి వక్తృత్వపుపోటీల్లో పాల్గొనడం, బహుమతులు గెలుచుకోవడం, సమాజంలో అరుదైన గౌరవం కల్గుతాయి. ఆర్థికంగా లాభపడతారు. విద్య మరియు ఉద్యోగవిషయాల్లో బాగా రాణిస్తారు.



**ధనుస్సు–** మీ ఇంట అభిమానుల, మిత్రుల సందడి. శరీరఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తారు. రక్తపోటు, నరాలనిస్సత్తువలను నియంత్రణలో ఉంచుకోగల్గుతారు. కార్యజయం కలుగుతుంది.



**మకరం–** వ్యవసాయలాభాలను ఆర్జిస్తారు. క్రొత్త పంటల్లో అధికలాభాలు పొందుతారు. మీ ప్రయత్నాల్లో విజయం పొందుతారు. ఆర్థిక సమస్యలనుండికూడా బయటపడతారు.



**కుంభం–** లాభాలలో వ్యాపారాలు నడుస్తాయి. వృత్తి, ఉద్యోగవిషయాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. అన్నింటా విజయం సాధిస్తారు. అనుకూలమైన సమయం. మీ పిల్లలకు కల్యాణాది శుభపరంపర ప్రారంభమవుతుంది.



**మీనం–** రాజకీయనాయకులకు పరీక్షాసమయం. విద్యార్థులు విద్యలో రాణిస్తారు. అనవసరమైన ఖర్చులుంటాయి. విద్యార్థులు కెరీర్‌గురించి ఆశావహదృక్పథం అలవర్చుకుని ముందుకు సాగుతారు.

జీవితంలో దూరాలోచన గల్గిన స్నేహితుణ్ణి మించిన వరం మరొకటి లేదు

విశ్వదాభిరామం    వేమన పద్యసూక్తి



## అన్నిచోట్ల ఎగతాళి తగదు

**తనదునృపతితోడ, తనయాయుధముతోడ,**
**అగ్నితోడ, పరులయాలితోడ**
**హాస్యమాడుటెల్ల ప్రాణాంతమౌ సుమ్ము!**
**విశ్వదాభిరామ! వినురవేమ!**

**అర్థాలు:** నృపతి= రాజు; ఆయుధము= రక్షణకు వాడే యుద్ధసాధనం; హాస్యము=నవ్వులాట; ప్రాణాంతము+ఔను= ప్రాణం తీసేది అవుతుంది.

**భావం:** రాజుతో హాస్యమాడగూడదు. తనదే అయినప్పటికీ ఆయుధంతో చెలగాటమాడకూడదు. అగ్గితోకూడా చెర్లాటమాడకూడదు. ఇతరుల భార్యతోను పరిహాసం పనికిరాదు. ఇవన్నీ ప్రాణానికి ముప్పు తెస్తాయి.

**వివరణ:** ఇటీవల నవ్వునుగురించి చాలా మంచిమాట చెబుతున్నారు. నవ్వించడం యోగం, నవ్వడం భోగం, నవ్వకపోవడం రోగం అంటూ... నవ్వు నాలుగువిధాలచేటు అనికూడా అంటారు. అలా అని నవ్వకుండా ఉండలేం. నవ్వుకూడా చాలా రకాలు. సాహిత్యంలో సమయం, సందర్భం బట్టి నవ్వడంలో తేడాలున్నాయి. నవ్వు తెప్పించడానికి ఒకమాటో, ఒకఆటో అవసరం. దానినే హాస్యం అంటాం. హాస్యం అన్నిచోట్లా పనికిరాదు. అట్లని హాస్యం లేకుండా ఉండలేం.

*– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు*

భాస్కరశతకం

## గౌరవం-అగౌరవం

ఉ. పండితులైనవారు దిగువందగ నుండగ నల్పుడొక్కడు
ద్దండతఁ బీఠమెక్కిన బుధప్రకరంబుల కేమి యెగ్గగున్?
కొండొకకోతి చెట్టు కొనకొమ్మల నుండగఁ గ్రింద గండ భే
రుండ మదేభ సింహనికురంబము లుండవె చేరి భాస్కరా!



కోతి ఒకటి చెట్టుమీద చిటారుకొమ్మన ఎత్తున కూర్చొని ఉన్నంతమాత్రాన ఆ చెట్టుక్రింద, నేలమీద సంచరించే గండభేరుండములు, మదపు టేనుగులు. సింహములగుంపులకు వచ్చిన తక్కువతనము లేదుకదా! అదేవిధంగా, పండితులైనవారు క్రింద కూర్చొనిఉండగా, అల్పుడైనవాడు ఉన్నతాసనంపై ఎక్కి కూర్చొన్నంతమాత్రాన ఆ పండితునికి ఏ మాత్రం అల్పత్వం రాదు. అనగా, వారి గౌరవం ఏ మాత్రమూ తగ్గదని భావం.

*– శ్రీ మారవి వెంకయ్య*

### నవంబరు నెల క్విజ్-16 సమాధానాలు

| | |
|---|---|
| 01) అధర్వణవేదం | 11) కఠోపనిషత్ |
| 02) అంకురారోపణం | 12) తీర్థాలు |
| 03) కుండలినీశక్తి | 13) జనకమహర్షి |
| 04) శ్రీపద్మావతీదేవి | 14) గోవు |
| 05) శ్రీశంకరభగవత్పాదులు | 15) ఋషభుడు |
| 06) బిల్వపత్రపూజ | 16) శ్రీమహావిష్ణువు |
| 07) తిరుమలకొండ | 17) జయము |
| 08) శంఖణుడు | 18) ఆకాశరాజు |
| 09) భగవద్గీత | 19) శ్రేష్ఠత్వం |
| 10) శకుంతల | 20) రథోత్సవం |

ఈ క్విజ్-16కు సరైన సమాధానాలు రాలేదు

**పాఠం-27**

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య    నిర్వహణ- మహామహోపాధ్యాయ కొంపెల్ల సూర్యనారాయణ

| | | | | | |
|---|---|---|---|---|---|
| तक्रम् | = మజ్జిగ | गन्तुम् | = వెళ్లుటకు, వెళ్ళన్ | वदति | = చెప్పుచున్నాడు |
| क्षीरम् | = పాలు | नेतुम् | = తీసికొని వెళ్ళుటకు (తీసికొని వెళ్ళన్) | आह्वयति | = పిల్చుచున్నాడు |
| पानीयम् | = మంచినీరు | आनीय | = తెచ్చి | आह्वास्यति | = పిలువగలడు |

**అ) ఈ క్రిందివాటిని తెలుగులోకి అనువాదం చేయండి?**

01) अद्य क्षीरं सम्यगस्ति।

02) त्वं गत्वा क्षीरमानीय क्षीरान्नं कुरु।

03) वयं सर्वे पानीयमानेष्यामः।

04) तक्रमानेतुं कः अगच्छत्?

05) ते बालकाः घृतार्थमागच्छन्।

06) गृहे किञ्चिदपि लवणं नास्ति।

07) यूयं मम जनकम् आनयथ।

08) युष्मत्कूपे जलं लवणम् अस्ति।

09) त्वं स्नानं कृत्वा शीघ्रमागच्छ।

10) यूयं ममानुजं झटिति भोजनार्थं वदत। वयं गत्वा तथैव वदिष्यामः।

**అ) జవాబులు**

01) ఈ రోజు పాలు బాగున్నాయి.

02) నీవు వెళ్ళి పాలు తీసుకొని పరమాన్నం చెయ్యి.

03) మనం అందరం మంచినీరు తెద్దాము.

04) మజ్జిగ తీసుకురావడానికి ఎవడు వచ్చాడు?

05) ఆ బాలకులు నేయికొరకు వచ్చిరి.

06) ఇంట్లో కొద్దిగాకూడా ఉప్పు లేదు.

07) మీరు మా నాన్నగారిని (తండ్రిని) తీసుకొని రండి.

08) మీ బావిలో నీరు ఉప్పగా ఉన్నది.

09) నీవు స్నానంచేసి వేగముగా రమ్ము.

10) మీరు నా తమ్ముడికి వెంటనే భోజనంకొరకు చెప్పండి. మేము వెళ్ళి అదేవిధంగా చెప్పగలము.

**ఆ) ఈ క్రిందివాటిని సంస్కృతంలోకి అనువాదం చేయండి?**

01) వాడక్కడ ఉన్నచో పిలువుడు.

02) మా తండ్రి ఎచటనుండెనో కొంచెము చెప్పుడు.

03) మన ఇంటిలో మజ్జిగ తెచ్చుటకెవరు వెళ్ళిరి?

04) మనమే వెళ్ళవలెను.

05) మీరు అంతవఅకు ఎక్కడికిని వెళ్ళకుడు.

06) మేమెక్కడికినీ వెళ్ళము.

07) ఇచ్చటనే ఉన్నాముగా.

08) అచ్చట బావి ఉన్నదిగాని మెల్లగా వెళ్ళుడు.

09) పిల్లలను అన్నం తినుటకు పిలువుడు.

10) ఇచ్చట పిల్లలెవరూ లేరు. వారెచటనున్నారో నీవే వెళ్ళి తీసుకొని రమ్ము.

**ఆ) జవాబులు**

01) सः तत्र भवति चेत् आह्वयत।

02) मम पिता कुत्र अस्ति इति किञ्चित् वदत।

03) अस्माकं गृहे तक्रम् आनेतुं के अगच्छन्?

04) अस्माभिरेव गन्तव्यम्।

05) यूयं तावत् पर्यन्तं कुत्रापि मा गच्छत।

06) वयं कुत्रापि न गच्छामः।

07) अत्रैव स्मः खलु।

08) तत्र कूपः अस्ति शनैः गच्छत।

09) बालकान् अन्नं खादितुम् आह्वय।

10) अत्र बालकाः न सन्ति। ते कुत्र सन्ति वा त्वमेव गत्वा आनय।

చిత్ర కథ

# కొలనిదోపరికి గొబ్బిళ్లో...

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.తులసీప్రసాద్

మార్గశిరమాసం... తెల్లవారుజాము... కన్నెపిల్లలు నిద్రలేచి, అందంగా ముస్తాబై ఇరుగుపొరుగు ఇళ్ళకి వెళ్ళి...




కన్యలందరూ కలిసి లక్ష్మీదేవిని గౌరీమాతనిగురించి పాటలుపాడుకుంటూ గోవులకొట్టాలకి చేరుకున్నారు. గోవులకి నమస్కరించారు. వెదురుబుట్టల్లో ఆవుపేడని నింపుకున్నారు. ఇళ్ళముందుకి చేరారు. కడవలతో నీళ్లు తెచ్చారు.





చుట్టూ కన్యలు... గోపికలు! మధ్యన లక్ష్మీదేవి.. గౌరమ్మ.. కన్నయ్య.. అందరినీ అర్చిద్దాం.
ధూపం.. దీపం... నైవేద్యం.. హారతి సమర్పిద్దాం!
ఇదిగో పండూ,
బెల్లం నైవేద్యంగా పెట్టాం
గొబ్బెమ్మలని చేతుల్తో తడుతూ,
వాటిచుట్టూ తిరుగుతూ
పాటలు పాడుదాం.
మనకి సంపద,
సౌభాగ్యం లభిస్తాయి.
పాడిపంటలు పెరుగుతాయి.
ఆరోగ్యం లభిస్తుంది.
గొబ్బిళ్ళో గొబ్బిళ్ళు...
కొలను దోపరికి గొబ్బిళ్ళో...
యదుకులస్వామికి
గొబ్బిళ్ళో...
ఇక గొబ్బెమ్మల్ని
జాగ్రత్తగా తీసి
ముగ్గుల్లో పెడదాం.
సాయం సంధ్యాసమయం.. గొబ్బెమ్మలని పాటలు పాడుతూ పిడకలుగా గోడకి కొడదాం.
భోగినాడు.. నెలరోజులూ ఎండిన
గొబ్బిపిడకల్ని పొయ్యిగా పేర్చి పొంగలి
వండి సూర్యుడికి నివేదన చేద్దాం
సర్వే జనాః సుఖినో భవన్తు
భోగిపండుగనాడు
ఈ పూజచేసినవారికి
భోగభాగ్యాలు ప్రాప్తిస్తాయని పెద్దలమాట.
వందనమమ్మా గొబ్బితల్లీ!

# బాలవినోదం




సమాధానాలు: 1- ఆ; 2- ఇ; 3- అ

## అంకెలు కలపండి!!




పిల్లలూ.. చక్రంలోని ఆయా వర్ణాలలోని ప్రశ్నలకు అనుగుణంగా, ప్రక్కన ఉన్న అదే వర్ణం గల నిలువుగడులలో సరియైన సమాధానం వ్రాయండి!






సమాధానాలు:
సూర్యుడు, చెఱకు, గోవు, సంక్రాంతి, హరిదాసు, నంది, పొంగలి, ఎద్దు

# రంగుల ప్రపంచం



బాలచిత్రకారులూ!
రంగులు ఉన్న బొమ్మను చూసి, ఆ రంగులనే.. రంగులు లేని బొమ్మకు వేయండి!!



# సంఖ్యావినోదం



| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| | | 0 | 3 | 2 | 9 | 5 |
| | | → | 1 | 2 | 3 | 4 |
| 8 | 9 | 5 | 4 | 3 | 7 | 8 |
| 7 | 10 | 11 | 8 | 4 | 5 | 9 |
| 12 | 14 | 13 | 12 | 9 | 6 | 16 |
| 6 | 4 | 10 | 9 | 8 | 7 | 15 |
| 16 | 15 | 11 | 12 | 13 | 14 | 10 |
| 15 | 13 | 12 | 18 | 15 | | |
| 15 | 14 | 15 | 16 | → | | |



1 నుండి 16 వరకు ఉన్న సంఖ్యలు వరుసగా కలుపుతూ పోతే ఆ చిలుక వెళ్లి గోదాదేవిని చేరుకుంటుంది. ఆ చిలుకకు మార్గం చూపిద్దామా!





# పిల్లలూ.. ఈ బొమ్మలో 7 తేడాలు గుర్తించండి!





వ్యక్తిత్వ వికాసం



# దిక్సూచి

- ప్రొ॥ జి.వి.శేషారెడ్డి,
94404 24322

సృష్టికి మూలం ఓం. ప్రకృతి పులకరించే మంత్రం ఓం. ఆకృతిని అందంగా తీర్చిదిద్దే పవిత్రలేపనం. ఓంకారాన్ని ఉచ్చరించి గమనిస్తే గోచరిస్తుంది సత్యం. ఓంకారమే సత్యం, శివం, సుందరం. సృష్టి ఉనికిని చాటేది ఓంకారం. ఓంకారం పరిశోధనకు మూలం. పరిశుద్ధతకు ప్రథమం. ఓంకారమే స్వస్థతకు మూలం, సర్వస్వం. ఆదికి మూలమంత్రం ఓంకారం. అంతాన్నుంచి సంరక్షించే సుదర్శనజపం.

మూలం అనే ప్రశ్నకు జవాబు ఓంకారం. గమనించేవాడు గొప్పవాడు. మౌనంగా ఉండేవాడు మౌనమంత్రగాడు. మౌనంలో ఓంకారం త్రినేత్రదర్శనానికి శ్రీకారం. సంసారిని సన్యాసిగా మార్చే అమృతమయం ఓంకారం. ఆదిని విశ్లేషించేది ఓం. అమృతత్వాన్ని అందించే అపురూపఐశ్వర్యం ఓంకారం. ఈశ్వరుణ్ణి ప్రసన్నం చేసే యజ్ఞం ఓంకారం. పరమేశ్వరుణ్ణి పరవశింపచేసేది ఓంకారం. మనలోని పరమాత్ముణ్ణి గోచరింపచేసే వేదం ఓంకారం. మనలోనికి మన ప్రయాణాన్ని సుగమం చేసే దిక్సూచి ఓంకారం. ఆదిని, అంతాన్ని అపూర్వంగా మలచే అపురూపదైవం ఓంకారం. ఈ సువిశాలప్రపంచానికి మూలస్తంభం ఓంకారప్రతిధ్వని. ఆధ్యాత్మికానికి అసలుసిసలైన రూపం ఓంకారం. ఏనాడైనా ఎక్కడైనా ఎప్పుడైనా మనఃశాంతిని ప్రసాదించే ఈశ్వరోపాసన ఓంకారమే. ఆదిత్యుని ఆనందపరిచేది, ఆయుష్షును వృద్ధిపరిచేది, ముక్కోటిదేవతలను మరిపించేది ఓంకారజపం. ఓంకారకీర్తనం దేహదేవాలయాన్ని శుద్ధిచేసే చికిత్సాలయం. నయంకాని రోగం ఏదైనా ఓంకారఉచ్చారణతో మటుమాయం. ఇది సత్యం. నిత్య ఓంకారస్మరణమే దేహక్షేత్రానికి వ్యవసాయం.

సూర్యోదయంలో ఓంకారం, సూర్యాస్తమయంలో ఓంకారనాదం. పవనం పలుకుతుంది ఓంకారం. పవనానికి ఓంకారం ద్వైతం. పవనాన్ని గమనిస్తే వీచేదిక్కు ఏదైనా నలుదిక్కుల నారాయణమంత్రమైనా ఓంకారమే కనిపిస్తుంది, వినిపిస్తుంది. ఓంకారం కనిపించి వినిపిస్తే దేహదేవాలయం పునీతమై జీవాత్మ పరమాత్మను చేరుకొంటుంది. ఓంకారం అతులితబలశాలిమంత్రం. ప్రతిమానవుని బాహుబలిమంత్రం ఓంకారమే. ప్రతిమాట ముందు, వెనుక ఓంకారం చేర్చితే వెయ్యిఏనుగుల బలాన్ని పుంజుకొంటాం. పునీతత్వాన్ని పుణికిపుచ్చుకోవచ్చు. నారాయణ, కేశవ, రామ, ఏడుకొండలవాడ, కైలాసగిరినామాలను జపించడంవల్ల పాపాలను హరింపచేసుకోవచ్చునని వేదం ఉవాచ. ఓంకారమన్నది మంత్రం, వేదం, ఋత్విజం, ఉపనిషత్ సారం, దైవస్తోత్రం, పరిశుద్ధపదం. అందుకే

### ఓంకారపఠనం...

సర్వరోగనివారణం
సకలభోగప్రదాయకం
సతతం సంతోషమయం
నిత్యం శాంతిప్రబోధం
అనునిత్యం అమృతతీర్థం
అడుగడుగున రక్షణకవచం
మంత్రాలలో ఆదిమంత్రం
జపాలలో మూలజపం
ముక్కోటిదేవతల మూలమంత్రం
ప్రశాంతిని ప్రసాదించే శాంతిస్తోత్రం
ప్రపంచశాంతినొసగే దివ్యఔషధం
పాపప్రక్షాళన చేసే దివ్యామృతం

ఓంకారము ఆదిమంత్రము
ఓంకారము మూలజపము
ఓంకారము పాపప్రక్షాళన అభిషేకము
ఓంకారము ప్రకృతిని మేలుకొలిపే సుప్రభాతం.

# క్విజ్ 18

01) గోమాత స్వరూపం? జ)..........
02) మూలాధారానికి అధిపతి? జ)..........
03) సంగీతచరిత్రలో గొప్ప వాగ్గేయకారుడు? జ)..........
04) హైందవసంస్కృతిలో అధికప్రాధాన్యకాంశం? జ)..........
05) ప్రపంచానికి మూలస్తంభం? జ)..........
06) త్రిదండం అని ఎవరికి పేరు? జ)..........
07) ఆదిమంత్రం? జ)..........
08) సంక్రాంతికి అర్థం? జ)..........
09) ఇంద్రదేవుణ్ణి ఆరాధించడం? జ)..........
10) భూమాత సౌశీల్యాన్ని అందుకొన్న తల్లి? జ)..........
11) తొండరడిప్పొడిఆళ్వారు మరోపేరు? జ)..........
12) స్వామి మేలుకొలుపుకు మరోపేరు? జ)..........
13) త్రినేత్రదర్శనానికి శ్రీకారం? జ)..........
14) గజేంద్రునికి ప్రాణభిక్ష పెట్టినవారు? జ)..........
15) సిరిపురం రాజ్యానికి రాజు? జ)..........
16) భూలోకస్వర్గమని పేరు కలిగింది? జ)..........
17) దేహక్షేత్రానికి వ్యవసాయంవంటిది? జ)..........
18) యజ్ఞోపవీతం అని ఎవరికి పేరు? జ)..........
19) యతిరాజులు? జ)..........
20) శ్రీవేంకటేశ్వరస్వామికి ఇష్టమైన దళం? జ)..........

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.
02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.
03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.
04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.
05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-01-2024.
06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.
07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.
08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.
09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.
10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.
11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .......... వయస్సు: ..........
పాఠశాల: .......... తరగతి: ..........
పేరు: ..........
చిరునామా: ..........
..........
..........
.......... పిన్‌కోడ్: ..........
ఫోన్ సంఖ్య: ..........

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్,
కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1. పేరు మరియు చిరునామా :**
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పనిసరి)

సెల్ నెం.

**2. కావలసినభాష :**

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3. సంవత్సరచందా : ☐ రూ.240/-**
జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4. విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-**

**5. చందా పునరుద్ధరణ :**
(అ) చందానెంబరు :
(ఆ) భాష :

**6. చెల్లించిన మొత్తం :**

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :
............................................................ తేది : ...................

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధ రించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 96



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

## అడ్డం

1)సూర్యుడు మకరసంక్రమణం చేసినప్పటినుండి ప్రారంభమగు కాలము(10); 6)దుష్టబుద్ధికూతురు(3); 7)పునుగుపిల్లి(3); 9)సంక్రాంతి మరుసటి రోజు(3); 10)అరణ్యము(3) 12)సూర్యుడు ఒకరాశి నుండి మరొకరాశిలో ప్రవేశించుటను ఏమంటారు(4); 14)అరిహుని భార్య(2); 17)మిత్రసహునిభార్య(4); 20)భోగిపండుగరోజున పసిపిల్లలకు ఇవిపోస్తారు(4); 22)ఈ దళాలంటే విష్ణువుకు చాలాఇష్టం(3); 25)భద్రునికుమారుడు(3); 26)ధనుర్మాసంలో ప్రతిఇంటిముందు కళ కళలాడుతుంటాయి.(4);

## నిలువు

2)సీతారాములకథను చెప్పే కావ్యం(5); 3)పుష్యమాసశుద్ధఏకాదశిని ఏమంటారు(3); 4)కశ్యపునిభార్య(2); 5)కనుముపండుగ మరుసటి రోజును ఏమంటారు?(4); 7)సూర్యుడు మకరరాశిలోనికి ప్రవేశించే రోజును ఏమంటారు?(6); 8)ధనాగారము(2); 11)ఈ రోజున గోదా రంగనాథులకల్యాణం జరిగింది(2); 13)మనస్సు(2); 15)ధ్వని(2); 16)రైతులు నెలపట్టినప్పటినుండి గోదాదేవికి దీనిని వండి ప్రసాదంగా ఇస్తారు(3); 18)ధనుర్మాసం నెలరోజులలో ఇవి ఇంటింటికి వస్తాయి(4); 19)సంక్రాంతికి ఈ పుష్పాలను గుమ్మాలకు తోరణంలా కడతారు(3); 21)పాము ఇది కల్గి ఉంటుంది(3); 23)లక్ష్మి(2); 24)సర్వనామము(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.
- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



తిరుమలలో 19-11-2023న
శ్రీవారికి జరిగిన పుష్పయాగమహోత్సవం



తిరుచానూరులో 19-11-2023న
శ్రీపద్మావతిఅమ్మవారికి జరిగిన పుష్పయాగమహోత్సవం



కైశికద్వాదశి పర్వదినసందర్భంగా 24-11-2023న తిరుమల మాడవీధుల్లో వైభవంగా ఊరేగిన శ్రీదేవి, భూదేవిసమేత శ్రీ ఉగ్రశ్రీనివాసమూర్తి. అందులో పాల్గొన్న తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీభూమన కరుణాకరరెడ్డి, తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., పాలకమండలి సభ్యులు, ఆలయాధికారులు, జియ్యంగార్లు మరియు భక్తులు.



తిరుమల శ్రీవారిఆలయంలో 26-11-2023న
వైభవంగా జరిగిన కార్తికదీపోత్సవం.
అందులో పాల్గొన్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్., తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజియ్యర్‌స్వామి, అర్చకులు మరియు ఆలయాధికారులు.










తిరుమల శ్రీవారి దర్శనార్థం 26-11-2023న విచ్చేసిన భారతదేశ ప్రధానమంత్రి గౌ॥ శ్రీయుతులు శ్రీ నరేంద్రమోదికి స్వాగతం పలుకుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రగవర్నర్ శ్రీ ఎస్.అబ్దుల్‌నజీర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి.

తిరుమల శ్రీవారి దర్శనార్థం 27-11-2023న తిరుమలకు విచ్చేసిన భారతదేశ ప్రధానమంత్రి గౌ॥ శ్రీయుతులు శ్రీ నరేంద్రమోదికి శ్రీవారి తీర్థప్రసాదాలను అందిస్తున్న తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డి మరియు తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ.వి.ధర్మారెడ్డి, ఐ.డి.ఈ.ఎస్.



SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Publised by Tirumala Tirupati Devasthanams printing on 25-12-2023 and posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd.No. TRP/155/2024-2026 "Licenced to post without prepayment No. PMGK/RNP/WPP-04(01)/2024-2026" posting on 5th of Every Month.